www.andhrajyothy.com
పేజీలు: 16
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50



బుధవారం | 27-8-2025 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 133

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: చవితి మ.3.45 తదుపరి పంచమి, నక్షత్రం: హస్త ఉ.6.04 తదుపరి చిత్త, వర్జ్యం: మ.2.57-4.44, దుర్ముహూర్తం: ఉ.11.51-12.41, అమృతఘడియలు: రా.1.37-3.24, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.04, సూర్యాస్తమయం: 6.29

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి'

వినాయక చవితి శుభాకాంక్షలు

సెలవు

వినాయక చవితి సందర్భంగా బుధవారం మా కార్యాలయాలకు సెలవు. కావున 'ఆంధ్రజ్యోతి' గురువారం (28-08-2025) సంచిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.

- మేనేజింగ్ డైరెక్టర్

ఐపీఎస్ సంజయ్ లొంగుబాటు

ఫైర్ నిధుల దుర్వినియోగం కేసులో రిమాండ్

వారం కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ పిటిషన్

మధ్యంతర బెయిల్ కోసం సంజయ్ వినతి


విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం వద్ద ఐపీఎస్ సంజయ్

విజయవాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ చీఫ్ ఎన్.సంజయ్ విజయవాడ ఏసీబీ కోర్టులో మంగళవారం లొంగిపోయారు. ఆయనకు న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వైసీపీ హయాంలో ఆయన సీఐడీ చీఫ్‌గా వ్యవహరించిన సమయంలో ఎస్సీ, ఎస్టీలకు అవగాహన సదస్సుల నిర్వహణ పేరుతో ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశారని ఏసీబీ అభియోగం మోపింది. అలాగే ఆయన అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్నప్పుడు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాల(ఎన్‌వోసీ) జారీలోనూ, వెబ్‌సైట్, యాప్ రూపకల్పనలోనూ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఏసీబీ కేసు నమోదు చేసింది. దీనిపై సంజయ్ హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందినప్పటికీ, సుప్రీంకోర్టు కొట్టివేసింది. మూడు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. దీంతో ఆయన

మిగతా 16వ పేజీలో...

ఐపీఎస్ సునీల్ సస్పెన్షన్ 6 నెలలు పొడిగింపు



నేటి నుంచే అమెరికా అదనపు మోత

మొత్తంగా 50 శాతానికి చేరుతున్న టారిఫ్‌లు

5.25 లక్షల కోట్ల భారత ఎగుమతులపై ప్రభావం

వస్త్ర పరిశ్రమ, పాదరక్షలు, రత్నాలు-ఆభరణాలు, రొయ్యల ఎగుమతులపై తీవ్ర ప్రభావం

అమల్లోకి మరో 25% సుంకాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 26: రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దన్నా వినడం లేదంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకాలు బుధవారం (27వ తేదీ) నుంచి అమల్లోకి వస్తున్నాయి. ఇప్పటికే భారత్ నుంచి వచ్చే దిగుమతులపై 25శాతం సుంకాలు వసూలు చేస్తుండగా.. దీనితో కలిపి

మిగతా 2వ పేజీలో...

రక్షణ శాఖ కాదు యుద్ధ శాఖ!

అమెరికా టెక్ కంపెనీలపై డిజిటల్ ట్యాక్స్‌లు వేసే దేశాలపై భారీగా సుంకాలు విధిస్తా

అయస్కాంతాల సరఫరా తగ్గిస్తే చైనాపై 200% సుంకాలు వేస్తా: ట్రంప్

దేశ ఆర్థిక భద్రతకు నేవీ వెన్నుదన్ను



ఉదయగిరి, హిమగిరి నౌకల ప్రారంభ వేడుకలో రాజ్‌నాథ్

విశాఖలో రెండు యుద్ధనౌకలు ప్రారంభించి జాతికి అంకితం

ఏకకాలంలో రెండు నౌకలు ప్రారంభించడం ఇదే తొలిసారి

13

పీ4లో బ్యాంకర్లూ భాగం కావాలి!

బడుగులకు సాయాన్ని సిబిల్ స్కోర్‌తో ముడిపెట్టొద్దు


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన సీఎస్ విజయానంద్, ఎస్ఎల్‌బీసీ చైర్మన్ నితీశ్ రంజన్, తదితరులు

రాజధాని రైతుల రిటర్నబుల్ ప్లాట్లపై రుణాలివ్వండి

లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం

ఏపీ లాజిస్టిక్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం

అమరావతిలో బ్యాంకుల హెడ్ ఆఫీసులు పెట్టండి

రాజధానిలో ఆర్థిక జిల్లా ఏర్పాటు చేయండి

నైపుణ్యాభివృద్ధికి ఆర్థిక తోడ్పాటు అందించండి

ఉన్నత విద్యకు ఊతమిచ్చేలా కార్యాచరణ ఉండాలి

బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబానికో పారిశ్రామికవేత్తను తయారుచేయడంలో భాగంగా వచ్చే ఏడాది మార్చి 8 నాటికి (మహిళా దినోత్సవం) లక్ష మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇందుకోసం సహకరించాలని బ్యాంకర్లను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీ-4 పథకంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన 232వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆయన ఈ సూచనలు చేశారు. వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఈ, డ్వాక్రా గ్రూపులకు రుణ సౌకర్య లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలపై

మిగతా 15వ పేజీలో...

దివ్యాంగులందరికీ పెన్షన్లు



13

13న ఇచ్చిన నోటీసులు నిలుపుదల

వారందరికీ మళ్లీ మెసేజ్‌లు.. స్పష్టత ఇచ్చిన సెర్ప్ అధికారులు

డీఎస్సీ అభ్యర్థులకు కాల్‌లెటర్లు విడుదల

రేపటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

15

పంచాయతీలకు రూ.1,120 కోట్లు



సెప్టెంబరు మొదటి వారంలో విడుదల

ఆర్థిక సంఘం నిధులపై సీఎం హామీ

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి


ఉపాధ్యాయులుగా ఎంపికైన కప్పట్రాళ్ల యువత విజయ సంకేతం

కత్తులు వదిలి.. కలం, హలం!

మారిన కప్పట్రాళ్ల ముఖచిత్రం


ఐపీఎస్ రవికృష్ణ దత్తతతో కీలక మార్పు

డీఎస్సీలో 8 మంది గురువులుగా ఎంపిక

ఏడాదిపాటు శిక్షణ ఇచ్చిన రవికృష్ణ

'సేవ్ ట్రీస్'ద్వారా రైతులకు మొక్కల పంపిణీ

'తానా' సహకారంతో స్త్రీశక్తి భవన నిర్మాణం


రవికృష్ణ

(కర్నూలు- ఆంధ్రజ్యోతి)

రాయలసీమలో కరుడు గట్టిన ఫ్యాక్షన్ గ్రామం అది!. పచ్చని ఆ పల్లెను ఫ్యాక్షన్ భూతం నాశనం చేసింది. ఐదు దశాబ్దాలకు పైగా ముఠా గొడవలతో రక్తం పారింది. పదేళ్ల క్రితం ఆ పల్లెలో ఓ ఐపీఎస్ అధికారి అడుగు పెట్టారు. "ఇది నా ఊరు.. ఇక్కడి జనం నా వాళ్లు.. పండుగైనా..

మిగతా 16వ పేజీలో...

బడి వచ్చిందోచ్

15

ఎట్టకేలకు నెరవేరిన 30 ఏళ్ల రామాంజనేయపురం కల

2 రోజుల్లో గ్రామంలో బడి ప్రారంభం

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక

గ్రామాన్ని సందర్శించిన పల్నాడు కలెక్టర్

లోకేశ్‌కు గ్రామస్థుల కృతజ్ఞతలు

గవర్నర్లు బిల్లుల్ని తొక్కిపెట్టొచ్చంటే..

ద్రవ్యబిల్లునూ ఆపేయొచ్చుగా?

అలాంటి పరిస్థితి సమస్యాత్మకం: సుప్రీంకోర్టు


శాసనసభ ఆమోదించిన ద్రవ్య బిల్లు గవర్నర్ సూచనలకు భిన్నంగా ఉంటే నిలిపేయొచ్చు

సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వెల్లడి

రాజ్యాంగం ప్రకారం బిల్లులకు ఆమోదం తెలిపే అధికారం రాష్ట్రపతికి, గవర్నర్లకు మాత్రమే ఉంది

సుప్రీంకోర్టులో బీజేపీ పాలిత రాష్ట్రాల వాదన

రేపు తమిళనాడు, కేరళ ప్రభుత్వాల వాదనలు



న్యూఢిల్లీ, ఆగస్టు 26: ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో ఆమోదించి పంపిన బిల్లులను తిప్పి పంపకుండా, ఆమోదం తెలపకుండా తొక్కిపట్టడం ద్వారా గవర్నర్లు వాటిని వీటో చేయగలరంటే.. ద్రవ్యబిల్లులను సైతం అలాగే ఆపే అవకాశం ఉందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. అలాంటి పరిస్థితే వస్తే అది సమస్యాత్మకమని వ్యాఖ్యానించింది. అయితే.. బిల్లులకు ఆమోదం విషయంలో గవర్నర్లకు, రాష్ట్రపతికి ఉన్న స్వతంత్ర అధికారాలను బీజేపీ పాలిత రాష్ట్రాలు

మిగతా 2వ పేజీలో...

అంబానీల 'వనతార'పై సుప్రీం సిట్

జస్టిస్ చలమేశ్వర్ నేతృత్వంలో ఏర్పాటు

ఏనుగుల సంరక్షణపై ఆరోపణల మీద దర్యాప్తు





ఆమె.. తాటకి, పూతన, లంకిణి!

అవినీతి అనకొండ.. వేల కోట్ల లూటీ

కట్టే చీర ధర రూ.లక్షన్నరకు పైనే

రూ.50 లక్షల విలువైన 11 విగ్గులు

టీడీఆర్ బాండ్ల దోపిడీకి అడ్డుకట్ట వేశాననే నాపై ఆమెకు ఆగ్రహం

అందుకే రూ.2 వేల కోట్లు తిన్నానని పొరుగు జిల్లాలో దుష్ప్రచారం

ఐఏఎస్ శ్రీలక్ష్మిని ఉద్దేశించి భూమన

13

తడి తగిలితే తంటా!

విజయవాడలోని ఓ పెట్రోలు బంకులో ఇటీవల ఒకే కుటుంబానికి చెందిన వారు మూడు మోటారు సైకిళ్లలో పెట్రోలు పోయించుకున్నారు. అవి కొద్ది సేపటికే మొరాయించి ఆగిపోయాయి. మెకానిక్ దగ్గరకు తీసుకెళ్లగా.. పెట్రోల్‌లో నీళ్లు కలిశాయని చెప్పాడు. దీంతో వాళ్లు బంకుకు వెళ్లి పెట్రోలుకు బదులు నీళ్లు పోశారంటూ గొడవకు దిగారు. ఇది కేవలం కొందరి సమస్య కాదు.. ఎంతో మందికి ఎదురవుతున్న అనుభవం! దీనికి కారణం.. పెట్రోలులో ఇథనాల్ మిశ్రమం సక్రమంగా జరగకపోవడమే!!

పెట్రోల్-ఇథనాల్ మిశ్రమ ప్రక్రియలో కంపెనీల నిర్లక్ష్యం

ఆయిల్ ట్యాంకులోకి నీటి చుక్క వెళ్లినా నీరవుతున్న ఇథనాల్

తరచూ వాహనాలకు రిపేర్లు

బంకుల్లోనే నీళ్లు కలిపేశారని భావిస్తూ వాహనదారుల గగ్గోలు

ఇటీవల.. పెట్రోల్‌లో ఇథనాల్‌ను 20 శాతానికి పెంచిన కేంద్రం

అవగాహన కల్పించడంలో విఫలం

నీరైపోతున్న పెట్రోల్



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించే క్రమంలో ఇథనాల్ కలిపిన పెట్రోలునే విక్రయించాలని కొన్నేళ్ల కిందటే కేంద్ర ప్రభుత్వం నిబంధన విధించింది. అంతే కాదు, ఇథనాల్ శాతాన్ని 20కి పెంచింది. కొన్నాళ్ల కిందటి వరకు ఆయిల్ కంపెనీలు ఒక శాతం ఇథనాల్ కలిపిన పెట్రోలును విక్రయించగా, తర్వాత ఇథనాల్ డోసును 5 శాతానికి, 10 శాతానికి పెంచారు. ఇటీవల కేంద్రం ఇథనాల్ శాతాన్ని 20కి పెంచాలని

మిగతా 13వ పేజీలో...

భారత్‌లో 8.74 లక్షల క్యాన్సర్ మరణాలు

» 2024లో 15.60 లక్షల కొత్త కేసులు: ఐసీఎంఆర్



న్యూఢిల్లీ, ఆగస్టు 26: భారత్‌లో క్యాన్సర్ మరణాలు పెరిగిపోతున్నాయి. 2024లో దేశంలో 15.60 లక్షల కొత్త కేసులు వెలుగు చూడగా వీరిలో 8,74,404 మంది మరణించారని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) పేర్కొంది. పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే 2045 నాటికి భారత్‌లో 24.60 లక్షల కేసులు నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా వేసింది. ఐసీఎంఆర్ నిర్వహించిన అధ్యయనం వివరాలు తాజాగా జర్నల్ ఆఫ్ ది అమెరికన్ మెడికల్ అసోసియేషన్(జేఏఎంఏ)లో ప్రచురితమయ్యాయి. ఆ నివేదిక ప్రకారం...

దేశంలో ఈ క్యాన్సర్లు ఎక్కువ

మన దేశంలో పురుషులు సాధారణంగా నోటి, ఊపిరితిత్తులు, ప్రోస్టేట్ క్యాన్సర్ల బారిన పడుతుంటారు. 2024లో నమోదైన కొత్త కేసుల్లో 1.13 లక్షలకు పైగా నోటి క్యాన్సర్‌కి సంబంధించినవే కావడం గమనార్హం. ఇక మహిళల్లో రొమ్ము, గర్భాశయ, అండాశయ క్యాన్సర్లు ఎక్కువ.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

కేన్సర్ ముప్పు తగ్గించడానికి జీవన శైలిలో మార్పులు చేసుకోవడం అత్యావశ్యకమని అధ్యయనం పేర్కొంది. పొగాకు వినియోగం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం, కొద్దిపాటి నడక, మెట్లు ఎక్కడం వంటి చిన్న చిన్న వ్యాయామాలు నిత్యం చేయడం, వేపుళ్లు, ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉండటంతో పాటు తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలి. కాగా, క్యాన్సర్ నియంత్రణ ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేస్తోందని ఐసీఎంఆర్ వెల్లడించింది. 30 ఏళ్లు నిండిన వారంతా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకొనేలా ప్రోత్సహిస్తోంది.


చాపకింద నీరులా ఊబకాయం..!

» మార్గదర్శకాల రూపకల్పనకు కేంద్ర ప్రభుత్వం చర్యలు



న్యూఢిల్లీ, ఆగస్టు 26: భారత్‌లో ఊబకాయం సమస్య చాపకింద నీరులా విస్తరిస్తోందని ఇటీవల ప్రధాని మోదీ హెచ్చరించారు. ప్రతిఒక్కరూ దీనిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నొక్కిచెప్పారు. ప్రస్తుతం భారత్‌లో ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో ఊబకాయాన్ని నియంత్రించేందుకు కేంద్రం తొలిసారిగా మార్గదర్శకాలు రూపొందించడంపై దృష్టిపెట్టింది. ఈ అంశంపై భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ అధ్యక్షతన ఆరోగ్య మంత్రిత్వశాఖ అధికారులు, హార్మోన్ సంబంధిత వ్యాధి నిపుణులు, పోషకాహార నిపుణులు, మధుమేహ, ఇతర వైద్య నిపుణులు ఇటీవలే సమావేశమయ్యారు. భారత్‌లో స్థూలకాయానికి సంబంధించి ఇప్పటివరకూ జాతీయస్థాయి మార్గదర్శకాలేమీ లేవు. డబ్ల్యూహెచ్‌వో విడుదల చేసిన మార్గదర్శకాలనే వైద్యులు అనుసరిస్తున్నారు. 2018లో ఐసీఎంఆర్ టైప్-2 డయాబెటిస్‌పై మార్గదర్శకాలు విడుదల చేసింది. దీనిలోనే ఊబకాయం గురించి కూడా పరిమిత సూచనలు చేసింది. అందులో.. స్థూలకాయం ఉన్నవారు జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా బరువు తగ్గడానికి ప్రయత్నించాలని పేర్కొంది. ప్రస్తుతం సూచించే మార్గదర్శకాల్లో ఊబకాయంపై ముందు జాగ్రత్త చర్యలు, నివారణ, స్క్రీనింగ్, రోగ నిర్ధారణ, చికిత్సపై దృష్టి సారించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

లోకం తీరు



రక్షణ శాఖ కాదు యుద్ధ శాఖ!

» అమెరికా టెక్ కంపెనీలపై డిజిటల్ ట్యాక్స్‌లు వేసే దేశాలపై భారీగా సుంకాలు విధిస్తా: ట్రంప్

వాషింగ్టన్, ఆగస్టు 26: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి చిత్రమైన వ్యాఖ్యలు చేశారు. అమెరికా రక్షణ శాఖ పేరు తనకు నచ్చలేదన్నారు శ్వేతసౌధంలో దక్షిణ కొరియా అధ్యక్షుడితో భేటీ అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. "రక్షణ శాఖ.. ఈ పేరు నాకు నచ్చలేదు. దేన్నుంచి మనం రక్షించుకోవాలి? ఎందుకు రక్షించుకోవాలి? మొదట్లో దీనిని యుద్ధ శాఖగా పిలిచేవారు. అది బాగుండేది. మనకు రక్షించుకోవడం మాత్రమే కాదు.. దూకుడుగా ఉండటం కూడా కావాలి" అని పేర్కొన్నారు. మనకన్నా ఎక్కువగా రష్యా చమురు కొంటున్న చైనా విషయంలో మాత్రం భిన్నమైన వైఖరి అవలంబిస్తున్నారు. చైనాతో అమెరికా 'గొప్ప బంధం' కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేకమైన 'రేర్ ఎర్త్' అయస్కాంతాల అంశంలో చైనాకు పట్టు ఉందని, కానీ విమానయాన రంగానికి సంబంధించి అమెరికా ఆధిపత్యం కొనసాగుతోందని చెప్పారు. ఒకవేళ అయస్కాంతాల సరఫరా తగ్గిస్తే మాత్రం చైనాపై 200% సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. అయితే అలా సుంకాలు విధించడం వల్ల చైనాతో వాణిజ్యం నడపలేమని పేర్కొన్నారు. కాగా, అమెరికాకు చెందిన అమెజాన్, ఫేస్‌బుక్, వాట్సాప్, గూగుల్ వంటి కంపెనీలపై వివిధ దేశాలు డిజిటల్ సర్వీసుల పన్ను(డీఎస్టీ)లు వసూలు చేయడం సరికాదని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా టెక్నాలజీ కంపెనీలపై డిజిటల్ పన్నులు, నియంత్రణలు విధించే దేశాలపై భారీగా సుంకాలు విధిస్తానని సామాజిక మాధ్యమం ట్రూత్‌లో పోస్టు పెట్టారు.



వ్యక్తిగత దాడులే ఆర్ఎస్ఎస్ విధానం

» గాంధీజీపైనా అదే పని చేశారు: రాహుల్ గాంధీ

» కుట్రతో ఓట్ల చోరీకి పాల్పడుతున్నారు: ప్రియాంకాగాంధీ

అరారియా, మధుబని, సుపాల్(బిహార్), ఆగస్టు 26: వ్యక్తిగత దాడులే ఆర్ఎస్ఎస్ విధానమని.. జాతిపిత మహాత్మాగాంధీ పైనా వారు అదే పని చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మంగళవారం ఆరోపించారు. బిహార్‌లో కాంగ్రెస్ మిత్రపక్షాలైన మహాఘట్‌బంధన్ సభ్యులతో నిర్వహించిన చర్చలో ఈమేరకు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆ వీడియోలో ఒక ధాబా వద్ద రాహుల్ గాంధీ ఆర్జేడీకి చెందిన తేజస్వియాదవ్, సీపీఐ ఎంఎల్‌కి చెందిన దీపాంకర్ భట్టాచార్య, మహాత్మాగాంధీ ముని మనవడు తుషార్‌గాంధీ, బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్‌కుమార్‌లతో కలిసి టీ తాగుతూ కనిపించారు. కాగా బిహార్‌లోని సుపాల్‌లో మంగళవారం జరిగిన ఓటర్ అధికార్ యాత్ర కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకాగాంధీ వాద్రా మాట్లాడుతూ.. ప్రత్యేక ఓట్ల తనిఖీ ద్వారా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం బిహార్‌లో కుట్రపూరితంగా ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఈమేరకు ఆమె 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

'వనతార'పై జస్టిస్ చలమేశ్వర్ నేతృత్వంలో సిట్

న్యూఢిల్లీ, ఆగస్టు 26: రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ కుటుంబం గుజరాత్‌లోని వనతారలో నిర్వహిస్తున్న జంతు సంరక్షణ, పునరావాస కేంద్రంపై వచ్చిన ఆరోపణలను నిగ్గు తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని సుప్రీంకోర్టు ఏర్పాటుచేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌కు 'సిట్' నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. హైకోర్టు మాజీ చీఫ్‌జస్టిస్ రాఘవేంద్ర చౌహాన్, ముంబై రిటైర్డు పోలీస్ కమిషనర్ హేమంత్ నగరాలే, కస్టమ్స్ శాఖ అడిషనల్ కమిషనర్ అనీశ్ గుప్తా ఈ బృందంలో ఇతర సభ్యులు. సెప్టెంబరు 12వ తేదీనాటికి సమగ్ర నివేదిక సమర్పించాలని 'సిట్'ను కోర్టు ఆదేశించింది.

పంచోలీకి పదోన్నతిపై జస్టిస్ నాగరత్న అసమ్మతి

» న్యాయవ్యవస్థకు ప్రతికూల ఫలితాలనిస్తుందని వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 26: పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయి పంచోలీకి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పిస్తూ అత్యున్నత న్యాయస్థానం కొలీజియం తీసుకున్న నిర్ణయానికి సీనియర్ జస్టిస్ బీవీ నాగరత్న గట్టి అసమ్మతి తెలిపారు. కొలీజియం వ్యవస్థకున్న విశ్వసనీయతను జస్టిస్ పంచోలీ నియామకం దెబ్బ తీస్తుందని పేర్కొన్నారు. పట్నా, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పంచోలీ, అలోక్ అరాధేలకు పదోన్నతి కల్పిస్తూ సోమవారం సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. ఐదుగురు సభ్యుల కొలీజియంలో 4:1 తేడాతో పంచోలీ నియామకానికి ఆమోదం తెలిపిందని మీడియాలో వార్తలొచ్చాయి. జస్టిస్ పంచోలీకి పదోన్నతి కల్పన వల్ల న్యాయం జరుగదని జస్టిస్ బీవీ నాగరత్న పేర్కొన్నట్లు సమాచారం. గత మే నెలలోనూ జస్టిస్ పంచోలీని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడూ జస్టిస్ నాగరత్న అసమ్మతి తెలిపినప్పుడు.. జస్టిస్ ఎన్వీ అంజారియాను కొలీజియం ఎంపిక చేసింది.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

» వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే

సోన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని.. కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి భార్య హత్య చేసిన ఘటన నిర్మల్ జిల్లాలో జరిగింది. ఈ నెల 22న జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేశ్ మీనా వెల్లడించారు. సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలో నివాసముండే తిరునగరి నాగలక్ష్మికి 30ఏళ్ల క్రితం హరిచరణ్‌తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. అయితే, అదే గ్రామానికి చెందిన అంకం మహేశ్‌తో నాగలక్ష్మి వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం భర్తకు తెలియడంతో వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రియుడితో కలిసి గొంతుని టవల్‌తో చుట్టి ఊపిరాడకుండా చేసి భర్తను హత్య చేసింది. పోలీసులు నాగలక్ష్మి, మహేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు.

వాన్‌పిక్ క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

» జగన్ కేసులో నిందితుల జాబితా నుంచి తొలగింపునకు నో

హైదరాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో నిందితుల జాబితాలో ఉన్న వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. జగన్ అక్రమాస్తుల కేసుల్లో భాగంగా సీబీఐ తమపై నమోదు చేసిన కేసు కొట్టేయాలని పేర్కొంటూ వాన్‌పిక్ కంపెనీ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. వాస్తవానికి ఈ పిటిషన్‌ను 2022లోనే హైకోర్టు అనుమతించింది. దానిపై తమ వాదన వినకుండా హైకోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో మరోసారి ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు కేసును తిప్పి హైకోర్టుకు పంపింది. ఈ నేపథ్యంలోనే ఈ పిటిషన్‌పై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టి వాన్‌పిక్ పిటిషన్‌ను కొట్టేస్తూ సీబీఐకి అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

నేటి నుంచే అమెరికా 'అదనపు' మోత!



(మొదటి పేజీ తరువాయి)

50శాతానికి చేరుతున్నాయి. ఈ మేరకు అమెరికా అంతర్గత భద్రతా విభాగం తాజాగా నోటీసు జారీ చేసింది. వివిధ దేశాలపై అమెరికా విధించిన సుంకాల్లో.. భారత్‌పై విధించిన సుంకాలే అత్యధికం కావడం గమనార్హం. తాజా పెంపుతో అమెరికాకు భారత్ నుంచి జరిగే సుమారు రూ.5.25 లక్షల కోట్ల (60 బిలియన్ డాలర్ల) ఎగుమతులపై ప్రభావం పడుతుందని అంచనా. ప్రస్తుతానికి అదనపు సుంకాల నుంచి మినహాయింపు ఉన్న మొబైల్ ఫోన్లు, పలు రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫార్మా మినహా.. మిగతా అన్ని రంగాలకు సుంకాల దెబ్బ తగలనుంది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముడిపెట్టి..

అమెరికాకు భారత్ భారీగా ఎగుమతులు చేస్తూ.. అమెరికా ఉత్పత్తుల దిగుమతిపై మాత్రం భారీగా టారిఫ్‌లు విధిస్తోందని ట్రంప్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అమెరికా వ్యవసాయ, డెయిరీ ఉత్పత్తుల దిగుమతులకు అనుమతించాలని, టారిఫ్‌లు తగ్గించాలని.. ఈ మేరకు వాణిజ్య ఒప్పందం చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. కానీ దేశంలోని రైతులు, చిన్న పరిశ్రమలకు దెబ్బతగులుతుందంటూ భారత్ నిరాకరిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే ట్రంప్ భారత్‌పై 25శాతం సుంకాలు విధించారు. అవి ఆగస్టు 7వ తేదీ నుంచే అమల్లోకి వచ్చాయి. ఇక రష్యా చమురును విక్రయించడం ద్వారా వస్తున్న సొమ్ముతోనే ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తోందని.. ఈ క్రమంలో రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై 25శాతం అదనపు సుంకాలు విధిస్తున్నామని ట్రంప్ ప్రకటించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం నిలిపేయాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి తెచ్చే క్రమంలోనే భారత్‌పై అదనపు సుంకాలు విధించినట్టు కూడా ప్రకటించారు. ప్రస్తుతం భారత్‌తోపాటు బ్రెజిల్‌పై 50శాతం, మయన్మార్‌పై 40, థాయ్‌లాండ్, కాంబోడియాలపై 36, బంగ్లాదేశ్‌పై 35, ఇండోనేషియాపై 32, చైనా, శ్రీలంకలపై 30, మలేసియాపై 25, ఫిలిప్పీన్స్, వియత్నాంలపై 20, పాకిస్థాన్‌పై 19శాతం టారిఫ్‌లను అమెరికా అమలు చేస్తోంది.

ఏయే రంగాలు, ప్రాంతాలపై ఎంత ప్రభావం?

2024-25లో భారత్-అమెరికా మధ్య సుమారు 11.5 లక్షల కోట్ల (131.8 బిలియన్ డాలర్లు) వాణిజ్యం జరిగింది. ఇందులో భారత్ నుంచి రూ.7.57 లక్షల కోట్ల (86.5 బిలియన్ డాలర్లు) ఎగుమతులు జరగ్గా.. రూ.4లక్షల కోట్ల (45.3 బిలియన్ డాలర్లు) మేర దిగుమతులు జరిగాయి. ప్రస్తుతం 50శాతం టారిఫ్‌లతో భారత్ నుంచి జరిగే రూ.5.25 లక్షల కోట్ల ఎగుమతులపై ప్రభావం పడనుంది. ఈ అధిక సుంకాల కారణంగా అమెరికాలో భారత ఉత్పత్తుల ధరలు ఏకంగా 50శాతం పెరిగిపోతాయి. అదే సమయంలో టారిఫ్‌లు తక్కువగా ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్, వియత్నాం, కాంబోడియా, ఇండోనేషియా వంటి దేశాల ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉంటాయి. దీనితో భారత ఉత్పత్తులకు డిమాండ్ పడిపోయి ఇక్కడి నుంచి ఎగుమతులు తగ్గిపోతాయి.

- ప్రధానంగా విశాఖపట్నం కేంద్రంగా తూర్పు తీర ప్రాంతాల నుంచి అమెరికాకు సుమారు రూ.20 వేల కోట్లకుపైగా విలువైన రొయ్యలు ఎగుమతి అవుతాయి. ఇప్పుడు 50శాతం సుంకంతో ఈ పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడనుంది.
- ముంబై, సూరత్ వేదికగా ఉన్న రత్నాలు, ఆభరణాల పరిశ్రమలు (రూ.87 వేల కోట్ల ఎగుమతులు).. తమిళనాడు, ఢిల్లీ, కర్ణాటకల నుంచి ఎగుమతయ్యే వస్త్రాల పరిశ్రమలు (రూ.95 వేల కోట్ల ఎగుమతులు) దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. "అదనపు సుంకాలు భారత వస్త్ర పరిశ్రమపై తీవ్ర భారంగా మారుతాయి. ఉద్యోగుల తొలగింపు, ఇతర వ్యయాల తగ్గింపుపై పరిశ్రమలు దృష్టిపెట్టాల్సి వస్తుంది.." అని అప్పెరల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఏఈపీసీ) ప్రధాన కార్యదర్శి మిథిలేశ్వర్ ఠాకూర్ పేర్కొన్నారు.
- కార్పెట్లు, హస్తకళాకృతులు, ఫర్నీచర్, పాదరక్షలు, బాస్మతి బియ్యం, మసాలాలు, టీ, స్టీలు, అల్యూమినియం, రాగి, ఆర్గానిక్ రసాయనాలు, యంత్ర పరికరాల తయారీ పరిశ్రమలపైనా గణనీయంగా ప్రభావం పడుతుంది.
- అదనపు సుంకాల ప్రభావంతో 2025-26లో అమెరికాకు భారత ఎగుమతులు రూ.4.34 లక్షల కోట్ల (49.6 బిలియన్ డాలర్ల)కు పడిపోవచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.

ఉత్పత్తుల్లో మన దేశీయుల చెమట చిందాలి!

» పెట్టుబడి ఎవరు పెట్టినా ఉత్పత్తులు మన దేశంలో జరగాలి: మోదీ

అహ్మదాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 26: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మనదేశంపై విధించిన 25% అదనపు సుంకాల అమలుకు ఒకరోజు ముందు ప్రధాని మోదీ 'స్వదేశీ ఉత్పత్తుల' ఆవశ్యకతను నొక్కి చెప్పారు. స్వదేశీ, మేక్ ఇండి యా అనేవి కొత్త కొలువులు సృష్టించేందుకు సహాయపడతాయని పేర్కొన్నారు. పెట్టుబడులు ఎక్కడి నుంచి వచ్చినా ఉత్పత్తి మాత్రం మనదేశంలోనే జరగాలని స్పష్టం చేస్తూ.. స్వదేశీ అనేది ప్రతి ఒక్కరి జీవిత మంత్రంగా ఉండాలని పిలుపునిచ్చారు. రానున్న ఐదారేళ్లలో జపాన్ సంస్థ సుజుకి మోటార్ కార్పొరేషన్ భారత్‌లో రూ.70వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించిన సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లోని హన్సల్‌పూర్ కర్మాగారంలో విదేశాల ఎగుమతుల కోసం 'విటారా' అనే ఎలక్ట్రిక్ వాహనాలను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ నుంచి తయారైన మొట్టమొదటి వాహనాన్ని మోదీ మంగళవారం ఇక్కడ జెండా ఊపి ఎగుమతులను లాంఛనంగా ప్రారంభించారు. అలాగే ఈవీల్లో కీలకమైన లిథియం-అయాన్ బ్యాటరీ, సెల్, ఎలక్ట్రోడ్ ఉత్పత్తుల ఫ్యాక్టరీని కూడా మోదీ ప్రారంభించారు. కాగా, ప్రధాని మోదీ రెండ్రోజుల పర్యటన నిమిత్తం గురువారం (28న) జపాన్ బయల్దేరనున్నారు. 'అటు నుంచి అటే చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ సదస్సుకు వెళ్తారు. 31, 1 తేదీ ల్లో అక్కడే ఉంటారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో వేర్వేరుగా ము ఖాముఖి భేటీలు నిర్వహిస్తారు' అని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మంగళవారం విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మంగళవారం తెలిపారు.

బార్ దరఖాస్తులకు గడువు పెంపు

» 29వ తేదీ సాయంత్రం వరకూ అవకాశం

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీకి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. రాష్ట్రంలోని 840 బార్లకు నోటిఫికేషన్ ఇవ్వగా చివరి రోజైన మంగళవారం వరకూ 369 దరఖాస్తులు మాత్రమే వచ్చా యి. వాటిలోనూ నాలుగు కంటే ఎక్కువ దరఖాస్తులు అందినవి 56 మాత్రమే. తొమ్మిది జిల్లాల్లో ఒక్క బార్‌కు కూడా నాలుగు దరఖాస్తులు రాలేదు. దీంతో దరఖాస్తుల గడువును మరో మూడు రోజులు పొడిగిస్తూ ఎక్సైజ్ శాఖ నిర్ణయం తీసుకుంది. బార్ పాలసీపై మొదటి నుంచీ స్పందన లేదు. బార్లకు సరఫరా చేసే మద్యంపై 15శాతం అదనపు పన్ను, లాటరీ తీయాలంటే ఒక్కో బారుకు నాలుగు దరఖాస్తులు తప్పనిసరిగా రావాలనే నిబంధన, మద్యం షాపుల్లో పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వడం వంటి అంశాలు నూతన బార్ పాలసీపై ప్రతికూల ప్రభా వం చూపాయి.

29 సాయంత్రం వరకు గడువు: నిషాంత్‌కుమార్

బార్ పాలసీ దరఖాస్తుల గడువును ఈ నెల 29 సాయంత్రం 6గంటల వరకు పొడిగించినట్లు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బార్ లైసెన్స్‌ల లాటరీని 30న నిర్వహిస్తామన్నారు. వినాయక చవితి, బ్యాంకు సెలవుల దృష్ట్యా గడువు పొడిగించామన్నారు. వర్షాలు, వరదల కారణంగా దరఖాస్తుల సమర్పణలో ఇబ్బందులు తలెత్తాయన్నారు.

గ్రీన్‌కార్డ్ దరఖాస్తుదారుల పిల్లలకు అమెరికా బిగ్ షాక్!

» దరఖాస్తుల పరిశీలన సమయానికి 21 ఏళ్లు నిండిన వారికి నో చాన్స్



వాషింగ్టన్, ఆగస్టు 26: అమెరికాలో ఉంటున్న విదేశీయుల పిల్లలకు గ్రీన్ కార్డ్ ఇచ్చే విషయంలో సిటిజన్ షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) సంచలన నిర్ణయం తీసుకుంది. హెచ్-1బీ వీసాపై అగ్రరాజ్యంలో ఉంటూ గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి పిల్లలకు.. ఆయా దరఖాస్తుల తుది పరిశీలన సమయానికి 21 ఏళ్లు నిండితే అనుమతించబోమని తేల్చి చెప్పింది. ఈ మేరకు యూఎస్‌సీఐఎస్ ఆకస్మిక నిర్ణయం తీసుకుంది. అంటే.. దరఖాస్తు చేసే సమయానికి పిల్లలకు 21 ఏళ్లలోపు ఉన్నప్పటికీ.. వాటిని పరిశీలించి, గ్రీన్ కార్డు మంజూరు చేసే సమయానికి కనుక వారు నిర్ణీత వయసును మించిపోతే.. వారిని గ్రీన్‌కార్డ్‌కు అనర్హులుగా గుర్తిస్తారు. ఇలాంటి వారు ప్రత్యేక వీసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. లేదా దేశం వదిలి వెళ్లాల్సి ఉంటుందని యూఎస్‌సీఐఎస్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయం ఈ నెల 15 నుంచే అమల్లోకి వచ్చినట్టు పేర్కొంది. వాస్తవానికి హెచ్-1బీ వీసాలు దక్కడమే గగనంగా మారింది. ఏళ్ల తరబడి సమయం పడుతోంది. ఇక, గ్రీన్ కార్డుల దరఖాస్తులు కూడా ఏళ్ల తరబడి మూలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత అధ్యక్షుడు జో బైడెన్.. గ్రీన్‌కార్డు దరఖాస్తు దారులకు వెసులుబాటు కల్పించారు. హెచ్-1బీ వీసాదారుల దరఖాస్తు సమయానికి వారి పిల్లలకు 21 ఏళ్లలోపు వయసు ఉంటే.. గ్రీన్‌కార్డు ఎప్పుడు మంజూ రు చేసినా ఆ వయసునే పరిగణనలోకి తీసుకునేవారు. దీనివల్ల వేలాది మందికి గ్రీన్‌కార్డులు లభించాయి. అయితేప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ మాత్రం గ్రీన్‌కార్డు కోరుకునేవారి పిల్లలకు 21ఏళ్లకు మించరాదన్న నిర్ణయాన్ని మరింత కఠినంగా అమలు చేస్తున్నారు. కాగా, ఈ నిర్ణయం భారతీయులపై తీవ్ర ప్రభావం చూపించనుంది. ఎందుకంటే హెచ్-1బీ వీసాదారులు ఏళ్ల తరబడి అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు వీరి పిల్లలకు ఈ నిబంధన వర్తిస్తే గ్రీన్‌కార్డుకు అనర్హులవుతారు. గ్రీన్‌కార్డు దరఖాస్తులు పరిశీలించి, తుదిచర్యలు తీసుకునే సమయానికి చిన్నారుల వయసు 21 ఏళ్లలోపు ఉంటేనే అనుమతిస్తారు. కానీ, ఇప్పుడున్న పరిస్థితిలో దరఖాస్తుల పరిశీలనకే ఏళ్ల తరబడి సమయం పడుతోంది. ఫలితంగా 21 ఏళ్లు దాటిన వారిని గ్రీన్‌కార్డుకు అనర్హులుగా పేర్కొంటారు.

ద్రవ్యబిల్లులనూ ఆపేయొచ్చుగా?

మొదటి పేజీ తరువాయి)



సమర్థించాయి. చట్టాలకు కోర్టులు ఆమోదం ఇవ్వలేవని.. ప్రతి వ్యాధికీ కోర్టు ఔషధం కాజాలదని వాదించాయి. బిల్లులకు ఆమోదం ఇవ్వగల అధికారం రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతికి, గవర్నర్లకు మాత్రమే ఉందని.. అంతే తప్ప 'ఆమోదం ఇచ్చినట్టుగా పరిగణించడం' అనే పద్ధతే రాజ్యాంగంలో లేదని మహారాష్ట్ర తరపున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వొకేట్ హరీశ్ సాల్వే స్పష్టం చేశారు. "బిల్లులకు ఆమోదం తెలపాలంటూ కోర్టులు రిట్ ఆఫ్ మాండమస్ జారీ చేయలేవు. ఒక చట్టానికి కోర్టు ఆమోదం ఇవ్వలేదు. ఆ అధికారం గవర్నర్లకు లేదా రాష్ట్రపతికి మాత్రమే ఉంది" అని తేల్చిచెప్పారు. బిల్లులను నిలిపివేయడం అనేది గవర్నర్‌కు ఉన్న నాలుగో ప్రత్యామ్నాయమని (మిగతా మూడూ.. ఆమోదం తెలపడం, శాసనసభకు తిప్పి పంపడం, రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వ్ చేయడం) వివరించారు. బిల్లులకు ఆమోదం ఇవ్వకుండా నిలిపివేసేందుకు గవర్నర్లకు ఉన్న అధికారాన్ని రాజ్యాంగం గుర్తించిందని.. దాన్ని వీటోగా పేర్కొనడం తప్పుదోవ పట్టించడమేనని అభ్యంతరం తెలిపారు. రాష్ట్రాల శాసనసభలు పంపిన బిల్లులకు ఆమోదం తెలపడంపై న్యాయస్థానాలు రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధించగలవా అనే అంశంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యాంగంలోని 143(1) అధికరణం ప్రకారం.. 14 సందేహాలతో సుప్రీంకోర్టుకు లేఖ (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్) రాసిన సంగతి తెలిసిందే. దీనిపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహన్, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. రాజ్యాంగంలోని 200వ అధికరణ ప్రకారం గవర్నర్లకు ఒక బిల్లును శాసనసభకు తిప్పి పంపకుండా తొక్కిపట్టే స్వతంత్ర అధికారం ఉందని అర్థం చేసుకోవడం పట్ల ఆందోళన వెలిబుచ్చింది. దీన్ని ఆమోదిస్తేగనక.. గవర్నర్లు ద్రవ్యబిల్లులకు సైతం ఆమోదం తెలపకుండా నిలిపివేయగలరన్న అర్థం వస్తుందని.. అలాంటి పరిస్థితే వస్తే అది చాలా సమస్యాత్మకమని కోర్టు వ్యాఖ్యానించింది. "గవర్నర్‌కు ఒక బిల్లుకు ఆమోదం తెలపకుండా నిలిపివేసే అధికారం ఉందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అలా (బిల్లుల్ని) తొక్కిపట్టే అధికారాన్ని గవర్నర్లు స్వతంత్రంగా అమలు చేయడం మొదలుపెడితే అది సమస్యగా మారుతుంది. ఎందుకంటే.. ఈ అధికారంతో గవర్నర్లు ద్రవ్యబిల్లుతో సహా ఏ బిల్లునైనా తమ వద్దకు రాగానే నిలిపివేయగలరు" అని జస్టిస్ పీఎస్ నరసింహన్ ఆందోళన వెలిబుచ్చారు.


ఆ ప్రశ్నే ఉత్పన్నం కాదు..

గవర్నర్ తన వద్దకు వచ్చిన బిల్లు ద్రవ్యబిల్లు కానప్పుడు మాత్రమే దాన్ని శాసనసభ పునఃపరిశీలనకు తిప్పి పంపగలరు కదా? మరి ఆర్టికల్ 200లోని ప్రధాన నిబంధన ప్రకారం ద్రవ్య బిల్లును సైతం గవర్నర్ తిరస్కరించవచ్చనే విషయాన్ని మీరెలా సమన్వయం చేస్తారని జస్టిస్ నరసింహన్ ప్రశ్నించగా.. ఈ ప్రశ్నకు సమాధానం రాజ్యాంగంలోని 207వ అధికరణలో ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా జవాబిచ్చారు. గవర్నర్ సూచనతోనే (సిఫారసు) ద్రవ్యబిల్లును సభలో ప్రవేశపెడతారు కాబట్టి.. గవర్నర్ ద్రవ్యబిల్లును నిలిపివేయడమనే సమస్యే ఉత్పన్నం కాదని వివరణ ఇచ్చారు. హరీశ్ సాల్వే జోక్యం చేసుకుని.. సభ ఆమోదించిన బిల్లు గవర్నర్ సూచించినదానికి భిన్నంగా ఉంటే గవర్నర్ దానికి ఆమోదాన్ని నిలిపివేసే సందర్భం తలెత్తవచ్చని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతలే గవర్నర్ల అధికారాలపై ఎలాంటి పరిమితులూ విధించనప్పుడు.. అటువంటి పరిమితులను వ్యాఖ్యానాల (ఇంటర్‌ప్రెటేషన్) ద్వారా విధించలేమని, బిల్లులపై రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితి విధించడం సరైంది కాదని ఆయన స్పష్టం చేశారు. గవర్నర్ ఒక బిల్లును ఎందుకు తొక్కిపట్టారో సమీక్షించే అధికారం కోర్టుకు లేదని ఆయన వాదించారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న సీజేఐ.. "గవర్నర్ ఏదైనా బిల్లుకు ఆమోదం తెలపకుండా నిలిపివేస్తే.. అలా ఎందుకు చేశారని కోర్టు అడగగలదా?" అని ప్రశ్నించగా.. "అడగలేదు" అని సాల్వే తేల్చిచెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం రాష్ట్రపతి/గవర్నర్లు తమ అధికారాలు, బాధ్యతలను నిర్వహించేక్రమంలో తీసుకున్న చర్యల గురించి ఏ కోర్టుకూ జవాబుదారీ కారని చెప్పారు. "మీ నిర్ణయం ఏమిటి?" అని మాత్రమే కోర్టులు వారిని అడగగలవుగానీ.. ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించలేవని స్పష్టం చేశారు.

భారత రాజ్యాంగంలో లేదు..

ఈ కేసులో కేంద్ర ప్రభుత్వ వాదనలను సమర్థిస్తూ మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల తరపున సీనియర్ న్యాయవాదులు నీరజ్ కిషన్ కౌల్, మణీందర్ సింగ్ వాదనలు వినిపించారు. ఉత్తరప్రదేశ్, ఒడిసా తరపున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్.. రాష్ట్రపతి, గవర్నర్లకు కార్యనిర్వహణలో స్వతంత్రత ఉందని.. బిల్లులకు ఆమోదం ఇచ్చే విషయంలో వారికి సంపూర్ణ వివేచనాధికారం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన బిల్లుల విషయంలో కోర్టులు వారికి ఎలాంటి గడువూ నిర్దేశించలేవని తెలిపారు. గోవా సర్కారు తరపున వాదనలు వినిపించిన ఏఎస్జీ విక్రమ్‌జిత్ బెనర్జీ కూడా.. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ ఆమో దం లేనిదే బిల్లు చట్టరూపం దాల్చే ప్రక్రియ సంపూర్ణం కాదని.. కాబట్టి, 'ఆమోదం ఇచ్చినట్టుగా పరిగణించడం' అనే భావనకు అవకాశమే లేదని వాదించారు.





కాణిపాకంలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 27న వినాయక చవితిని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 28న ఉదయం ధ్వజారోహణం జరుగుతుంది. రాత్రి హంస వాహన సేవతో వాహన సేవలు ఆరంభమవుతాయి. 29న రాత్రి స్వర్ణ నెమలి వాహనం, 30న రాత్రి మూషిక వాహన సేవ, 31న ఉదయం చిన్న శేషవాహన సేవ, రాత్రి పెద్ద శేష వాహన సేవ, సెప్టెంబరు 1న ఉదయం చిలుక వాహనం, రాత్రి వృషభ వాహన సేవ, 2 రాత్రి గజ వాహన సేవ, 3 మధ్యాహ్నం రథోత్సవం, 4వ తేదీ రాత్రి తిరుకల్యాణం, అశ్వవాహన సేవ, 5న సాయంత్రం ధ్వజావరోహణం, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అనంతరం ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా 6న రాత్రి అధికార నంది వాహన సేవ, 7న రావణబ్రహ్మ వాహన సేవను చంద్ర గ్రహణం కారణంగా ఉదయం నిర్వహిస్తారు. 8వ తేదీ రాత్రి యాళి వాహన సేవ, 9 రాత్రి సూర్యప్రభ వాహన సేవ, 10 రాత్రి చంద్రప్రభ వాహన సేవ, 11 రాత్రి కల్ప వృక్ష వాహన సేవ, 12 రాత్రి విమానోత్సవం, 13 రాత్రి పుష్పపల్లకి సేవ, 14 రాత్రి కామధేను వాహన సేవ, 15 రాత్రి పూలంగి సేవ, 16వ తేదీ రాత్రి తెప్పోత్సవంతో ప్రత్యేక ఉత్సవాలు ముగుస్తాయి.

ఎస్వీ జూపార్కులో సింహం మృతి

తిరుపతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ జూపార్కులో ఇందు అనే 23 ఏళ్ల ఆడ సింహం అనారోగ్యం కారణంగా మంగళవారం మృతి చెందింది. 2002లో థానే నేషనల్ సర్కస్ నుంచి 18 సింహాలను రక్షించి జూపార్కుకు తీసుకొచ్చారు. వీటిలో 8నెలల వయసులో జూపార్కుకు వచ్చిన ఇందు ఇతర సింహాల కంటే ఎక్కువ కాలం జీవించిందని జూపార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు.

Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P.: VIJAYAWADA - 520008

NOTIFICATION FOR ADMISSION INTO BACHELOR OF NATUROPATHY & YOGIC SCIENCES (BNYS) COURSE FOR THE ACADEMIC YEAR 2025-26.

Application forms through online are invited from the eligible candidates duly uploading of scanned original certificates for admission into **Bachelor of Naturopathy and Yogic Sciences (BNYS) Course under Competent Authority Quota Seats for the academic year 2025-26 in the colleges affiliated to Dr. NTR University of Health Sciences, Vijayawada.**

Schedule:	From 11.00 A.M on 28.08.2025 to 03.00 P.M. on 05.09.2025
Application link:	https://apuhs-ugadmissions.aptonline.in/ugbnys/home/home
Website: for detailed Notification / Prospectus/ Regulations.	https://drntr.uhsap.in

VIJAYAWADA
Dated: 26.08.2025

Sd/-
Dr. V. RADHIKA REDDY
REGISTRAR



లడ్డూ ప్రసాదాలు, అన్న ప్రసాదాల్లో వినియోగించే ముడిసరకుల నాణ్యత తనిఖీ చేసే స్మెల్ డిటెక్షన్ స్కానింగ్ యంత్రం కోసం టీటీడీకి రూ.61.72 లక్షలను మంగళవారం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ విరాళంగా అందజేసింది. - ఆంధ్రజ్యోతి, తిరుమల

7న చంద్ర గ్రహణం

- 12 గంటలపాటు

తిరుమల ఆలయం మూసివేత

తిరుమల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణం కారణంగా సెప్టెంబరు 7న తిరుమల శ్రీవారి ఆలయ మహద్వారం తలుపులను 12 గంటల పాటు మూసివేయనున్నారు. ఆదివారం రాత్రి 9.50 గంటలకు చంద్ర గ్రహణం ప్రారంభమై 8వ తేదీ వేకువజామున 1.31 గంటలకు పూర్తవుతుంది. దీంతో ఆదివారం సాయంత్రం 3.30 నుంచి 8వ తేదీ తెల్లవారుజామున 3 గంటల వరకు శ్రీవారి ఆలయాన్ని మూసివేయనున్నారు. సుప్రభాతంతో ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు శ్రీవారి దర్శనం ప్రారంభవుతుంది. గ్రహణం కారణంగా 7వ తేదీ ఉంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. అలాగే తిరుమలలో అన్నప్రసాదాల వితరణ నిలిపివేస్తారు. 8వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి ప్రసాదాల వితరణ మొదలువుతుంది. అయితే భక్తులు ఇబ్బంది పడకుండా 30వేల పులిహోర ప్యాకెట్లను సిద్ధం చేసి 7వ తేదీ సాయంత్రం 4.30 గంటల నుంచి పంపిణీ చేస్తారు.

విద్యార్థి భవిష్యత్తును చిదిమేసిన ఇసుక లారీ

- ప్రమాదంలో ఒక కాలు పూర్తిగా తొలగింపు.
- వైద్య ఖర్చులూ భరించలేని స్థితిలో తల్లిదండ్రులు


గుంటూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆ దంపతులు చిన్న టిఫిన్ సెంటర్ నడుపుతూ.. ఒక్కగానొక్క కొడుకు భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కష్టపడి చదివించుకుంటున్నారు. అమ్మానాన్నలు పడుతున్న కష్టం చూస్తున్న ఆ చిన్నారి.. పెద్దయ్యాక వారిని కాలు కింద పెట్టకుండా చూసుకోవాలన్న తాపత్రయంతో చదువులో విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. ఈ క్రమంలో బడికి వెళ్లి ఇంటికి వస్తుండగా ఇసుక లారీ ఢీకొట్టడంతో ఓ కాలు కోల్పోయి దివ్యాంగుడిగా మారాడు. సోమవారం సాయంత్రం గుంటూరు శివారు గోరంట్లలోని పంచాయతీ ఆఫీసు రోడ్డులో ఈ ఘోరం జరిగింది. స్కూలు నుంచి ఇంటికి వెళుతున్న తాడేపల్లి మోహన్ సాయి శ్రీ చరణ్(14)ను ఇసుక లారీ మితిమీరిన వేగంతో వచ్చి ఢీకొంది. ఆస్పత్రిలో చేర్చగా బాలుడి ఎడమ కాలును పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం కుమారుడి వైద్యఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉన్న ఆ కుటుంబం దాతల సాయం కోసం ఎదురు చూస్తోంది. దాతలు 63048 05670 నంబరులో సంప్రదించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

'రంగా విగ్రహాలకు అవమానం'.. ముగ్గురి అరెస్ట్

కైకలూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రెండు వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు రంగా విగ్రహాలను అవమానించిన ముగ్గురిని అరెస్టు చేశామని ఏలూరు జిల్లా కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. ఈ నెల 22న కైకలూరు నియోజకవర్గం కలిదిండి, సానారుద్రవరం గ్రామాల్లో వంగవీటి మోహన రంగా విగ్రహాలను అవమానించిన ఘటనలపై కేసు నమోదు చేశామన్నారు. గతంలో ఉన్న గొడవలను పురస్కరించుకుని రెండు వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని గొల్లగూడెం గ్రామానికి చెందిన కట్టా ఈశ్వర్ కుమార్, కలిదిండి ఇందిరా కాలనీకి చెందిన ఉండ్రాల అయ్యప్పతో పాటు మరో బాలుడు రంగా విగ్రహానికి పేడ పూశారని తెలిపారు. మంగళవారం ఉదయం కలిదిండి మార్కెట్ యార్డ్ సమీపంలో వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు వెల్లడించారు.

అంతరాష్ట్ర దొంగలు అరెస్టు

నంద్యాల టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, సత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న నలుగురు అంతరాష్ట్ర దొంగలను నంద్యాల పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వివరాలు వెల్లడించారు. వీరి కదలికలపై నిఘా ఉంచిన పాణ్యం, సీసీఎస్ పోలీసులు మంగళవారం పిన్నాపురం వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో పలు కేసుల్లో నిందితులని తేలింది. వారి నుంచి రూ.10.85 లక్షల విలువైన 11 తులాల బంగారు నగలు, 21 తులాల వెండి, రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.







ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇరుగు పొరుగు దేశాలతో వైషమ్యాలు ఉన్నప్పుడు జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లవచ్చు. ఆ ప్రమాదాన్ని నివారించుకోవడానికి రెండు మార్గాలున్నాయి: ఒకటి రాజనీతిజ్ఞత, రెండోది సైనిక సంసిద్ధత. దక్షిణాసియాలోను, విశాల ప్రపంచంలోను ప్రస్తుతమున్న పరిస్థితుల దృష్ట్యా సైనిక పాటవాన్ని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. నిన్నగాక మొన్న శనివారం నాడు విజయవంతమైన దేశ తొలి సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ పరీక్ష ఆ అవసరాన్ని సమర్థంగా, ప్రభావదాయకంగా తీర్చింది.

'ఎదుటి పక్షం వారు నీ మాట మన్నించి, నీ మార్గాన్ని అనుసరించేలా చేయడమే దౌత్య కళ' అని తలపండిన రాజనీతిజ్ఞుడు ఒకరు ఏనాడో సుభాషించారు. గత పదకొండేళ్లుగా మనం అనుసరిస్తున్న దౌత్య విధానాలు ఈ సత్యాన్ని సార్థకం చేశాయా? సర్వోన్నత విధానకర్త వైయక్తిక పోకడలు మన పట్ల సమీప, సుదూర దేశాల సుహృద్భావాన్ని తగ్గించి వేశాయి. హరించివేశాయనడమే సబబుగా ఉంటుందేమో? ఆ సర్వోన్నతుడి చిత్తశుద్ధిని శంకించవలసిన అవసరం లేకపోయినా సునిశ్చిత దౌత్య సూత్రాలను పాటించనప్పుడు ఇటువంటి పరిస్థితి తప్పకపోవచ్చు. మనపై అహేతుక ద్వేషంతో రగిలిపోతున్న ఒక పొరుగుదేశం మారిన అంతర్జాతీయ పరిస్థితులను అదునుగా తీసుకుని అమానుష ఉగ్రవాద ఘాతుకానికి పాల్పడినప్పుడు ప్రతీకార చర్య చేపట్టడం అనివార్యమయింది. అయితే అది చిత్రంగా మనం అంతర్జాతీయ రాజకీయ చాణక్యాలలో ఎంత అవాస్తవికంగా వ్యవహరిస్తున్నామో తెలియజెప్పింది. దేశాన్ని ఏకాకిని చేస్తున్న దుస్తర పరిస్థితులను అధిగమించేందుకు కేవలం రాజనీతిజ్ఞతపైనే ఆధారపడకుండా సైనిక సంసిద్ధతను కూడా ఆలంబన చేసుకోవాలన్న సత్యాన్ని మన విధానకర్తలు గ్రహించారు.

ఆ సత్య గ్రహణతోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 79వ స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15) నాడు శత్రు దాడులను తటస్థీకరించడానికి మాత్రమే కాకుండా బలంగా ఎదురుదాడి చేయడానికి కూడా స్వదేశీ వైమానిక రక్షణ వ్యవస్థను అభివృద్ధిపరచనున్నట్టు ప్రకటించారు.

జయ మంగళం!

'రాబోయే పదేళ్ల కాలంలో అంటే 2035 సంవత్సరం నాటికి దేశంలోని సమస్త వ్యూహాత్మక, పౌర ప్రదేశాలూ కొత్త సాంకేతిక వేదికల ద్వారా సంపూర్ణ భద్రతా కవచాన్ని పొందుతాయని ఆయన అన్నారు. ప్రతి పౌరుడూ సురక్షితంగా ఉండేంతవరకు ఆ భద్రతాకవచం విస్తరిస్తూనే ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు. అధునాతన సాంకేతికత కృత్రిమ మేధ ప్రధాన పాత్ర పోషించే, బహుళ స్థాయిలలో ఉండే ఈ భద్రతా కవచ వ్యవస్థకు శ్రీకృష్ణుని స్ఫూర్తితో 'సుదర్శన్ చక్ర' అని నామకరణం చేశారు. రక్షణ పరిశోధన సంస్థలు, సాయుధ బలగాల వ్యవస్థలు, ప్రైవేట్ సంస్థల సమన్వయ సహకారాలతో 'సుదర్శన్ చక్ర'ను నిర్మిస్తారు.

మిషన్ సుదర్శన్ చక్ర పరిపూర్తికి తొలి అడుగే శనివారం నాడు ఒడిషా తీరంలో విజయవంతంగా నిర్వహించిన సమీకృత రక్షణ ఆయుధ వ్యవస్థ తొలి పరీక్ష. శత్రు క్షిపణులు, యుద్ధ విమానాలు, డ్రోన్ల నుంచి రక్షణ కల్పించే బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థ ఇది. మూడు భిన్న ఆయుధాలు– ఉపరితలం నుంచి గగనతలంలోకి వేగంగా దూసుకు వెళ్లే క్షిపణి, స్వల్పశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ, లేజర్ ఆధారిత డైరెక్టెడ్ ఎనర్జీ ఆయుధ వ్యవస్థ ఇందులో అనుసంధానమై ఉండి మూడు భిన్న లక్ష్యాలను ఏకకాలంలో కూల్చివేయగలుగుతాయి. ఇటువంటి అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలు ఇంతవరకు అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, జర్మనీ, ఇజ్రాయెల్‌కు మాత్రమే ఉన్నాయి. కనుకనే భారత్ అభివృద్ధి పరచుకున్న సమీకృత గగనతల రక్షణ వ్యవస్థ చాలా ప్రాముఖ్యమున్న సైనిక పాటవ పురోగతి అని చైనీస్ రక్షణ వ్యవహారాల ఉన్నతస్థాయి నిపుణుడు ఒకరు అంగీకరించక తప్పలేదు.

సమీకృత గగనతల రక్షణ వ్యవస్థ విజయం వినూత్న సైనిక సాంకేతికత సముపార్జనలో అద్భుతమైన ముందుడగు కాగా ఆదివారం నాడు శ్రీహరికోటలో గగన్ యాన్ ప్రాజెక్టులో భాగంగా వ్యోమగాములను సురక్షితంగా తీసుకొచ్చే పారాచూట్ వ్యవస్థను పరీక్షించడానికి ఇస్రో చేపట్టిన మొదటి సమీకృత ఎయిర్ డ్రాప్ పరీక్ష విజయవంతమవడం భారతీయ వైజ్ఞానిక మేధకు ఒక దివ్యమైన వెలుగుదారి. భారతీయులు త్రివిక్రములు కాగలరనే భరోసాను ఇస్రో తాజా విజయం కల్పిస్తోంది. ఈ విజయాలు రెండూ ఉత్కృష్టమైనవే. మన పురోగతికి విశేషంగా తోడ్పడేవే. అయితే ఇదే సమయంలో మనం విస్మరిస్తున్న ఒక వాస్తవం ఉన్నది. అది మన ప్రాకృతిక వ్యవస్థలను మనమే స్వయంగా ధ్వంసం చేసుకోవడం. మన ఉనికికి ఆలవాలమైన ధరిత్రిని నిర్జీవం చేసుకోవడం విజ్ఞత ఎలా అవుతుంది? మన వైజ్ఞానిక విజయాలు 'ధరనుచొచ్చి, దివిని విచ్చి/ విరులు తాల్చు తరువు'లా నిత్య హరితంగా వర్ధిల్లాలంటే మనం మన ధాత్రిని సంరక్షించుకోవాలి. సజీవంగా ఉంచుకోవాలి. వినాయక చవితి శుభవేళ అటువంటి సంకల్పం వహించడమే ఆ ఆత్మీయ పురాణ పురుషునికి నిజమైన పూజ అవుతుంది.

నేరచరితుల ఆటకట్టు సాధ్యమేనా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'నీకెంత సేన ఉన్నా వ్యూహం లేకపోతే నీవు జనరల్ కాలేవు.' అన్న ఒక సైనిక నిపుణుడి ఉవాచ రాజకీయాలకు కూడా వర్తిస్తుంది. రాజకీయాల్లో వ్యూహరచన చేసే విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంత సిద్ధహస్తుడు మరొకరు లేరు. 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఆయన ఇప్పటి నుంచే సిద్ధపడుతున్నారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొద్ది రోజుల క్రితమే వెల్లడించారు. దీన్నిబట్టి చూస్తే వచ్చే సెప్టెంబర్ నెలాఖరులో షెడ్యూలు ప్రకటించబోతున్న బిహార్ ఎన్నికలకు ఆయన ఎంత ముందుగా సన్నాహాలు చేసి ఉంటారో వేరే చెప్పనక్కర్లేదు.

సాధారణంగా ఏవైనా ఎన్నికలకు ముందు పార్లమెంట్ సమావేశాలు పెద్దగా జరిగే అవకాశాలు లేవు. పార్లమెంట్‌లో లేవనెత్తే అంశాలే తర్వాత జరగబోయే ఎన్నికలకు ప్రధాన ప్రచారాస్త్రాలవుతాయని అటు అధికార పక్షానికీ, ఇటు ప్రతిపక్షాలకూ తెలుసు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చను తమకు అనుకూలంగా తిప్పుకోవాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తే బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ, గత మేలో పాకిస్థాన్‌పై ప్రారంభించిన యుద్ధాన్ని ఆకస్మికంగా విరమించడం లాంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తాయి. ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేసేందుకు కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. దీనితో మోదీ ప్రభుత్వం తన వ్యూహ రచనపై పునరాలోచనలో పడ్డది.

నిజానికి ఆగస్టు 12నే ఉభయ సభలను వాయిదా వేయాలని తొలుత నిర్ణయం తీసుకుని ఆ విషయం ఫ్లోర్ నేతల సమావేశంలో తెలియజేశారు. కాని మోదీ, షా ఏమి ఆలోచించారో కానీ ఆమోదించాల్సిన బిల్లులేవీ లేకున్నా యథా ప్రకారం ఆగస్టు 21 వరకు పార్లమెంట్‌ను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 19 రాత్రి పొద్దుపోయిన తర్వాత ఉన్నట్లుండి 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, అందుకు సంబంధించిన ఇతర బిల్లులను మరునాడు ప్రవేశపెట్టనున్నట్లు బులెటిన్ విడుదల చేశారు. పార్లమెంట్ సభ్యులు అందరికీ బిల్లుల ప్రతిని పంపారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు అయిదేళ్లపాటు శిక్షపడదగిన నేరానికి అరెస్టయి నెలరోజుల పాటు జైలులో ఉంటే రాజీనామా చేయాలని, లేకపోతే వారు ఆ పదవులను కోల్పోయినట్లేనని ఈ బిల్లు సారాంశం. ఇప్పటి వరకూ మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రిని పోస్టుల నుంచి తొలగించేందుకు చట్టపరమైన నిబంధనలేవీ లేవు. లిల్లీ థామస్ కేసులో ఎమ్మెల్యే, ఎంపీలకు రెండేళ్లు, అంతకు మించి శిక్ష పడితే వారు సభ్యులుగా కొనసాగకూడదని 2013లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ కేసు ఆధారంగానే గుజరాత్‌లో సూరత్ కోర్టు ఒక పరువు నష్టం కేసులో రాహుల్‌గాంధీకి రెండేళ్ల శిక్ష విధించడంతో ఆయన సభ్యత్వాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

అసలీ బిల్లును ఇంత ఆగమేఘాలపై ఎందుకు ప్రవేశపెట్టాల్సి వచ్చింది? జమిలి ఎన్నికల వంటి ముఖ్యమైన అంశంపై అఖిలపక్ష సమావేశాల్లో చర్చించిన ప్రభుత్వం ప్రధాన పదవుల్లో ఉన్నవారి నేర చరిత్ర గురించి రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టే ముందు ఎవరితోనూ చర్చించనవసరం లేదా? అందుకోసం కనీసం కేబినెట్ సమావేశంలోనైనా చర్చ జరిగిందా? అన్న ప్రశ్నలకు జవాబులు లేవు. అసలీ దేశంలో ప్రధాన మంత్రులను కేంద్ర సంస్థలు ఎప్పుడైనా అరెస్టు చేసే అవకాశాలున్నాయా? అన్నది ఆసక్తికరమైన ప్రశ్న. విచిత్రమేమంటే కస్టడీ నుంచి విడుదలైన తర్వాత మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి, మళ్లీ పదవులు స్వీకరించేందుకు ఎలాంటి అడ్డంకులూ లేవని కూడా ఈ బిల్లు పేర్కొంటోంది. అటువంటప్పుడు ఈ బిల్లు ప్రవేశపెట్టడం వల్ల ప్రయోజనమేమిటి?

ఈ బిల్లుకు ప్రచారం కంటే పెద్ద ప్రయోజనం లేదని అధికారపక్షానికి తెలియనిది కాదు. బిహార్‌లో ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నందువల్ల దాన్నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ బిల్లు ప్రవేశపెట్టారన్న విశ్లేషణలూ లేకపోలేదు. ప్రభుత్వం ఊహించినట్లుగానే బిల్లుపై ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయి. తద్వారా అవినీతిపై తాము చేస్తున్న పోరాటాన్ని వారు వ్యతిరేకిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, ఇతర నేతలు ఆరోపించేందుకు ఆస్కారం కలిగింది.

ఏమైనా ఈ నేపథ్యంలో బిహార్ ఎన్నికలు ఆసక్తికరంగా మారనున్నాయనడంలో సందేహం లేదు. రాహుల్‌గాంధీ ఇప్పటికే యాత్రలు ప్రారంభించి ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. పహల్గాం దాడి కాగానే మోదీ కూడా బిహార్‌కే వెళ్లి పాకిస్థాన్‌కు బుద్ధి చెబుతానని ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్‌కు తోడు రాజ్యాంగ సవరణ బిల్లు కూడా ప్రతిపక్షాలను ఎండగట్టేందుకు మోదీ సేన ఉపయోగించుకుంటుందనడంలో సందేహం లేదు.

రాజ్యాంగ సవరణ బిల్లు పట్ల ప్రతిపక్షాలు ఆందోళన చెందేందుకు కారణాలు లేకపోలేదు. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కుప్పకూల్చేందుకు కేంద్రం సీబీఐ, ఈడీ వంటి కేంద్ర ఏజెన్సీలను తప్పక ఉపయోగించుకోగలదని విపక్షాలు గట్టిగా విశ్వసిస్తున్నాయి. మనీలాండరింగ్ చట్టం ప్రకారం ఒక ముఖ్యమంత్రిని కానీ, మంత్రిని కానీ అరెస్టు చేస్తే వారికి 30 రోజుల వరకు బెయిల్ దొరికేందుకు అవకాశం లేదు. అదే అదనుగా వారిని తొలగించవచ్చు. ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తే అధికారంలో ఉన్న ప్రభుత్వం కుప్పకూలిపోతుందని లేదా అధికారంలో ఉన్న పార్టీలో లుకలుకలు బయలుదేరుతాయనేది కూడా ప్రతిపక్షాల వారి ఆందోళన. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలు ముఖ్యమంత్రి పదవికోసం మంత్రి పదవులకోసం అర్రులు చాస్తూ ఉంటారు. కనుక ఆ పార్టీని దెబ్బతీయడం కేంద్రంలో ఉన్న పార్టీకి సులభం.

ఈ బిల్లు ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వానికి అనేక కారణాలున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో అరెస్టయి 156 రోజులు జైలులో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు. ఆయన మంత్రివర్గంలో ఉన్న సత్యేంద్ర జైన్ హవాలా కేసులో అరెస్టయినప్పటికీ చాలా కాలం మంత్రి పదవిలో కొనసాగారు. తమిళనాడులో కూడా డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ తన మంత్రి సెంథిల్ బాలాజీ అరెస్టయి జైలుపాలైనప్పటికీ అతడిని మంత్రివర్గంలో కొనసాగించారు. మంత్రివర్గం నుంచి తొలగించాలని గవర్నర్ రవి ఆదేశించినప్పటికీ స్టాలిన్ ఒప్పుకోలేదు.

నిజానికి గతంలో ఆరోపణలు వచ్చినా, కోర్టు వ్యాఖ్యలు చేసినా, తమ మంత్రిత్వశాఖ పరిధిలో ఏవైనా దుర్ఘటనలు జరిగినా మంత్రులు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసేవారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాపిటేషన్ ఫీజులపై హైకోర్టు తప్పుపట్టడంతో ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డిని రాజీనామా చేయించారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా ఉన్న యడ్యూరప్ప, తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న జయలలిత, బిహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ తమను అరెస్టు చేయకముందే పదవులనుంచి తప్పుకున్నారు.



> రాజకీయాల్లో నేరచరితులను అదుపు చేయడానికి చిత్తశుద్ధి ఉంటే అందుకు సవాలక్ష మార్గాలున్నాయి. వోహ్రా కమిషన్ తన నివేదికలో చేసిన సిఫారసులను ఏ ప్రభుత్వమూ అమలుపరచనేలేదు. లోక్‌పాల్ వ్యవస్థ ఇప్పుడు నామ మాత్రంగా పనిచేస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన 1618 మంది అభ్యర్థుల్లో 16 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనైనా బీజేపీతో పాటు అన్ని రాజకీయ పార్టీలు నేరచరితులకు టిక్కెట్లు ఇవ్వకూడదని నిర్ణయం తీసుకోగలవా?

రాజకీయ నాయకులు చాలా మందికి ఈ అరెస్టుల వల్ల పెద్దగా నష్టం జరిగిన దాఖలాలు లేవు. హేమంత్ సోరెన్ జైలు నుంచి వచ్చిన తర్వాత ఎన్నికల్లో పోరాడి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. లాలూప్రసాద్ తాను అరెస్టయ్యే ముందు రబ్రీదేవిని ముఖ్యమంత్రి చేసినప్పటికీ ఆయన ప్రభుత్వం పడిపోలేదు. జయలలిత తాను అరెస్ట్ అయిన రెండుసార్లూ ఒకసారి పన్నీర్‌సెల్వన్‌ను, రెండవ సారి పళనిస్వామిని ముఖ్యమంత్రి చేశారు. రెండుసార్లూ ఆమె ప్రభుత్వానికి పెద్దగా ఢోకా రాలేదు. గత ఏడాది జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టుకు ముందే రాజీనామా చేసి చంపాయి సోరెన్‌ను ముఖ్యమంత్రి చేశారు. బహుశా కేజ్రీవాల్ కూడా ముందే రాజీనామా చేసి ఉంటే మళ్లీ మెజారిటీ సాధించేవారేమో. అప్పుడు కేంద్రం ఈ బిల్లు ప్రవేశపెట్టాల్సిన అవసరం కూడా ఉండేది కాదు.

అయినా ప్రభుత్వాలను పడగొట్టాలంటే ఇలాంటి బిల్లులు ఏ మాత్రం అవసరం లేదు. గతంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్దవ్ థాకరే, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి ప్రభుత్వాలను పడగొట్టేందుకు బీజేపీ వేర్వేరు మార్గాలను అనుసరించింది. ముఖ్యమంత్రులనో, మంత్రులనో అరెస్టు చేసినంత మాత్రాన ప్రభుత్వాలు పడిపోతాయని చెప్పడానికి లేదు. పైగా అసంబద్ధంగా కుట్రపూరితంగా అరెస్టులు జరిగితే న్యాయవ్యవస్థ చేతులు ముడుచుకుకూర్చునే అవకాశాలు తక్కువ. కేంద్రం కక్షసాధింపు చర్యలతో ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు, మంత్రులను కేసుల్లో ఇరికిస్తే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్ర మంత్రులపై తమ పోలీసులను, ఏజెన్సీలను ప్రయోగించేందుకు పూనుకోవచ్చు. ఇది ఒక గందరగోళ పరిస్థితికి దారితీస్తుంది. అయినా ఇప్పుడున్న కేంద్ర ఏజెన్సీలనే రాష్ట్ర నేతలపై ప్రయోగించే అవకాశం ఉండగా రాజ్యాంగ సవరణ తేవాల్సిన అవసరం ఏమున్నది?

రాజకీయాల్లో నేరచరితులను అంతం చేయడానికి చిత్తశుద్ధి ఉంటే అందుకు సవాలక్ష మార్గాలున్నాయి. నేరచరితులపై వోహ్రా కమిషన్ తన నివేదికలో చేసిన సిఫారసులను ఏ ప్రభుత్వమూ అమలుపరచనేలేదు. లోక్‌పాల్ వంటి వ్యవస్థ కోసం బీజేపీ గతంలో పోరాడింది. కానీ ఆ వ్యవస్థ ఇప్పుడు నామమాత్రంగా పనిచేస్తోంది. ప్రధానమంత్రి, కేంద్రమంత్రులపై వచ్చిన ఫిర్యాదులపై లోక్‌పాల్ ఎలాంటి చర్యలు తీసుకుంటున్నదో ఎవరికీ తెలియదు. జగన్మోహన్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి లాంటి వారిపై తీవ్ర ఆరోపణలున్నా ఏజెన్సీలు సరిగా పనిచేయడంలేదనే వాదనలూ లేకపోలేదు. నేరచరితులు అధికార పార్టీలో చేరగానే వారి నేరాలు ప్రక్షాళన అయ్యాయన్న విమర్శలూ వచ్చాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో న్యాయమూర్తులను సరైన సంఖ్యలో నియమించకపోవడంతో అనేకమంది నేరచరితులు తప్పించుకుంటున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన 1618 మంది అభ్యర్థుల్లో 16 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. చార్జిషీటు దాఖలైనప్పుడే అనర్హత వేటు వేయాలని లా కమిషన్ కూడా సూచించింది. అయినా త్వరలో జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనైనా బీజేపీతో పాటు అన్ని రాజకీయ పార్టీలు నేరచరితులకు టిక్కెట్లు ఇవ్వకూడదని నిర్ణయం తీసుకోగలవా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఆధార్ అనుసంధానంతోనే ఓటు అక్రమాలకు చెక్!

రాహుల్‌గాంధీ ఇటీవల ఓటు చోరీ ఆరోపణలతో లేవనెత్తిన డూప్లికేట్ ఓటర్ ఐడీ, అనుకూల ఓట్ల చేర్పు, అననుకూల ఓట్ల తొలగింపు వంటివి కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్నవి. ఈ సమస్యను మూలాల్లోకి వెళ్లి చూడాలి. అసలు భారత ప్రభుత్వ హోమ్ శాఖ నిర్వహించే నేషనల్ సిటిజెన్ రిజిస్టర్ సమగ్రమైనది కాదు. అంతర్జాతీయ సరిహద్దు గల ప్రాంతాలలో వలసలు ఒక కారణం అయితే, 95శాతం జనాభా ఉన్న మిగతా రాష్ట్రాలలో ప్రతి పౌరుడికి ప్రత్యేకంగా గుర్తించే విధానం లేకపోవడం అతి పెద్ద కారణం.

అనవసరంగా డేటా సేకరించే పాత అలవాటు ఉన్న అధికార గణం వల్ల ఆధార్ ప్రాజెక్ట్ డిజైనులో ఒక లోపం జరిగింది. ఆధార్ కార్డుని బహుళార్థ సాధక ప్రాజెక్ట్ చేసే ప్రయత్నంలో భాగంగా కార్డుకి అడ్రస్, తల్లి, తండ్రి, ఫోన్ మాత్రమే గాక, మొదట్లో గ్యాస్ కనెక్షన్ నెంబర్ కూడా తీసుకున్నారు. ఇప్పటికీ అనేక కార్డుల పైన ఫోన్ నెంబర్ ముద్రించి ఇస్తున్నారు. ఇందులో వ్యక్తిగత గోప్యత అంశాలు ఇమిడి ఉన్నాయి. ఇంతకుముందు ఎలక్షన్ కమిషన్ ఓటర్ ఐడీకి ఆధార్‌ను అనుసంధానం చేసి డూప్లికేట్స్‌ను తీసివేసే ప్రక్రియ చేపట్టింది. పైన చెప్పిన లోపం చేత సుప్రీంకోర్ట్ ఆదేశాల వల్ల ఆధార్ అనుసంధానం ఐచ్ఛికం అయ్యింది. మొత్తానికి లక్ష్యం నీరు గారిపోయింది. ప్రస్తుతం ఆధార్ కార్డు వల్ల పౌరులకు అనేక సేవలు అందుతున్నప్పటికిని అది ఐచ్ఛికం చేయడం వల్ల అసలు లక్ష్యాలు దెబ్బతిన్నాయి. పౌరులు ప్రయోజనం పొందే దగ్గర ఆధార్ సమర్పించి, ఎగవేతల దగ్గర మిగతా ఐడీలు వాడుతున్నారు.



ప్రస్తుతం ఆధార్ కార్డు వల్ల పౌరులకు అనేక సేవలు అందుతున్నప్పటికి, అది ఐచ్ఛికం చేయడం వల్ల అసలు లక్ష్యాలు దెబ్బతిన్నాయి. ప్రయోజనం పొందే దగ్గర పౌరులు ఆధార్ సమర్పించి, ఎగవేతల దగ్గర మిగతా ఐడీలు వాడుతున్నారు.

భారత ప్రభుత్వం, ఎలక్షన్ కమిషన్ ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేయాలి. 1) ఆధార్ కార్డును ఆధార్ ఐడీ గాను, ఆధార్ అడ్రస్ గాను రెండుగా విభజించాలి. ఐడీ కార్డులో కేవలం వ్యక్తి ఫోటో, పేరు, యూనీక్ నెంబర్ మాత్రమే ఉంచి మిగతావి తొలగించి ఐడీకి మాత్రమే పరిమితం చేయాలి. 2) ఆధార్ అడ్రస్ అని కొత్త కార్డు ప్రవేశపెట్టి అందులో, శాశ్వత చిరునామా, ప్రస్తుత చిరునామాల పేరిట రెండు క్యాటగిరీలుగా అడ్రస్ తీసుకోవాలి. ప్రస్తుత చిరునామాని వ్యక్తులు సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా అప్డేట్ చేసుకొనే అవకాశం ఇవ్వాలి. అది డిజిటల్‌గా లోకేట్ చేసే విధంగా ఉండాలి. కార్డులో ఉండే అడ్రస్ ఆధారంగా మాత్రమే యుటిలిటీ సర్వీసెస్‌ను ప్రజలకు అందచేయాలి. ఎప్పటికప్పుడు అడ్రస్ అప్డేట్ రికార్డు చేసుకోవడం వల్ల ఒక వ్యక్తి అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా, పట్టణాల, గ్రామాల వలస చరిత్ర మొత్తం రికార్డు అవుతుంది. 3) పుట్టిన, మరణించిన ప్రతి మనిషికి ఆధార్ తప్పనిసరి చేయాలి. 4) ఆధార్ ఐడీ ఆధారంగా దేశపరిధిలో ఉన్న ప్రతి మనిషికి నెంబర్ కేటాయించి, జీవించి వున్న మనుషుల జాబితాను (నేషనల్ హ్యూమన్ రిజిస్టర్‌ని) డూప్లికేట్ లేకుండా తయారు చేసుకొన్న తర్వాత, ప్రస్తుతం ఉన్న చట్టాలు, ఆధార్ కార్డు ఆధారంగా పౌరసత్వపు కార్డు మంజూరు చేయవచ్చు (నేషనల్ సిటిజెన్‌షిప్ రిజిస్టర్ తయారు చేయవచ్చు). లేదా ఆధార్ ఐడీని సిటిజెన్‌షిప్‌కి ఎనేబుల్ చేయవచ్చు. అట్లాగే ఓటర్ ఐడీ, ఇతర కార్డులు జారీ చేయవచ్చు. 5) జనన మరణాలు నేషనల్ హ్యూమన్ రిజిస్టర్‌కి అనుసంధానం చేసి ప్రతి జననం తర్వాత, మరణం తర్వాత ఆధార్ ఐడీ కూడిక/ తీసివేత చేసిన తర్వాతే జనన/ మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి.

ఈ చర్యల ద్వారా భారత ప్రభుత్వం వద్ద డైనమిక్‌గా లిస్ట్ అప్డేట్ అవుతుంది. ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోనవసరం లేకుండా పుట్టిన తేదీ ఆధారంగా నేషనల్ హ్యూమన్ రిజిస్టర్ నుండి 18 సంవత్సరాలు నిండిన వ్యక్తులకు ఓటర్ ఐడీ జారీ కావాలి, లేదా ఆధార్ ఐడీని ఓటింగ్‌కి ఎనేబుల్ చేయాలి. ఈ చర్యలు తీసుకున్న తర్వాత ఎలక్షన్ కమిషన్ ప్రతి ఎన్నికకూ ముందు ఓటర్ జాబితా సవరణ చేపట్టాల్సిన అవసరం ఉండదు. హోమ్ మినిస్ట్రీ దగ్గర ఉన్న నేషనల్ సిటిజెన్ రిజిస్టర్ ద్వారా ఎన్నికలకు సిద్ధం కావచ్చు.

ఎలక్షన్ కమిషన్ కూడా పోలింగ్ బూత్‌లో ట్యాబుల వాడకం మొదలుపెట్టాలి. నియోజకవర్గానికి చెందిన మొత్తం ఓటర్ లిస్ట్‌తో లోడ్ చేసిన ట్యాబు పోలింగ్ బూత్‌కి ఇవ్వాలి. ఓటర్ ఐడీ కార్డులో ఉండే బార్ కోడ్ స్కాన్ చేసుకొని, వచ్చిన వివరాలతో థంబ్ ద్వారా, లేదా ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకొని ఓటింగ్‌కి అవకాశం ఇవ్వాలి. అవసరం అయితే ఓటర్ ఫోటోను కూడా ట్యాబులో తీసుకోవచ్చు. దీని ద్వారా ఫేక్, బినామీ ఓటర్లను అరికట్టవచ్చు. డిజిటల్ లిస్ట్ ట్యాబ్‌లో ఉంటుంది కాబట్టి ఎన్నిక జరుగుతున్న ప్రాదేశిక నియోజకవర్గం పరిధిలో ఏ బూత్‌లోనైనా ఓటింగ్‌కి అవకాశం కల్పించవచ్చు. తద్వారా ఓటింగ్ శాతం పెరిగే, రియల్ టైమ్‌లో ట్యాబ్‌ల ద్వారా ఓటింగ్ శాతం మోనిటర్ చేసే అవకాశం ఉంది. పోలైన ఓట్లు, సంతకాలు పెట్టిన ఓట్లు తేడా వచ్చే అవకాశం లేదు. ఈ విధంగా ఎలక్షన్ కమిషన్ సాంకేతికతను ఆలంబన చేసుకొని మరింత పకడ్బందీ ఎన్నికలు నిర్వహించాలి.

● వంశీకృష్ణ

'సల్వాజుడుం' తీర్పుపై రాజకీయ దాడి

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి తమ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడం ఎన్డీఏ కూటమికి ఆందోళన కలిగిస్తున్నట్లుంది. లేదంటే సుదర్శన్‌రెడ్డిపై కేంద్ర హోం మినిస్టర్ అంత తీవ్రంగా ఆరోపణలు చేయవలసిన అవసరం లేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి నక్సలైట్ల మద్దతుదారు అనీ, అందుకే సల్వాజుడుంను నిషేధిస్తూ తీర్పు ఇచ్చారనీ, ఈ తీర్పు ఇవ్వకపోతే 2020 వరకే దేశంలో నక్సలిజం అంతం అయ్యేదనీ హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పులలో లోపాలు ఉంటే ఎత్తి చూపడం తప్పు ఏమీ కాదు. కానీ ఎటువంటి ఆధారాలూ చూపకుండా, తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు ఉద్దేశాలను అంటగడుతూ వ్యక్తిగత దాడి చేయడం కోర్టు ధిక్కారం కిందకు రాగల నేరం!

ఇంతకూ సల్వాజుడుం అంటే ఏమిటో, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సుదర్శన్‌రెడ్డి దానిపైన ఇచ్చిన తీర్పు ఏమిటో ఒకసారి చూద్దాం. 2005లో బస్తర్‌లో నక్సలైట్ ఉద్యమానికి వ్యతిరేకంగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కొంతమంది స్థానిక ఆదివాసీ యువకులను చేరదీసి, వారికి తుపాకులు ఇచ్చి స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్పీఓలు)గా నియమించింది. వీరూ, స్థానిక పెత్తందారులూ కలసి మావోయిస్టు పార్టీకి చెందిన సంఘాలు ఉన్న గ్రామాలపైన దాడులు చేశారు. హత్యలు, అత్యాచారాలు చేశారు. గ్రామాలకు గ్రామాలను తగులబెట్టారు. బలవంతంగా దాదాపు లక్ష మంది ఆదివాసీలను 'సల్వాజుడుం శిబిరాలు' పేరిట కాన్సన్‌ట్రేషన్ క్యాంపుల్లో పెట్టి వేధించారు. ఒక లెక్క ప్రకారం రెండేళ్లలో 600 గ్రామాలను తగులబెట్టి, 23 సల్వాజుడుం శిబిరాలలో యాభై వేలమంది ప్రజలను బలవంతంగా ఉంచారు. ఈ ఎస్పీఓల నాయకత్వంలో జరిగిన ఈ దాడులకు 'సల్వాజుడుం' అని పేరు పెట్టారు. ఈ పదానికి 'శాంతి కొరకు పోరాటం' అని అర్థం చెప్పుకున్నారు. కానీ దాని అసలు అర్థం బలి కోసం చేసే వేట. సల్వాజుడుం వలన హింసాత్మక ఘటనలు పెరిగిపోతున్నాయని స్థానిక పత్రికలు ఎన్నో వార్తలు ప్రచురించాయి. దేశవ్యాప్తంగా హక్కుల సంఘాలు దీనికి వ్యతిరేకంగా నిరసనలు చేశాయి.

2007లో సల్వాజుడుం వ్యవహారాలను, దానికి ప్రభుత్వ మద్దతును సవాలు చేస్తూ ప్రముఖ విద్యావేత్త నందినీ సుందర్, సుప్రసిద్ధ విశ్రాంత పాలనాధికారి, భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇ.ఎ.ఎస్.శర్మ; చరిత్ర పరిశోధకులు రామచంద్ర గుహ తదితరులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సుదర్శన్‌రెడ్డి, సహ న్యాయమూర్తి సురేందర్ సింగ్ నిజ్జర్‌లు కలిసి సుదీర్ఘమైన వాదప్రతివాదాలు విన్న తర్వాత, 2011లో సల్వాజుడుం పైన చరిత్రాత్మకమైన తీర్పును ఇచ్చారు. తుది తీర్పు ఇచ్చిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, సురేందర్‌సింగ్ నిజ్జర్‌లు మాత్రమే గాక, అంతకు ముందు విచారించిన న్యాయమూర్తులు– జస్టిస్ బాలకృష్ణన్, జస్టిస్ కపాడియా, జస్టిస్ అఫ్తాబ్ ఆలంలు కూడా ప్రభుత్వమే ప్రజలకు ఆయుధాలు ఇచ్చి హింసకు ప్రోత్సహించడం రాజ్యాంగ విరుద్ధం అని స్పష్టం చేశారు.

> సుప్రీంకోర్టు తీర్పుతో ఛత్తీస్‌గఢ్‌లో స్పెషల్ పోలీస్ ఆఫీసర్ల నియామకం ఆగిపోవటం వల్లనే నక్సలిజం కొనసాగింది అన్నది అమిత్ షా ఆరోపణ. కానీ ఈ తీర్పుతో ఎస్పీఓల వ్యవస్థ ఆగిపోలేదు. ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ పోలీసు చట్టాన్ని తీసుకువచ్చి రకరకాల పేర్లు మార్చి, రూల్స్ మార్చి అటువంటి వ్యవస్థలనే ఆ తర్వాత కూడా కొనసాగించారు. ఎస్పీఓల వ్యవస్థ ఆ తర్వాత డీఆర్‌జీగా అవతారం ఎత్తింది. కాబట్టి అమిత్ షా ఆరోపణలకు ఎటువంటి ఆధారమూ లేదు.



ఏమీ తెలియని ఆదివాసీ యువకులను స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా చేసి, వారికి ఆయుధాలను ఇచ్చి మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో ముందు నిలబెట్టడాన్ని ఈ తీర్పు తప్పుపట్టింది: "వారిని కేవలం తాత్కాలికంగా నియమించడం, గౌరవవేతనం మాత్రమే ఇవ్వడం ఆర్టికల్స్ 21, 14లను భంగపరచడమే! వారికి సాధారణ పోలీసులతో సమానమైన బాధ్యతలు ఇచ్చి, వారికన్నా ప్రమాదకరమైన పరిస్థితులలో నిలబెట్టి ఈ విధులు నిర్వర్తించడం ఆర్టికల్ 14కు వ్యతిరేకం. ఇతర పోలీసుల కన్నా ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయాల్సిన ఈ ఎస్పీఓలకు వారి కంటే తక్కువ వేతనం ఇవ్వడం వారి జీవితం విలువను కించపరచడమే! వారి పేదరికాన్నీ, ఆవేశాన్నీ, క్రూర సామాజిక స్థితికి బాధితులై పగతీర్చుకోవాలన్న వారి తపననీ వాడుకుని ఆ యువకులను ప్రమాదకరమైన ఇలాంటి పనుల్లో నియమించడం అంటే– వారి మనోభావాలను దుర్వినియోగం చేయడమే!" అని ఈ తీర్పు నిర్ధారించింది. 'నక్సలైటు వ్యతిరేక ఫిరంగులకు ఈ ఆదివాసీ యువకులను గ్రాసంగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వాడుకుంటున్నదా?' అని కూడా ప్రశ్నించింది.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే– కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలు విద్యార్థులకు చెందిన స్కూళ్లను, హాస్టళ్లను, అంగన్వాడీ భవనాలను వెంటనే ఖాళీ చేయాలని కూడా కోర్టు తన తీర్పులో చెప్పింది. దీనిపై స్పందిస్తూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం భద్రతాదళాల స్వాధీనంలో ఏ భవనాలూ లేవనీ, అన్నిటినీ ఖాళీ చేశామనీ చెప్పింది. కాని పరిశీలనలో ఆ భవనాలన్నీ భద్రతాదళాల స్వాధీనంలోనే ఉన్నాయని తేలింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం విడిగా మరో ప్రమాణ పత్రం సమర్పించి సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చేయడానికి సమయాన్ని కోరింది. సుప్రీంకోర్టు వల్లనే భద్రతా బలగాలు ఇతర ప్రభుత్వ విభాగాల భవనాలను ఖాళీ చేశాయి.

సుప్రీంకోర్టు తీర్పుతో ఛత్తీస్‌గఢ్‌లో స్పెషల్ పోలీస్ ఆఫీసర్ల నియామకం ఆగిపోవటం వల్లనే నక్సలిజం కొనసాగింది అన్నది అమిత్ షా ఆరోపణ. కానీ ఈ తీర్పుతో ఎస్పీఓల వ్యవస్థ ఆగిపోలేదు. ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ పోలీసు చట్టాన్ని తీసుకువచ్చి రకరకాల పేర్లు మార్చి, రూల్స్ మార్చి అటువంటి వ్యవస్థలనే ఆ తర్వాత కూడా కొనసాగించారు. ఎస్పీఓల వ్యవస్థ ఆ తర్వాత డీఆర్‌జీగా అవతారం ఎత్తింది. కాబట్టి అమిత్ షా ఆరోపణలకు ఎటువంటి ఆధారమూ లేదు.

ఈ వ్యవస్థ ఆగలేదు కాబట్టే– సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయనందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంపై కోర్టు ధిక్కారం కింద చర్యలు తీసుకోవాలని నందినీ సుందర్, రామచంద్ర గుహ పిటిషన్ దాఖలు చేశారు. దీనికి స్పందిస్తూ సుప్రీంకోర్టు జూలై 24, 2012లో ప్రస్తుత పరిస్థితిని వివరించాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా ఆ రాష్ట్ర ప్రభుత్వం తను చేయాలనుకున్నదే చేసింది. ఎంతో అనుభవం ఉన్న న్యాయవాదుల బృందం, సమాజంలోని ప్రముఖ వ్యక్తులు, సంవత్సరాల తరబడి చేసిన శ్రమ, ఒక చరిత్రాత్మకమైన తీర్పు... ఇవేవీ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనను ఆపలేకపోయాయి.

ఇంతకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నక్సలైట్ల పక్షం తీసుకున్నారనే వాదనలో నిజం ఎంత ఉన్నదో వారు ఇచ్చిన తీర్పులోని మరొక భాగం చూస్తే అర్థమవుతుంది. తీర్పులోని 68వ పాయింట్ ఇలా చెబుతోంది: "మావోయిస్టు లేదా నక్సలైట్ హింస వల్ల ఛత్తీస్‌గఢ్ రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నది వాస్తవమేనని మేము గుర్తించాం. ఎన్నో సామాజిక, ఆర్థిక కారణాలు ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన కొన్ని విధానాలు నక్సల్ హింసకు కారణం అయినప్పటికీ, నక్సలైట్ హింసను మేము క్షమించలేం. రాజ్యాన్ని కూలదోయడం, రాజ్య ప్రతినిధులను చంపడం, అమాయక పౌరులను హింసించడం అంటే చట్టబద్ధమైన జీవన విధానాన్ని ధ్వంసం చేయడమే. ఇటువంటి హింసాయుత తీవ్రవాదాన్ని ఎదిరించి పోరాడిన దేశ ప్రజలకు భద్రత కల్పించవలసిన నైతిక రాజ్యాంగపరమైన బాధ్యత రాజ్యంపైన ఉంది. ఇది ప్రాథమిక అవసరం అని కూడా మేము భావిస్తున్నాం". తీర్పులోని ఈ చిన్న భాగం చూసినా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నక్సలైట్ల పక్షం వహించారన్న ఆరోపణలు అవాస్తవాలని తెలిసిపోతుంది. అమిత్ షా ఆరోపణ ఉపరాష్ట్రపతి ఎన్నికలో భాగంగా చేసిన ఒక రాజకీయ ఎత్తుగడ మాత్రమే.

■ లంకా పాపిరెడ్డి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

బహురూపుడు భక్తసులభుడు

వైదిక సంప్రదాయంలో శ్రీ విఘ్నేశ్వరుడికి ఉండే ప్రథమ స్థానం గురించి ప్రత్యేకంగా వివరించవలసిన అవసరం లేదు. ఆది పూజను అందుకొనే గజాననుడు శైవ ఆగమాలలో 32 విభిన్న రూపాలలో దర్శనమిస్తాడు. కాగా.. 'చింత్యాగమం' అనే గ్రంథం గణపతిని షోడశ మూర్తిగా ఆవిష్కరిస్తూ... 16 రూపాలను వివరించింది. ఆ రూపాల ధ్యాన శ్లోకాలను పరిస్తూ... ఆయనను ఆరాధిస్తే కలిగే శుభ ఫలితాలను కూడా వివరించింది. వాటిలో ప్రధానమైన ఎనిమిది రూపాలు ఇవి...



శ్రీ బాల గణపతి:

బుద్ధి మాంద్యం కలిగినవారికే కాదు... తమ జ్ఞానం మరింత మెరుగ్గా వికసించాలని కోరుకొనే వారికీ బుద్ధి వికాసం కలిగించే ఈ స్వామి ప్రసన్నత కోసం ఈ కింది శ్లోకాన్ని పఠిస్తూ... సాష్టాంగ నమస్కారాలను సమర్పించాలి.

శ్లోకం: కరస్థకదలీ చూత పనసేక్షుకమోదకమ్
బాలసూర్యనిభం వందే దేవం బాలగణాధిపమ్

భావం: కుడివైపు రెండు చేతులలో మామిడి పండు (చూత), అరటి పండు (కదళీ), ఎడమవైపు రెండు చేతులలో పనస పండు, చెరుకుగడ (ఇక్షు దండం), తొండంతో మోదకం ధరించి బాలసూర్యుడిలా ప్రకాశిస్తున్న బాల గణపతికి నమస్కరిస్తున్నాను.



శ్రీ విజయ గణపతి:

చేపట్టిన ప్రతి కార్యంలో, సంకల్పించిన ప్రతి ఉన్నత ఆశయంలో అసాధ్యాన్ని సుసాధ్యాలు చేస్తూ... సర్వత్రా విజయాన్ని అందించే శ్రీ విజయగణపతి అనుగ్రహం పొందడానికి ఈ శ్లోకంతో ధ్యానించాలి.

శ్లోకం: పాశాంకుశస్వదంతామ్రఫల
వానాఖువాహనః
విఘ్నం నిహంతునః సర్వం రక్తవర్ణో
వినాయకః

భావం: ఎర్రని శరీరకాంతితో, ఎలుక వాహనాన్ని అధిరోహించి, నాలుగు చేతుల్లో తన దంతాన్ని, అంకుశాన్ని, మామిడి పండును, పాశాన్ని ధరించిన శ్రీ విజయగణపతిని సకల కార్యాల్లో అన్ని అడ్డంకులను తొలగించి, సర్వత్రా విజయాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను



శ్రీ భక్త గణపతి:

ఆరాధించినవారిని అనుగ్రహించి, వారిలో ఆత్మవిశ్వాసం బలపడేలా చేసి, ఇహపరసిద్ధులను కలిగించే శ్రీ భక్తగణపతిని ఈ శ్లోకంతో స్తుతించాలి.

శ్లోకం: నారికేళామ్రకదలీ గుడపాయస ధారిణమ్... శరచ్చంద్రాభవపుషం భజే భక్తగణాధిపమ్

భావం: తెల్లని శరీరకాంతితో ప్రకాశిస్తూ, చేతుల్లో మామిడి పండు, అరటి పండు, బెల్లంతో చేసిన పాయస పాత్రను, కొబ్బరి కాయను ధరించి, ఆశ్రయించిన వారిని గొప్ప భక్తులుగా మార్చే భక్తగణపతిని నిరంతరం స్తుతిస్తాను.




శ్రీ మహా గణపతి:

తనను ఉపాసించిన భక్తులను... వారి జాతక చక్రంలో దోషాల వల్ల కలిగే గ్రహ బాధలను నుంచి, వారు అనుభవిస్తున్న ప్రారబ్ధ కర్మల నుంచి, సకల కష్టాల నుంచి విముక్తులను చేసే శ్రీ మహా గణపతిని ఈ శ్లోకంతో ఉపాసించాలి.

శ్లోకం: హస్తీంద్రానన మిందుచూడ మరుణచ్ఛాయం త్రినేత్రం రసా
దాశ్లిష్టం ప్రియయా సపద్మకరయా స్వాంకస్థయా సంతతమ్
బీజాపూరగదేక్షుకార్ముకలసచ్చక్రాబ్జపాశోత్పల
వ్రీహ్యగ్రస్వవిషాణరత్నకలశాన్ హస్తైర్వహంతం భజే

భావం: ఎర్రని శరీర కాంతితో, గజ ముఖంతో, నెలవంకతో కూడిన శిరోభూషణంతో, మూడు కన్నులతో... తన దంతం, దానిమ్మ పండు, కలువ పువ్వు, వరికంకులు, చక్రం, గద, చెరుకు విల్లు, పద్మం, పాశం ధరించి, తన ఎడమ తొడపై ఆశీనురాలైన (రెండు చేతులతో పద్మాలు ధరించిన) దేవేరిని ఒక చేతితో ఆలింగనం చేసుకొని, తొండంతో రత్న కుంభాన్ని పట్టుకున్న శ్రీ మహా గణపతిని నిత్యమూ భజిస్తాను.



శ్రీ శక్తి గణపతి:

జీవనయానంలో, దాంపత్య జీవితంలో అపోహలతో ఎప్పుడైనా నైరాశ్యానికి లోనైనట్టయితే... అలాంటి సమయాల్లో తనను ఆరాధించినవారికి ఆత్మస్థైర్యాన్ని కలిగించే శ్రీ శక్తి గణపతిని ఈ శ్లోకంతో పూజించాలి.

శ్లోకం: ఆలింగ్య దేవీం హరితాంగయష్టిం, పరస్పరాశ్లిష్ట కటి ప్రదేశమ్
సంధ్యారుణం పాశసృణీవహంతం, భయావహం శక్తిగణేశమీడే

భావం: సంధ్యాకాంతి లాంటి ఎర్రని శరీరచ్ఛాయతో తేజోవంతుడై, ఆకుపచ్చని శరీరకాంతితో ప్రకాశించే దేవిని తన ఎడమ చేతితో ఆలింగనం చేసుకొని, ఆమె కటి ప్రదేశం మీద చేతిని ఉంచి, దంతాన్ని, అంకుశాన్ని, పాశాన్ని ధరించి ఉండే శ్రీ శక్తి గణపతిని అపోహలను, భయాన్ని దూరం చేయాల్సిందిగా ప్రార్థిస్తున్నాను.



శ్రీ లక్ష్మీ గణపతి:

సకల భోగ భాగ్యాలను ప్రసాదించేవాడు శ్రీ లక్ష్మీ గణపతి. తనను ఆరాధించినవారికి ధన, ధాన్య సమృద్ధిని, అష్టైశ్వర్యాలను అనుగ్రహించే ఆయనను ఈ శ్లోకంతో ప్రార్థించాలి.

శ్లోకం: బిభ్రాణః శుకబీజపూరకమిలన్మాణిక్య కుంభాంకుశాన్
పాశం కల్పలతాం చ ఖడ్గవిలస జ్జ్యోతిః సుధాధానిర్ఝరః
శ్యామేనాత్తసరోరుహేణ సహితం దేవీద్వయం చాంతికే
గౌరాంగో వరదానహస్త సహితో లక్ష్మీగణేశోవతాత్

భావం: తెల్లని శరీరకాంతితో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ... ఇరువైపులా నల్ల తామర పూవులు ధరించి ఉన్న దేవేరులను ఆలింగనం చేసుకొని, చిలుక, దానిమ్మపండు, ఖడ్గం, అంకుశం, రత్న పాత్ర, కల్పలత, పాశాలను ధరించి, ఒక చేతితో వరదముద్రను ప్రదర్శించే శ్రీ లక్ష్మీ గణపతిని... సమస్త సన్మంగళాలను ప్రసాదించి, అందరినీ రక్షించాలని కోరుతూ ఆరాధిస్తున్నాను.



శ్రీ సిద్ధ గణపతి:

పూజించిన భక్తులకు సకల మనో కార్యాలు సిద్ధింపజేసి, వారిని సర్వదా విజేతలుగా శ్రీ సిద్ధ గణపతి తీర్చిదిద్దుతాడు. ఆయనను ఈ శ్లోకంతో ప్రసన్నం చేసుకోవాలి.

శ్లోకం: పక్వచూతఫలపుష్పమంజరీ
రిక్షుదండతిలమోదకైః సహ
ఉత్వహన్ పరశుహస్తతే నమః
శ్రీసమృద్ధియుత హేమపింగళ

భావం: లేత పసుపు రంగు శరీర కాంతితో ప్రకాశిస్తూ, కుడివైపు రెండు చేతుల్లో పండిన మామిడి పండు (పక్వ చూత), గొడ్డలి (పరశు), ఎడమవైపు రెండు చేతుల్లో పూలగుత్తి (పుష్పమంజరి), చెరుకుగడ (ఇక్షుదండం), తొండంతో నువ్వుల కుడుము (తిలమోదక) ధరించి, శ్రీ, సమృద్ధి అనే దేవేరులతో కూడిఉన్న ఓ సిద్ధ గణపతీ! నీకు నమస్కారం.



శ్రీ విఘ్న గణపతి:

సర్వ కార్యాల్లో సమస్త విఘ్నాలనూ తొలగించి, భక్తులకు ఐశ్వర్యాన్ని, యశస్సును శ్రీ విఘ్న గణపతి ప్రసాదిస్తాడు. ఆయనను ఈ శ్లోకంతో ధ్యానించాలి.

శ్లోకం: శంఖేక్షుచాప కుసుమేషు కుఠారపాశ, చక్రస్వదంత సృణిమంజరికా శరాద్యైః
పాణిశ్రితైః పరిసమీహితభూషణశ్రీః, విఘ్నేశ్వరో విజయతే తపనీయగౌరః

భావం: అగ్నిలో కాల్చిన బంగారం లాంటి పచ్చని శరీర కాంతితో, పది చేతుల్లో... దంతాన్ని (స్వదంత), పూల బాణాన్ని (కుసుమేషు), అంకుశాన్ని, గొడ్డలిని, చక్రాన్ని, పూలగుత్తిని (మంజరికా), చెరుకు వింటిని (ఇక్షు చాప), పాశాన్ని, రెల్లు గడ్డిని (శరౌఘ), శంఖాన్ని ధరించి, సర్వాభరణాలతో ప్రకాశించే శ్రీ విఘ్న గణపతికి వందనాలు.





• డి.యన్.వి. ప్రసాద్ స్థపతి, 9440525788



వినాయక చవితి విందు..!

వినాయకుడు స్వతహాగా భోజన ప్రియుడు. అందుకే ఆ స్వామికి అటుకులు, బెల్లం, శనగలు, ఉండ్రాళ్లు, కుడుములు, లడ్డు, పులిహోర... ఇలా ఎన్నింటినో నివేదిస్తూ ఉంటాం. వాటితోపాటు వినాయకచవితి రోజున నివేదించే విభిన్న నైవేద్యాల వివరాలు మీకోసం...



ఉండ్రాళ్లు పెసరపప్పు పాయసం

కావాల్సిన పదార్థాలు

- పెసరపప్పు- అర కప్పు, బియ్యంపిండి- ఒక కప్పు, బెల్లం- ఒక కప్పు, నెయ్యి- అయిదు చెంచాలు, యాలకుల పొడి- అర చెంచా, చిక్కని కొబ్బరి పాలు- రెండు కప్పులు, జీడి పప్పులు- పది, బాదం పప్పులు- పది, కిస్‌మిస్‌లు- పది

తయారీ విధానం

- పెసరపప్పును శుభ్రంగా కడిగి కుక్కర్‌లో వేసి ఒక కప్పు నీళ్లు పోసి రెండు విజిల్స్ వచ్చే వరకు మెత్తగా ఉడికించాలి. తరవాత ఈ పప్పును మెత్తగా మెదిపి గిన్నెలోకి తీసుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి ఒకటింబావు కప్పుల నీళ్లు పోసి వేడి చేయాలి. అందులో మూడు చెంచాల బెల్లం, ఒక చెంచా నెయ్యి వేసి కరిగించాలి. తరవాత బియ్యంపిండి వేసి బాగా కలుపుతూ ఉడికించాలి. పిండి బాగా దగ్గరికి వచ్చాక స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మిశ్రమాన్ని చల్లార్చి చేతికి కొద్దిగా నెయ్యి రాసుకుని చిన్న చిన్న ఉండ్రాళ్లు చేయాలి.
- స్టవ్ మీద పాన్ పెట్టి అందులో బెల్లం, రెండు కప్పుల నీళ్లు వేసి కరిగించాలి. బెల్లం కరిగిన తరవాత ముందుగా ఉడికించి పెట్టుకున్న పెసరపప్పు వేసి బాగా కలపాలి. పెసరపప్పు మొత్తం బెల్లం నీళ్లలో కలిశాక... బియ్యం పిండి ఉండ్రాళ్లు వేసి కలపాలి. వీటిని చిన్న మంట మీద పది నిమిషాలపాటు ఉడికించాలి. ఇవి బెల్లం-పెసరపప్పు మిశ్రమంలో ఉడికి బాగా ఉబ్బి పైపైన తేలుతుంటాయి. వెంటనే స్టవ్ మీద నుంచి దించి అందులో యాలకుల పొడి, కొబ్బరిపాలు వేసి బాగా కలపాలి.
- స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి మూడు చెంచాల నెయ్యి వేసి కరిగించాలి. అందులో జీడిపప్పులు, బాదంపప్పులు, కిస్‌మిస్‌లు వేసి దోరగా వేయించి... నేతితో సహా ఉండ్రాళ్ల మిశ్రమంలో వేసి కలపాలి. తియ్యని ఉండ్రాళ్లు- పెసరపప్పు పాయసం నైవేద్యానికి రెడీ..!

తుమ్మికూర పచ్చడి

కావాల్సిన పదార్థాలు

- తుమ్మికూర- ఒక కప్పు, పచ్చి చింతకాయ ముక్కలు- ఒక కప్పు, పచ్చిమిర్చి- తొమ్మిది, ఎండుమిర్చి- రెండు, వేయించిన జీలకర్ర- ఒక చెంచా, వేయించిన మెంతులు- పావు చెంచా, ఇంగువ- చిటికెడు, పసుపు- పావు చెంచా, ఉప్పు- తగినంత, నూనె- తగినంత, ఆవాలు- పావు చెంచా, మినపపప్పు- అర చెంచా, కరివేపాకు- కొద్దిగా

తయారీ విధానం

- తుమ్మికూరను నీళ్లతో శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి నాలుగు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. అందులో పచ్చి మిర్చి ముక్కలు, చింతకాయ ముక్కలు వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. తరవాత నూనెలో కొద్దిగా ఇంగువ వేసి కలపాలి. వెంటనే తుమ్మికూరను కూడా వేసి బాగా వేపి మరో పళ్లెంలోకి తీయాలి. చిన్న రోలులో వేయించిన జీలకర్ర, వేయించిన మెంతులు, ఉప్పు వేసి మెత్తగా నూరాలి. తరవాత పచ్చిమిర్చి-చింతకాయల మిశ్రమం, వేయించిన తుమ్మికూర వేసి నూరాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి తీయాలి. స్టవ్ మీద నూనె గిన్నె పెట్టి మరో చెంచా నూనె వేసి వేడిచేయాలి. అందులో పసుపు, ఆవాలు, మినపపప్పు, ఎండుమిర్చి, కరివేపాకు వేసి ఎర్రగా వేపాలి. ఈ తాలింపును పచ్చడిలో వేసి కలపాలి. ఇలా తయారుచేసుకున్న తుమ్మికూర పచ్చడిని ఉండ్రాళ్లతోపాటు వినాయకునికి నివేదించాలి.



వినాయక చవితి రోజున 21 ఆకులతో గణనాథుణ్ణి పూజించడం సంప్రదాయం. 'ఏకవింశతి పత్రాలు'గా వ్యవహరించే ఈ ఆకులన్నీ ఆరోగ్యకారకాలని ఆయుర్వేదం చెబుతోంది.

ఏకవింశతి పత్రాలు... ఆరోగ్య సూత్రాలు!

1 
మాచీ పత్రం (మాచి పత్రి)
ఆర్టీమీసియా వల్గారిస్- మంచి సువాసన గల పత్రి. తలనొప్పులు, కంటి దోషాలు తగ్గుతాయి.

2 
బృహతీ పత్రం (వాకుడు)
దగ్గు, ఉబ్బసం, గొంతు, ఊపిరితిత్తుల సమస్యలను అరికట్టేందుకు ఉపయోగపడుతుంది.

3 
బిల్వ పత్రం(మారేడు)
ఈ వృక్షం బహు ప్రయోజనకారి. ఆకు పసరు పలు చర్మ దోషాలను నివారిస్తుంది.

4 
దుర్వాయుగ్మం (గరిక)
రక్త పైత్యానికి, మూత్ర సంబంధిత సమస్యలకు నివారకంగా పనిచేస్తుంది.

5 
దత్తూర పత్రం (ఉమ్మెత్త)
ఆస్తమా, ఇతర దగ్గులకు, కీళ్లవాతాలకు మంచి మందు. ఆకురసం తేలు, జెర్రి, ఎలుక కాట్లకు విషహారిణిగా పనిచేస్తుంది.

6 
బదరీ పత్రం (రేగు)
అజీర్తి, రక్త దోషాలను నివారిస్తుంది. వీర్యవృద్ధికి తోడ్పడుతుంది.

7 
అపామార్గ పత్రం (ఉత్తరేణి)
గాయాలను మాన్పడంలో, ఇతర చర్మ సమస్యలకు అద్భుతంగా పనిచేస్తుంది.

8 
తులసీ పత్రం (తులసి)
దగ్గు, జలుబు, జ్వరం, చర్మ వ్యాధులలను నివారిస్తుంది. క్రిములను నశింపజేస్తుంది. మొక్కలను చీడపీడల నుంచి కాపాడుతుంది.

9 
చూత పత్రం (మామిడి ఆకు)
మామిడి భూమండలంలో అతి పురాతనమైన పండ్ల మొక్కల్లో ప్రధానమైనది. పాదాల బాధల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

10 
కరవీర పత్రం (గన్నేరు)
తలలో చుండ్రును తగ్గిస్తుంది. ఈ మొక్క విష తుల్యం కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకొని వాడాలి.

11 
విష్ణుక్రాంత పత్రం (విష్ణుకాంత)
దీర్ఘకాలిక దగ్గును, కఫవాతాలను, జ్వరాలను నివారిస్తుంది.

12 
దాడిమీ పత్రం (దానిమ్మ)
శరీరంలో త్రిదోషాలైన వాత, పిత్త, కఫాలను హరింపజేస్తుంది.

13 
దేవదారు పత్రం (దేవదారు)
దేవదారు తైలం చర్మవ్యాధులు, గొంతు సమస్యలు, పేగుల్లో పుండ్ల నివారణకు, కండరాల బలోపేతానికి ఉపయుక్తంగా ఉంటుంది.

14 
మరువక పత్రం (మరువం)
నరాల ఉత్తేజరణకు, చెవిపోటు, నొప్పులకు ఔషధంగా ఉపయోగపడుతుంది.

15 
సింధువార పత్రం (వావిలి)
వాతం, శరీరం, తలమాడు నొప్పిలను తగ్గిస్తుంది. పంటి చిగుళ్ల, కీళ్ల బాధలను నివారిస్తుంది.

16 
జాజీ పత్రం (జాజి ఆకు)
ఈ ఆకులు శరీరానికి వేడిని, శక్తిని అందించి, వాపుల్ని, నొప్పిని తగ్గిస్తాయి. రక్త శుద్ధి చేస్తాయి.


17 
గండకీ పత్రం (దేవకాంచనం)
కడుపులో నులిపురుగులను హరిస్తుంది.

18 
శమీ పత్రం (జమ్మి ఆకు)
ఈ ఆకురసం మాడుకు చల్లదనాన్నిచ్చి, జుట్టు నిగనిగలాడేందుకు ఉపకరిస్తుంది. ఈ చెట్టు పైనుంచి వీచే గాలి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

19 
అశ్వత్థ పత్రం (రావి ఆకు)
శరీరంలో విషాల విరుగుడుకు, క్రిమిదోషాలను నివారించేందుకు వినియోగిస్తారు.

20 
అర్జున పత్రం (తెల్ల మద్ది)
దీని బెరడు కషాయం గుండె ఆరోగ్యంగా, పదిలంగా ఉండడానికి దోహదం చేస్తుంది.

21 
అర్క పత్రం (తెల్ల జిల్లేడు)
తెల్లజిల్లేడును సూర్యునికి ప్రతీకగా భావిస్తారు. దీనిలోని ఔషధగుణాలు శరీరాన్ని కాంతిమంతం చేస్తాయి.



మట్టి వినాయకుడిని తయారుచేద్దాం...రండి!

స్వహస్తాలతో గణపతిని రూపొందించి అందంగా అలంకరించి పూజిస్తే ఆ ఆనందాన్ని మాటల్లో వర్ణించలేం. అందుకే ఈ వినాయకచవితి పూజ కోసం మట్టితో సులువుగా వినాయకుడిని ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం..!

1. బంకమట్టిని తెచ్చి నీళ్లు చల్లి మెత్తని ముద్దలా చేయాలి. దాన్ని పదినిమిషాలపాటు నాననివ్వాలి. దానితో అయిదు పెద్ద ఉండలు, అయిదు చిన్న ఉండలు చేసుకోవాలి. ఒక పెద్ద ఉండను తీసుకుని అరచేతిలో పెట్టుకుని ఒత్తుతూ దీర్ఘచతురస్రాకారపు పీఠంలా తయారు చేయాలి. ఈ పీఠం మధ్యలో మరో పెద్ద ఉండను పెట్టి బొజ్జ ఆకారంలో ఒత్తాలి.
2. మరో రెండు పెద్ద ఉండలను తీసుకుని కాళ్ల మాదిరిగా ఒత్తి బొజ్జకు ఇరు పక్కలా అమర్చాలి. ఈ కాళ్ల చివర్లలో కొద్దిగా నొక్కి పాదాల మాదిరిగా చేయాలి. సన్నని పుల్లతో వేళ్లు, అందెలు తీర్చిదిద్దాలి. బొజ్జ మీద మరో పెద్ద ఉండను ఛాతీ ఆకారంలో తీర్చిదిద్దాలి.
3. రెండు చిన్న ఉండలను చేతుల మాదిరి చేసి రెండింటినీ మధ్యకు కొద్దిగా వంచాలి. ఒక దాన్ని అభయ హస్తంలా చేయాలి. రెండోదానికి లడ్డూని ఉంచడానికి వీలుగా అరచేయి ఉండేలా వేళ్లతో నొక్కాలి. సన్నని పుల్లతో వేళ్లు, చేతులకు ఆభరణాలు గీయాలి. ఈ చేతులను ఛాతికి ఇరువైపులా అమర్చాలి. ఛాతిపైన మరో చిన్న ఉండను పెట్టి ముఖాకృతి వచ్చేలా నొక్కాలి. మిగిలిన రెండు చిన్న ఉండలతో చెవులు తయారుచేసి ముఖానికి ఇరువైపులా అతికించాలి.
4. కొద్దిగా బంకమట్టిని తీసుకుని తొండం మాదిరి చేసి కుడివైపునకు కొద్దిగా తిప్పాలి. దీన్ని ముఖం మధ్య భాగంలో అతికించాలి. తొండానికి ఎడమవైపున పూర్తి దంతం, కుడివైపున సగం దంతాన్ని అమర్చాలి. ముఖం మీద కళ్లు దిద్దాలి. ఇంకాస్త బంకమట్టిని తీసుకుని హారంలా చేసి ఛాతి మీద నుంచి బొజ్జ వరకు వచ్చేలా అతికించాలి. అలాగే యజ్ఞోపవీతం, నాగాభరణం కూడా పెట్టుకోవచ్చు.
5. మిగిలిన బంకమట్టితో మీకు నచ్చిన ఆకృతిలో కిరీటం తయారుచేసి తలమీద అతికించాలి. అంతే! వినాయకుడు పూజకు రెడీ..!

సుందరకాండ నచ్చితే సపోర్ట్ చేయండి

- నారా రోహిత్



'ఒక సినిమా ప్రేక్షకుల ముందుకొస్తోంది అంటే అది హీరోగా నా ఒక్కడి గొప్పతనం కాదు. దానివెనుక ఎంతోమంది కష్టం ఉంది. థియేటర్‌కు వెళ్లి మా 'సుందరకాండ' సినిమా చూడండి. నచ్చితే సపోర్ట్ చేయండి. నచ్చకుంటే అదే విషయాన్ని చెప్పండి. కానీ సినిమా చూశాకే మీ అభిప్రాయాన్ని ఇతరులతో పంచుకోండి' అని హీరో నారా రోహిత్ అన్నారు. ఆయన కథానాయకుడిగా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వం వహించిన చిత్రమిది. సంతోశ్ చిన్నపొల్ల, గౌతమ్‌రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మాతలు. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నారా రోహిత్ మాట్లాడుతూ "నేను 'సుందరకాండ' సినిమా చేయడానికి ప్రధాన కారణం దర్శకుడు వెంకీ. ఈ సినిమా నటుడిగా నాకు పూర్తి సంతృప్తినిచ్చింది. వినాయక చవితి సందర్భంగా ఈ చిత్రం మీ ముందుకు వస్తోంది. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలసి సినిమా చూడండి. తప్పకుండా మీరందరూ ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. మంచు మనోజ్ మాట్లాడుతూ 'నారా రోహిత్ మొదట్నుంచి భిన్నమైన కథలను ఎంచుకుంటూ, ఏ సపోర్ట్ లేకుండా సొంతంగా ఈ స్థాయికి వచ్చారు. ఈ సినిమాకు గొప్ప విజయాన్ని అందించండి' అని కోరారు. వెంకటేశ్ మాట్లాడుతూ 'నా జీవితంలో ఎప్పటికీ గుర్తుపెట్టుకునే సినిమా ఇది. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది' అన్నారు. 'రోహిత్ గారి సహకారం వల్లే ఈ సినిమాను మీ ముందుకు తీసుకొస్తున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' తరహాలో 'సుందరకాండ' కూడా ప్రేక్షకులను అలరిస్తుంది' అని నిర్మాతలు చెప్పారు.

నా పాత్ర కొత్త తరహాలో సాగుతుంది



'త్రిబాణధారి బార్బరిక్' కథ మన చుట్టూనే జరుగుతున్నట్లు అనిపిస్తుంది. ఇప్పటివరకూ నేను ప్రతినాయక పాత్రలు ఎక్కువగా పోషించాను. కానీ ఇందులో నా పాత్ర సరికొత్తగా ఉంటుంది' అని నటుడు వశిష్ఠ ఎన్ సింహా అన్నారు. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో విజయ్‌పాల్‌రెడ్డి అడిదల నిర్మించారు. ఈనెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వశిష్ఠ ఎన్ సింహా మీడియాతో ముచ్చటించారు. 'ఈ చిత్రం టైటిల్ వినగానే చాలా కొత్తగా అనిపించి, కథ విన్నాను. ఇప్పుడు పురాణ పాత్రల నేపథ్యంలో సినిమాలు ఎక్కువగా వస్తున్నాయి. బార్బరికుని పాత్ర స్ఫూర్తితో దర్శకుడు అద్భుతంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆయన శక్తిని, త్యాగాన్ని ఈ తరానికి తెలియజేప్పేలా సినిమా ఉంటుంది' అన్నారు.

అలరించే హరి 'కథ'



అందమైన ప్రేమకథకు మిస్టరీ ఎలిమెంట్స్ జోడించి తీసిన చిత్రం 'హరిగాని హరికథ'. హరి ఎడ్లపల్లి, ప్రియా హెగ్డే జంటగా నటించారు. సర్వేశ్ వైవి దర్శకత్వంలో సురభి హరీందర్ నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమౌతున్న ఈ చిత్రం నుంచి వినాయక చవితి సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.

మిరాయ్.. వారం వెనక్కి



'హను-మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సూపర్ హిట్ కొట్టిన తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిరాయ్'. మంచు మనోజ్, జగపతిబాబు, శ్రియా శరణ్, రితికా నాయక్ కీలక పాత్రలు పోషించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. సెప్టెంబరు 5న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేశారు మేకర్స్. అయితే, నిర్మాణంతర పనులు ఇంకా మిగిలుండడంతో సినిమా విడుదలను మరో వారం వాయిదా వేశారు. సెప్టెంబరు 12న చిత్రాన్ని 8 భాషల్లో విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఈ నెల 28న ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించి ఓ ఆకట్టుకునే పోస్టర్‌ను విడుదల చేశారు.

మనసా తెలుసా



రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. గీతా ఆర్ట్స్ పతాకంపై ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్ 'నదివే' సినిమాపై అంచనాలను పెంచేసింది. తాజాగా చిత్రం నుంచి 'కలకలమను కలగలపిన కథ మొదలా.. కలవరమున తెగనలిగిన నిజము కలా, ఏం చేయను తడబడిన తప్పటడుగా.. ఏం జరుగుతోంది.. ఏం జరుగుతోంది మనసా తెలుసా' అంటూ సాగే పాటను విడుదల చేశారు మేకర్స్. రాకేందు మౌళి సాహిత్యం అందించగా, చిన్మయి ఆలపించారు. హేషమ్ అబ్దుల్‌వహాబ్ సంగీతం అందించారు.

పండుగ సందడి

» నేడు వినాయక చవితి

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా మంగళవారం సందడి వాతావరణం నెలకొంది. నగరంలోని పూల మార్కెట్, కాళేశ్వరరావు మార్కెట్ కిక్కిరిసిపోయింది. గణపతి మట్టి విగ్రహాలు, పత్రులు, పూలు, ఫలాల విక్రయాలు జోరుగా సాగాయి. గ్రామాల్లో ఇప్పటికే చలువ పందిళ్లను సిద్ధం చేశారు. బుధవారం ప్రజల నుంచి విఘ్నేశ్వరులు పూజలు అందుకోనున్నారు. ఆయా పందిళ్లలో తొమ్మిది రోజుల పాటు కొలువు తీరనున్నారు. 8,10





మహా.. మట్టి గణపతి

బెజవాడ మట్టి గణపయ్యకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

మట్టి విగ్రహాలను ప్రదర్శిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా, కలెక్టర్ లక్ష్మీశ



- ఐదు వేల మందితో రెండు గంటల్లో 7,730 గణేశ్ బొమ్మలు సిద్ధం
- ఇందిరాగాంధీ స్టేడియం, మరిన్ని ప్రాంతాల్లో కోలాహలంగా మట్టి బొమ్మల తయారీ
- మహారాష్ట్ర రికార్డ్‌ను అధిగమించిన బెజవాడ మట్టి గణపయ్య
- మంత్రి, ఎంపీ, కలెక్టర్‌కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రం అందజేత
- పండుగలు పర్యావరణ హితం కావాలి: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్

విజయవాడ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు 'ఎకో ఫ్రెండ్లీ గణేశ్' కార్యక్రమాన్ని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో మంగళవారం నిర్వహించింది. స్టేడియంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఐదు వేల మందితో ఒకే సారి 7,730 గణేశ్ ప్రతిమలను తయారు చేయించారు. దీనికి గానూ బెజవాడ మట్టి గణపతి కార్యక్రమం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ పండుగలు పర్యావరణ హితం కావాలన్నారు. వినాయక చవితి పండుగ ప్రాశస్త్యాన్ని ప్లాస్టర్ ఫారీస్ పాడు చేస్తుందని, భయంకరమైన రసాయనాలకు స్వస్తి చెప్పాలని, మట్టి గణపతినే పూజించాలని ప్రజలకు అవగాహన కల్పించేం



తయారు చేసిన గణపతి మట్టి విగ్రహాలను చూపుతున్న విద్యార్థినులు

దుకు భారీ ఎత్తున చేపట్టిన కార్యక్రమానికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు దక్కడం అభినందనీయమన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ ఆధ్యాత్మిక శోభతో వినాయక చవితి జరుపుకోవాలన్నారు. రానున్న రోజుల్లో విజయవాడ ఉత్సవ్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలకే పూజలు జరిగేవని గుర్తు చేశారు. మధ్యలో వచ్చిన ప్లాస్టర్ ఆఫ్ పారీస్ భూతం పండుగ వాతావరణాన్ని, పర్యావరణాన్ని నాశనం చేసిందన్నారు. మట్టి మిగతా 8లో..



విజయలక్ష్మి



దేవానంద్ కుమార్

అరుదైన గౌరవం

» ఉమ్మడి జిల్లాలో ఇద్దరు అధ్యాపకులను వరించిన జాతీయ అవార్డులు

» ప్రొఫెసర్ డాక్టర్ అయ్యర్ విజయలక్ష్మి, మెండా దేవానంద్ కుమార్‌కు అభినందనల వెల్లువ

విజయవాడ/మైలవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. ఇద్దరు అధ్యాపకులకు జాతీయ ఉత్తమ అధ్యాపకుల అవార్డులు లభించాయి. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ అయ్యర్ కె.విజయలక్ష్మికి సస్టెనిబులిటీ ప్లానింగ్ అండ్ మిగతా 8లో..

చాలా సంతోషంగా ఉంది : దేవానంద్

దేశవ్యాప్తంగా ఎంపికైన 21 మందిలో నేను ఒకడ్ని అయినందుకు చాలా సంతోషంగా ఉంది. అవార్డు నాలో మరింత స్ఫూర్తిని నింపింది. ఇలాంటి అవార్డులు ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకు రావడం ప్రభుత్వ కళాశాలల మీద విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మరింత నమ్మకాన్ని కలిగిస్తాయి. రాష్ట్రం నుంచి ఒకే ఒక్క తెలుగు అధ్యాపకుడిగా ఈ అవార్డు దక్కడం తెలుగు వారికి గర్వకారణమని భావిస్తున్నా.

ఆర్‌ఏపీతో భరోసా!

రాజధానిలో భూమిలేని పేదల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

» రీసెటిల్‌మెంట్ యాక్షన్ ప్లాన్‌కు సీఆర్‌డీఏ శ్రీకారం

» సొంతిల్లు, విద్య, వైద్యం, ఉపాధి కల్పనను మెరుగుపరిచేలా ప్రణాళిక

రాజధానిలో భూమిలేని పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు సీఆర్‌డీఏ సిద్ధమైంది. రీసెటిల్‌మెంట్ యాక్షన్ ప్లాన్(ఆర్‌ఏపీ)కు శ్రీకారం చుట్టింది. కూలీల సొంతింటి కలను నెరవేర్చడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి కల్పనను మెరుగు పరచడంపై ప్రధానంగా దృష్టి సారించనుంది. దీనికి అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అమరావతిలో భూమి లేని పేదల కోసం రీసెటిల్‌మెంట్ యాక్షన్ ప్లాన్ (ఆర్‌ఏపీ)కి సీఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది. అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఏఐయూడీపీ) కార్యక్రమంలో అంతర్భాగంగా రీసెటిల్‌మెంట్ పాలసీని రూపొందించిన సంగతి తెలిసిందే. ఇదే క్రమంలో భూమి లేని పేదల అభ్యున్నతి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రీసెటిల్‌మెంట్ యాక్షన్ ప్లాన్ రెడీ చేసింది. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం రాజధానిలో భూమిలేని పేదలను హౌస్‌హోల్డ్ సర్వే ద్వారా గుర్తిస్తారు. 2015వ సంవత్సరం, ఆ తర్వాత వార్షిక కౌలు వంటి వాటిని కూడా సమీక్షిస్తారు. రాజధాని మిగతా 8లో..



మట్టి విగ్రహం అందజేస్తున్న ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య, ఇందిరా ఫుడ్స్ నిర్వాహకులు మండవ వెంకట రత్నం, మండవ ఇందిరా

మట్టి గణపతిని పూజిద్దాం

» నగరంలో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, ఇందిరా ఫుడ్స్ ఆధ్వర్యంలో విగ్రహాల పంపిణీ

» పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సేవా కార్యక్రమం

విజయవాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దామని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య అన్నారు. నగరంలోని పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, ఇందిరా ఫుడ్స్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి, ఇందిరా ఫుడ్స్ సంయుక్తంగా మట్టి విగ్రహాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది సుమారు ఐదు వేల విగ్రహాలు పంపిణీ చేశారు. ఇందిరా ఫుడ్స్ నిర్వాహకులు మండవ వెంకట రత్నం, మండవ ఇందిరా పాల్గొన్నారు.

తొమ్మిది మంది రెవెన్యూ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు

» 2020 ఏసీబీ నివేదికపై ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

» వీరిలో తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, ఇతర ఉద్యోగులు

మచిలీపట్నం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు మండలంలో పనిచేస్తూ అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్‌తో పాటు మరో ఎనిమిది మంది రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశిస్తూ ప్రభుత్వం మంగళవారం జీవోఎంఎస్ నెంబరు 287ను జారీ చేసింది. తోట్లవల్లూరు మండల తహసీల్దార్, సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తూ నగదు వసూళ్లకు పాల్పడుతున్నారనే అంశంపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో ఏసీబీ అధికారులు 2020, జనవరి 24వ తేదీన తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది వద్ద లెక్కలు చెప్పని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ అంశంపై ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి నివేదికను అందజేశారు. ఈ నివేదిక ప్రకారం అప్పట్లో తోట్లవల్లూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న కట్టా వెంకట శివయ్య, డిప్యూటీ తహసీల్దార్ వేమూరి సాయి మహేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పులివర్తి రవికిషోర్, మిగతా 8లో..

విజయ డెయిరీ డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవం

» డైరెక్టర్లుగా వెంకట నగేశ్, రామారావు, వాణిశ్రీ

» అభినందలు తెలిపిన పాలకవర్గం, అధికారులు



ఏకగ్రీవమైన డైరెక్టర్లను సత్కరిస్తున్న విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు తదితరులు

చిట్టినగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సమితి (విజయ డెయిరీ) పాలక వర్గంలో డైరెక్టర్ల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మూడు డైరెక్టర్ పదవులకు నాలుగు నామినేషన్లు వచ్చాయి. మంగళవారం ఒక అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో పోటీలో ముగ్గురు అభ్యర్థులే మిగిలారు. మూడు పదవులకు ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎల్.గురునాథం ప్రకటించారు. జనరల్ కేటగిరిలోని రెండు పదవులకు పెడన మండలం పెనుమల్లికి చెందిన అర్జా వెంకట నగేశ్, వత్సవాయి మండలం భీమవరానికి చెందిన యింజం రామారావు, మహిళా కేటగిరిలో విస్సన్నపేటకు చెందిన నెక్కళపు వాణిశ్రీ విజయ డెయిరీ డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల మిగతా 8లో..

నోరి ఆస్పత్రిలో చిన్నారి మృతి

ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు, బంధువులు

» వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ

» జలుబు చేసిందని వస్తే ప్రాణాలు తీశారని ఆగ్రహం



మృతి చెందిన చిన్నారి

వన్‌టౌన్/గాంధీనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్వల్ప అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 18 నెలల చిన్నారి ఆకస్మాత్తుగా మృతి చెందడం నగరంలో కలకలం రేపింది. చిన్నారి మృతికి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. వివరాల్లోకి వెళితే... నగరంలోని కెఎల్‌రావు నగర్‌కు చెందిన న్యాయవాది కట్టా శ్రీనివాస్, ప్రసన్న దంపతుల కుమార్తె చిన్నారి అన్విషితదేవి(18 నెలలు)కి జలుబు చేయడంతో ఈ నెల 18వ తేదీన వన్‌టౌన్‌లోని అనురాగ్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ఒక రోజు చికిత్స చేసిన అనంతరం పాపకు మెరుగైన వైద్యం అందించాల్సి ఉందనే మిగతా 8లో..

శిశు విక్రయ ముఠా కలకలం!

» బిడ్డను దత్తతకు ఇప్పిస్తామని తెలంగాణ దంపతులకు వల

» రూ.4 లక్షలు తీసుకుని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉండాలని చెప్పి మాయం

» బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో ఉలిక్కిపడిన నగరం

» పాత ఘటనలను గుర్తు చేసుకుంటున్న జిల్లా ప్రజలు

విజయవాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన సంతానం లేని అశోక్, మౌనిక దంపతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బిడ్డను దత్తత ఇప్పిస్తామంటూ విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు తీసుకొచ్చి వారి వద్ద రూ.4 లక్షలు కాజేసిన ఓ ముఠా వ్యవహారం సోమవారం వెలుగులోకి రావడం స్థానికంగా సంచలనం రేపింది. ఈ నేపథ్యంలో మిగతా 8లో..

భక్తులకు సౌకర్యంగా దసరా ఏర్పాట్లు 8

అంబులెన్స్‌ను అమ్ముకోవడానికేనా..? 10

తిరుపతమ్మ ఆలయ హుండీల ఆదాయం రూ.94లక్షలు

పూజకు వేళాయె..


...లో తరలిస్తున్న భారీ విగ్రహం

» పందిళ్లకు తరలిన గణనాథులు » ఊరూ.. వాడా.. చవితి సందడి
» కిక్కిరిసిన వీధులు » ఆకాశాన్నంటిన పూల ధరలు


పూజకు సిద్ధం చేసిన గణనాథులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : గణేష్ చతుర్థి వేడుకలకు సర్వం సిద్ధమైంది. విజయవాడ నగరంతో పాటు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు చవితి సందడితో మారుమోగుతున్నాయి. గణేశ నవరాత్రులను పురస్కరించుకుని ఇష్టదైవం గణపతికి పూజాది కార్యక్రమాలు నిర్వహించేందుకు భక్తులు సమాయత్తమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే పత్రిళ్ల క్రయవిక్రయాలు జోరందుకున్నాయి. మరోవైపు గణపతి విగ్రహాలను పందిళ్లకు తరలించే పనిలో యువత నిమగ్నమైంది. నగర శివారులోని ఎనికేపాడు, మామిడిపాకలు, నున్న, పోరంకి ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన భారీ గణనాథుల విగ్రహాలను క్రేన్ల సాయంతో వాహనంలోకి ఎక్కించి పందిళ్లకు తరలిస్తున్నారు.



పుర వీధుల్లో కోలాహలం

చవితి పూజా కార్యక్రమాల్లో పూలు, పండ్లు, పత్రిళ్లు ప్రధానమైనవి. గణనాథునికి పత్రిళ్లు, పూలు, పళ్లు సమర్పించడం సాంప్రదాయం. ఈ నేపథ్యంలో భక్తులకు అవసరమైన పత్రిళ్లు, పూలు, పండ్లు విక్రయదారులు మంగళవారం మధ్యాహ్నం నాటికే అందుబాటులోకి తెచ్చారు. నగరంలోని ప్రతి వీధిలోనూ విక్రయాలు జోరందుకున్నాయి. పటమట ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆటోనగర్ బస్ టెర్మినల్ వరకు, హైస్కూల్ రోడ్డులో, రామవరప్పాడురింగ్, చుట్టుగుంట, సీతారామపురం, బీఆర్టీఎస్ రోడ్డు, గాంధీనగర్, సత్యనారాయణపురం, కృష్ణలంక రైతు మార్కెట్, వన్‌టౌన్ మార్కెట్ ప్రాంతాల్లో విక్రయాలు ఊపందుకున్నాయి. రోడ్డు పొడవునా దుకాణాలు వెలిశాయి. ఆరోగ్యానికి మేలు చేకూర్చడంతో పాటు గణనాథునికి ఇష్టమైన వాకుడు, బృహతీపత్రం, మారేడు, గరికె, ఉమ్మెత్త, రేగు, ఉత్తరేణి, మర్రి, మామిడి, గన్నేరు, నిమ్మ, దాడిమీపత్రం, మరువం, మరువకపత్రం, వావిలి, సన్నజాజి, గండకీపత్రం, జమ్మి, రావి, మద్ది, తెల్లజిల్లేడు పత్రాలను విక్రయానికి ఉంచారు. వీటన్నింటినీ కలిపి కట్ట రూ.50 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. వీటితో పాటు పూజా మండపం అలంకరణ కోసం అరటి, కొబ్బరి, తాటి ఆకులను అందుబాటులోకి తెచ్చారు. చవితి పూజకు ఉపయోగించే ప్రతి ఆకు మానవాళి ఆరోగ్యదాయనిగానే ఉంటుంది. పాలు, పసరు స్రవించే ఈ ఆకులు మృత్యుంజయ కారకాలని, ఊపిరితిత్తులను శుద్ధిచేసి శ్వాసను మెరుగుపర్చుతాయని జీవశాస్త్రం చెబుతోంది. గజముఖుడైన వినాయకుడు అంకుశం లాంటి తన తొండంతో మన మనస్సులో పేరుకుపోయిన కల్మషభావాలను తొలగించాలని మొక్కుతూ పత్రిళ్లను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అదేవిధంగా స్వామి వారికి నైవేద్యంగా సమర్పించేందుకు మామిడి, అరటి, జామ, ఎలక్కాయ, బత్తాయి, యాపిల్, ఉమ్మెత్త, మారెడు, సీతాఫలం, దానిమ్మ, సపోటా, పనస, మొక్కజొన్న, జామ తదితర పండ్లను కొనుగోలు చేసేందుకు భక్తులు రావడంతో నగర వీధులన్నీ కోలాహలంగా తయారయ్యాయి. పండ్ల సెట్ మొత్తాన్ని రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ఇదే ప్రాంతాల్లో మట్టి గణపతి ప్రతిమలను విక్రయిస్తున్నారు.

కిక్కిరిసిన పూలమార్కెట్

విఘ్నేశ్వరుడి అలంకరణకు, పూజలో మల్లె, చామంతి, మందార, బంతి, తెల్లజిల్లేడు, శంఖుపుష్పం, తెల్ల, ఎర్ర, పసుపు గన్నేరు, బొండుమల్లి, తామర, కలువ పుష్పాల విక్రయాలతో విజయవాడలోని కాళేశ్వరరావు మార్కెట్ కిక్కిరిసింది. ప్రతిఒక్కరూ పూజాది కార్యక్రమాల్లో తప్పనిసరిగా వీటిని ఉపయోగించడం ఆచారం కావడంతో పూలకు డిమాండ్ అమాంతం పెరిగింది. కేజీ చామంతి రూ.1,200, బంతి రూ.700, మల్లె రూ.2వేలు హోల్‌సేల్‌గా విక్రయాలు జరుపుతున్నారు. మిగిలిన పుష్పాలు ధరలు కాస్త అందుబాటులోనే ఉన్నాయి.








రామవరప్పాడులోని సాయినగర్ కాలనీలో మండపానికి తరలించిన గణేశ ప్రతిమతో ఉత్సవ కమిటీ





గణేశ నిమజ్జనానికి ఏర్పాట్లు

» నగరపాలక కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి సందర్భంగా కృష్ణానదిలో గణేశ నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. మంగళవారం పర్యటనలో భాగంగా సీతమ్మవారి పాదాలు, వన్‌టౌన్, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, ఎంజీ రోడ్డు తదితర ప్రాంతాలను ఏర్పాట్లను పరిశీలించారు. వినాయక నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. భారీ విగ్రహాలను సీతమ్మవారి పాదాల వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లను పూర్తి చేయాలని, చిన్న విగ్రహాల కోసం ప్రత్యేకంగా టాంకర్‌ను ఏర్పాటు చేసి ఇంటి వద్దనే టాంకర్‌లో నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకోవాలని, కాలువల వద్ద కేవలం వినాయకుని మాత్రమే నిమజ్జనం చేసి, ఆకులు పూలను వేసేందుకు ప్రత్యేక డస్ట్‌బిన్స్ ఏర్పాటుచేసి వాటిని తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సహకరించి పెద్ద విగ్రహాలను కేవలం సీతమ్మవారి పాదాల వద్ద


కృష్ణానదిలో గణేశ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

ఏర్పాటుచేసిన పాయింట్లోనే నిమజ్జనం చేయించాలని కోరారు. ప్రజలందరూ పర్యావరణహిత వినాయకుడిని పూజకు వినియోగించి సహకరించాలని విన్నవించారు. పర్యటనలో చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాసరెడ్డి, జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాస్, జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

శిశు విక్రయ ముఠా కలకలం!

(7వ పేజీ తరువాయి)

గతంలో పాత జీజీహెచ్‌లో జరిగిన పలు ఘటనలను నగరవాసులు గుర్తు చేసుకుంటున్నారు. 12 సంవత్సరాల క్రితం శ్రీకాకుళం నుంచి విజయవాడ వచ్చి స్థిరపడిన ఓ కుటుంబానికి చెందిన మహిళ పాత ప్రభుత్వ ఆస్పత్రిలో మగ బిడ్డను ప్రసవించింది. మగ బిడ్డ పుట్టాడు అన్న విషయం కుటుంబ సభ్యులకు తెలియజేయకుండా సిబ్బంది బిడ్డలను మార్చేందుకు బేరం మాట్లాడుకున్నారు. రాత్రి వేళ బిడ్డను వేరే వారికి అప్పగిస్తూ అడ్డంగా దొరికిపోయారు. దీనిపై కేసు నమోదు కావడంతో న్యాయమూర్తి విచారణ జరిపి నిందితులకు శిక్ష కూడా విధించారు. అలాగే ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాల్లో పిల్లలు లేని దంపతులకు సంతానం కలిగిస్తామని చెప్పి అధిక మొత్తంలో డబ్బు గుంజుతున్నారు. రెండు నెలల కిందట హైదరాబాద్ కేంద్రంగా ఇలాంటి ఘటన జరిగినప్పటికీ వాటికి సంబంధించిన మూలాలు విజయవాడలో ఉండడం విశేషం. ఈ ఘటనలో నిందితురాలైన డాక్టర్ నమ్రతకు చెందిన యూనివర్శిల్ ఫెర్టిలిటీ కేంద్రం నగరంలో ఉండటంతో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు తనిఖీల పేరుతో నాలుగు రోజులు హడావుడి చేశారు. తర్వాత ఆ విషయమే మరిచిపోయారు. ఏదో ఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తారని నగర ప్రజలు విమర్శిస్తున్నారు. ఆస్పత్రి వద్ద బిడ్డను ఇప్పిస్తామని చెప్పిన ముఠా ఆస్పత్రి ఆవరణలో వారిని గంటల తరబడి ఉంచినా అక్కడి సిబ్బంది గుర్తించలేకపోవడం గమనార్హం. ఆసుపత్రిలోని డాక్టర్ల ద్వారా బిడ్డను ఇప్పిస్తామని నిందితులు మోసం చేసినట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆస్పత్రిలో ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయా అనే అనుమానాలు నగర ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వమే ప్రత్యేకించి కారా అనే వెబ్‌సైట్ ద్వారా పిల్లలు లేని దంపతులకు దత్తత అందిస్తోంది. కొంతమంది పిల్లలు లేని దంపతులను లక్ష్యంగా చేసుకుని అక్రమంగా శిశువులను విక్రయించేందుకు పాల్పడుతున్నారు. ఇందుకోసం లక్షలాది రూపాయలను వసూలు చేస్తున్నారు.

ఘటనపై విచారిస్తున్నాం



బిడ్డ దత్తత మోసం ఘటనపై విచారిస్తున్నాం. సీసీ కెమెరాలు పరిశీలించడంతో పాటు సిబ్బందిని ఆరా తీస్తున్నాం. రెండింటిలో ఏ ఆస్పత్రి వద్ద ఈ ఘటన జరిగిందో తెలుసుకునే పనిలో ఉన్నాం. ఇలాంటి ఘటనలు ఇక్కడ జరిగే అవకాశం లేదు. తల్లీబిడ్డకు ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లు వేస్తున్నాం. ఈ ట్యాగులు ఉన్నంత వరకు బిడ్డను ఆస్పత్రి బయటకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తే అలారం మొగుతుంది. బిడ్డకు ఆరోగ్యం బాగోలేక తల్లి దగ్గర నుంచి బిడ్డను వేరు చేయాలన్నా మరొక ట్యాగ్ మార్చాల్సి ఉంటుంది. బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్టు షేక్ ఫాతిమా, షేక్ మౌలాలి పేరుతో వైద్యులు లేరు.

-ఏ.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

రెవెన్యూ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు

(5వ పేజీ తరువాయి)

జూనియర్ అసిస్టెంట్ కొంగితాల శివరామకృష్ణ, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ వీఎంపీ జ్యోతి, వీఆర్వోలు కాండ్ర వీరాస్వామి, చౌటపల్లి శ్రీను, కాటూరి బసవరావు, మహ్మద్ అసుదుల్లాపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. క్రమ శిక్షణ చర్యలకు సంబంధించిన నోటీసులు అందుకున్న ఉద్యోగులు పది రోజుల లోపు సంజాయిషీ ఇవ్వాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. తహసీల్దార్ వెంకటశివయ్య ప్రస్తుతం గన్నవరం తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. వీఆర్వోలు కాండ్ర వీరాస్వామి, చౌటపల్లి శ్రీను తోట్లవల్లూరు మండలంలోనే పనిచేస్తున్నారు. వేమూరి సాయిమహేష్ ఇబ్రహీంపట్నం మండలంలో, పులిపర్తి రవికిషోర్ విజయవాడలో పనిచేస్తున్నారు. మిగిలిన వారు ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర మండలాలకు వెళ్లారు. ప్రభుత్వం తొమ్మిది మంది రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు నోటీసులు జారీ చేయడంతో ఈ అంశం రెవెన్యూ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. వీరిపై వేటు పడటం ఖాయమని రెవెన్యూ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

మహో.. మట్టి గణపతి

(7వ పేజీ తరువాయి)

బొమ్మలకే పూజలు చేసి నగరాన్ని కాపాడుకుందామన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ, విశాఖపట్నం, విజయవాడలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలన్నారు. కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత లక్ష్యాలను చేరుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలను పూజించి ప్రకృతి శోభతో ఆధ్యాత్మిక వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. 20 విద్యాసంస్థల విద్యార్థులు, 20 స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నట్లు చెప్పారు. మన మట్టి గణేశ్ ప్రపంచ రికార్డును సాధించడంలో సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు మాట్లాడుతూ, ఎలాంటి రుసుము లేకుండా పందిర్లకు అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఆర్డీవో కావూరి చైతన్య, ఈఈ ఇ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అందజేత

విజయవాడలో నిర్వహించిన మహా మట్టి గణపతి కార్యక్రమం వరల్డ్ బుక్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుందని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఇలియాజర్ ప్రకటించారు. గతంలో 4,464 ప్రతిమలను ఏకకాలంలో తయారు చేసిన మహారాష్ట్ర ప్రభుత్వానికి ఈ రికార్డ్ ఉందన్నారు. అయితే విజయవాడలో 19 ప్రదేశాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐదు వేల మంది పాల్గొని 7,730 ప్రతిమలను తయారు చేసి మహారాష్ట్ర రికార్డును అధిగమించారని వెల్లడించారు. ప్రతిమలను తయారు చేసిన ప్రతి స్థానంలోనూ తమ ప్రతినిధులు ఉండి క్షణ్ణంగా పరిశీలించామని, దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను లండన్‌లోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యాలయానికి పంపామన్నారు. అక్కడి ప్రతినిధులు స్క్రూట్నీ చేసిన తర్వాత సర్టిఫికెట్‌ను మంజూరు చేశారని తెలిపారు. మంజూరైన రికార్డ్స్ పత్రాన్ని మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌లకు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఇలియాజర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న యాజమాన్యాలకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు.

ప్రజలకు ఎంపీ కేశినేని చిన్ని శుభాకాంక్షలు

వన్‌టౌన్: విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ఇంటింటా శుభాలు, విజయాలు కలగాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నిండేలా దీవెనలు లభించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షిస్తూ.. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎంపీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బంగారం వ్యాపారి అదృశ్యం

విజయవాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన బంగారం వ్యాపారి అదృశ్యమయ్యాడు. దీనిపై మాచవరం స్టేషన్‌లో కేసు నమోదైంది. పాలిక్లీనిక్ రోడ్డులోని రాధామాధవ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న షీ షావాల్ జైన్ వన్‌టౌన్‌లో సాయిరాజేంద్ర జ్యూవెలర్స్ పేరుతో వ్యాపారం చేస్తున్నాడు. ట్రేడింగ్ యాప్‌లో రూ. 4కోట్ల వరకు పెట్టుబడి పెట్టాడు. అందులో నష్టాలు రావడంతో రెండు రోజుల కిందట ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. ఆయన కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. వ్యాపారి విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి హౌరా ఎక్స్‌ప్రెస్ ఎక్కినట్టు తేలింది. దీంతో ఆయన కుమారుడు కోల్‌కతాలో ఉన్న బంధువులకు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. ఆయన బంధువులు కోల్‌కతా రైల్వే స్టేషన్‌లో సీసీ కెమెరాలో పరిశీలించగా అక్కడ రైలు దిగినట్టు ఫుటేజీలో తేలింది. బంధువుల ఇంటివద్ద ఉండటంతో ఆయన్ను తీసుకురావడానికి కుమారుడు కోల్‌కతా వెళ్లాడు.

వైషమ్యాలు పెంచేలా పేర్ని వ్యాఖ్యలు

» నానీపై ఏలూరులో కేసు నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్ని నానిపై ఏలూరులో కేసు నమోదైంది. ఏలూరు జిల్లా పెదవేగి మండలం కొండలరావుపాలెంలో ఈనెల 21న జరిగిన సంఘటనలపై ఆ తర్వాత రోజు ఏలూరులో విలేకరుల సమావేశంలో పేర్ని నాని కించపర్చేలా వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తప్పుకుంటే ఎవరు మిగులుతారో చూసుకుందామంటూ నాని హింసను ప్రేరేపించే వ్యాఖ్యలు చేశారని, అబ్బయ్య చౌదరిని చంపితే వెయ్యిమంది అబ్బయ్య చౌదరిలు పుడతారంటూ రెండు వర్గాల మధ్య వైషమ్యాలు పెంచేలా మాట్లాడారని ఫిర్యాదులో టీడీపీ నేతలు పేర్కొన్నారు. పోలీసులను కూడా కించపరిచే వ్యాఖ్యలు చేశారని, ప్రజల్లో అపోహలు కలిగించే రీతిలో మాట్లాడారని టీడీపీ నాయకుడు నేతల రవి నేతృత్వంలో ఫిర్యాదు చేశారు. దీంతో పేర్నినానిపై సెక్షన్ 353(2), 351(3) బీఎన్ఎస్ చట్టం కింద ఏలూరు త్రి టౌన్ ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నోరి ఆస్పత్రిలో చిన్నారి మృతి

(7వ పేజీ తరువాయి)

వైద్యుల సూచన మేరకు మరుసటి రోజు గాంధీనగర్‌లోని నోరి ఆస్పత్రిలో పాపను చేర్చారు. పాపకు ఎలాంటి జబ్బు చేసిందో చెప్పకుండానే రోజుకు రూ.లక్ష చొప్పున వైద్యులు వసూలు చేశారని ఆమె కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. పాపకు వైద్యం చేసేందుకు బయట నుంచి నిపుణుడైన డాక్టర్‌ను తీసుకొచ్చామని, దానికోసం అధిక మొత్తంలో నగదు వసూలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పాప పరిస్థితి మరింత క్షీణించిందని, మెరుగైన వైద్యం కోసం రూ.5 లక్షలు చెల్లించాలని చెప్పడంతో ఈ నెల 24న ఒకే సారి అంత నగదు చెల్లించామని చెప్పారు. మంగళవారం పాప చనిపోయిందని చెప్పి, మృతదేహాన్ని చేతిలో పెట్టారంటూ కన్నీంటి పర్యంతమయ్యారు. ఈ ఘటనతో పాప తల్లి స్పృహతప్పి పడిపోయింది. జలుబు చేసిందని ఆసుపత్రిలో చేర్చితే పాప మృతదేహాన్ని చేతిలో పెట్టారంటూ కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పాప చనిపోయిందని కుటుంబసభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆందోళన చేశారు. వీరికి టీడీపీ, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. సత్యనారాయణపురం స్టేషన్ సీఐ అక్కడకు చేరుకుని చర్చలు జరిపారు. పాప కుటుంబసభ్యులకు న్యాయం చేస్తామని ఆసుపత్రి యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

ఆర్ఏపీతో భరోసా!

(7వ పేజీ తరువాయి)

అమరావతి అభివృద్ధి ప్రణాళికలలో భూములు ఉండటం వల్ల రాజధానిలో అంతర్భాగంగా ఉన్న 24 గ్రామాల పరిధిలో భూమిలేని పేదలు జీవనోపాధిని కోల్పోయే అవకాశం ఉంది. రాజధాని గ్రామాల పేదలకు ప్రధాన ఆదాయ వనరును కోల్పోవటం జరుగుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని రీసెటిల్‌మెంట్ యాక్షన్ ప్లాన్ అమలు చేయనున్నారు.

ఇప్పటి వరకు ప్రభుత్వ తోడ్పాటు

రాజధాని అమరావతిలో మార్చి, 2015లో నిర్వహించిన సోషియో ఎకనమిక్ సర్వే తదనంతరం 2018 నాటికి అప్‌డేట్ చేసిన ప్రకారం 21,530 మంది భూమిలేని పేదలు ఉన్నారు. ఫిబ్రవరి 1, 2025 నాటికి భూమిలేని పేదలు 17,164గా తేలారు. వీరిలో 857 భూమిలేని కుటుంబాలు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అందుకుంటున్నాయి. ఇల్లులేని వారి కోసం గృహ నిర్మాణ పథకాన్ని చేపట్టింది. టిడ్కో ఇళ్ల నిర్మాణంలో భాగంగా రాజధాని అమరావతిలోని అనంతవరం, దొండపాడు, తుళ్లూరు, ఐనవోలు, మందడం, నిడమర్రు, నవులూరు, పెనుమాక గ్రామాల్లో 44.5 ఎకరాల విస్తీర్ణంలో 5,024 ఫ్లాట్లతో కూడిన గృహ నిర్మాణాన్ని తలపెట్టింది. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ద్వారా వారి జీవనోపాధికి బాటలు వేస్తోంది. ఉచిత విద్య, వైద్యం వంటి సదుపాయాలను కూడా కల్పిస్తోంది.

బడ్జెట్‌లో కేటాయింపులు

2025-26 ఆర్థిక సంవత్సరానికి భూమిలేని రాజధాని పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.120.16 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఒక్క పెన్షన్లకే రూ.114 కోట్లు, సోషియో ఎకనమిక్ సర్వేకు రూ. 50లక్షలు, సోషల్ ఆడిట్‌కు రూ.15 లక్షలు, ఎన్‌జీవో నియామకానికి రూ.39 లక్షలు, స్టేక్ హోల్డర్ కన్సల్టేషన్స్‌కు రూ.10 లక్షలు, ఎస్‌ఏసీ సపోర్ట్‌కు రూ.5 కోట్లు, జాబ్ మేళాల నిర్వహణకు రూ.2 లక్షలు చొప్పున బడ్జెట్ కేటాయింపులు చేశారు. ప్రతి నెలా జాబ్ మేళాలు నిర్వహించాలని, ప్రతివారం గ్రీవెన్స్ పెట్టి అర్జీలను స్వీకరించాలని నిర్ణయించారు.

బనకచర్లతో రాయలసీమకు ఎలాంటి ప్రయోజనం లేదు

» రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపేయండి
» విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

గాంధీనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో రాయలసీమకు ఐదు పైసల లాభం లేదని ఈ ప్రాజెక్టు నిర్మాణం రాష్ట్ర ప్రజల మెడకు గుదిబండలా మారుతుందని విశ్రాంత ఐపీఎస్ అధికారి, ఆలోచనాపరుల వేదిక నేత ఏబీ వెంకటేశ్వరరావు విమర్శించారు. 'ప్రాజెక్టులు ప్రజల కోసం నిర్మించాలి' నినాదంతో ఆలోచనాపరుల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి ఆరురోజులపాటు శ్రీశైలం జలాశయం ఆధారంగా నిర్మాణంలో ఉన్న, నిర్మించిన ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, రైతులు, స్వచ్ఛంద, ప్రజా సంఘాలు, నిపుణులతో చర్చించామన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాయలసీమకు నీటి లభ్యత కరువు లేదని, నీటి పారుదల కరువు మాత్రమే ఉందన్నారు. రూ.82 వేల కోట్ల చిత్తు లెక్కతో ప్రతిపాదిస్తున్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును విరమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ. 3 వేల కోట్లు వృథా అయ్యే గత ప్రభుత్వం చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఇంతటితో నిలుపుదల చేయాలన్నారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ స్టే కూడా విధించిందని గుర్తుచేశారు. ఇప్పటికే ఖర్చు చేసిన రూ.750 కోట్లను రుషికొండ పద్దులో కలిపేయండని ఎద్దేవా చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నీటిపారుదల రంగాన్ని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయడం సమంజసమన్నారు. రాష్ట్రంలో శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీటి ప్రాజెక్టుల విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సముద్రం పాలయ్యే నీటిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. రైతుసేవ సంస్థ అధ్యక్షుడు అక్కినేని ప్రసాద్ పాల్గొన్నారు.

'విజయ' డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవం

(5వ పేజీ తరువాయి)

అధికారి గురునాథం ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తొలుత మూడు డైరెక్టర్ పదవులకు ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. పరిశీలనలో తిరువూరు మండలం చిట్టేలకు చెందిన బోయపాటి సుశీల నామినేషన్ తిరస్కరణకు గురవ్వగా, ముష్టికుంట్లకు చెందిన గద్దె రంగారావు తన నామినేషన్‌ను మంగళవారం ఉపసంహరించుకున్నారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు నూతన డైరెక్టర్లు నగేశ్, రామారావు, వాణిశ్రీని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్షా యాభై వేల మంది పాడి రైతులకు తమ పాలకవర్గం ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు వివరించారు. అందువల్లే ప్రతిసారీ ఎన్నికలు పోటీ లేకుండా ఏకగ్రీవం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, డైరెక్టర్లు వేమూరి సాయి వెంకటరమణ, చలసాని చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

అరుదైన గౌరవం

(5వ పేజీ తరువాయి)

ఆర్కిటెక్చర్ విభాగంలో అవార్డు వచ్చింది. ఈమె తమిళనాడుకు చెందిన వారు. తమిళం, హిందీ, ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడగలరు. రెండేళ్లుగా నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పనిచేస్తున్నారు. జాతీయ ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికైన అయ్యర్ విజయలక్ష్మిని కాలేజీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్న మెండా దేవానంద్ కుమార్ జాతీయ ఉత్తమ తెలుగు అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 5న భారత రాష్ట్రపతి చేతుల మీదగా న్యూఢిల్లీలో వీరిద్దరూ జాతీయ అవార్డులను అందుకోనున్నారు.



లయోలలో ..

పటమట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని విజయవాడ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకై సుమారు 500 గణేష్ మట్టి ప్రతిమలను తయారు చేయించి పటమట తదితర ప్రాంతాల్లో పంపిణీ చేశారు. మట్టి వినాయక ప్రతిమలను ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావుకు టీడీపీ నాయకులు చెన్నుపాటి గాంధీకి



ఎమ్మెల్యే రామ్మోహన్‌కు ప్రతిమ అందజేస్తున్న ఆదిత్య విద్యార్థులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక ప్రతిమలు అందజేస్తున్న నిర్వాహకులు

మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఐవోసీఎల్ ప్రతినిధులు, బంక్ మేనేజర్ వెంకటప్పయ్య తదితరులు

పర్యావరణ పరిరక్షణకు
మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

అందజేశారు. ప్రిన్సిపాల్ కె.వీర్రాజు, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్రవర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ శేషారెడ్డి, సుగుణారెడ్డిలు అభినందించారు. ● రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సెంట్రల్ ఆధ్వర్యంలో పటమట హైస్కూల్ రోడ్డులో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు టి.రాఘవేంద్రరావు, డైరెక్టర్లు పి.వై.ఎస్ రావు, పరుచూరి అజయ్, నల్లూరి కృష్ణారావు, తిలక్, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో...

లబ్బీపేట: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 500మట్టి విగ్రహాలు పంపిణీ చేయడం జరుగుతుందని పైలెట్ సర్వీస్ స్టేషన్ పెట్రోల్ బంక్ యజమాని ఎంవీవీ సత్యనారాయణ, నందకిషోర్‌లు పేర్కొన్నారు. మంగళవారం పెట్రోల్ బంక్‌లో మట్టి విగ్రహాలు వినియోగదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవోసీఎల్ జిల్లా సేల్స్ ఆఫీసర్ దేవరపల్లి నరేష్, బంక్ మేనేజర్ కె.వెంకటప్పయ్య పాల్గొన్నారు.

మొగల్రాజపురం: స్థానిక సిద్ధార్థనగర్‌లో ఉన్న లిటిల్ బ్రెయిన్స్ పాఠశాల విద్యార్థులు మంగళవారం మట్టి గణపతి విగ్రహాలను తయారుచేసి పంపిణీ చేశారు. పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి ఆధ్వర్యంలో పిల్లలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పిన్నమనేని రోడ్డులో వాహనదారులను ఆపి వారికి మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ సుధాప్రవీణ, డీన్ డి.గిరిశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మట్టి గణపతి విగ్రహాన్ని పంపిణీ చేస్తున్న లిటిల్ బ్రెయిన్స్ విద్యార్థి

లయోలాలో ..

భారతీనగర్ : ఆంధ్రాలయోలా కళాశాలలో మ్యాజిక్ (మెన్ అండ్ విమెన్ ఎయిమింగ్ ఎట్ గ్రేటర్ ఇనిషియేటివ్స్ ఫర్ చేంజ్) విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక చవితి సంబరాలు ఘనంగా జరిగాయి. మట్టి వినాయక విగ్రహ పోటీలను నిర్వహించారు. వినాయకుడి విశిష్టతపై వక్తృత్వం, డాన్స్, క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం ఆల్ ఇండియా కాథలిక్ యూనివర్సిటీ ఫెడరేషన్ (ఏఐసీయూఎఫ్) కళాశాలలో 300 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ మెల్కూర్, కో-ఆర్డినేటర్ పిటీ పార్కర్, మోజెస్ వందన్, దుర్గాపావని, శ్రవణ్ కుమార్, శామ్యూల్ దయాకర్, పాల్గొన్నారు.



పటమట రైతుబజార్ వద్ద, ఆటోనగర్ వద్ద పూజా సామగ్రి విక్రయాలు

పటమటలో చవితి శోభ



పటమట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకొని పటమట, పటమట సెంటర్లలో వినాయక విగ్రహాలు, పండుగకు కావాల్సిన పత్రి, పూలు, పండ్ల అమ్మకాలతో ఆ ప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. పల్లెటూర్ల నుంచి వచ్చిన వివిధ రకాలైన పత్రులను కట్టలుగా కట్టి అమ్ముతున్నారు. భక్తులు మట్టి విగ్రహాలను కొనుగోలు చేసి ఇళ్ళకు తీసుకువెళుతున్నారు. పటమట చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న పందిళ్ళల్లో గణనాథుడు కొలువుదీరారు. వివిధ రకాల పూజా సామాగ్రిని కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో ప్రధాన రహదారులన్నీ రద్దీగా మారాయి.

అప్రమత్తంగా బస్సులు నడపాలి

● జిల్లా ప్రజా రవాణా అధికారి ఏసుదానం



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి ఏసుదానం

ఆటోనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ డ్రైవర్‌లు బస్సులను అప్రమత్తంగా నడపాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. ఏసుదానం అన్నారు. ఆటోనగర్ ఆర్టీసీ డిపో గ్యారేజీలో మంగళవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఏసుదానం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ఆటోనగర్ డిపో నుంచి వెళ్లే బస్సులన్నీ దూరప్రాంత బస్సులేని, అందుకు అనుగుణంగా డ్రైవర్లు ఉండాలని సూచించారు. మార్గమధ్యంలో బస్సులు ఆగకుండా మరమ్మతులను చేయాలని మెకానిక్‌లను కోరారు. డిపో మేనేజర్ కె. ప్రవీణ్‌కుమార్ సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరాన్ని మురికి కూపంగా మార్చిన వైసీపీ

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మురికికాల్వల్లో పూడికలు కూడా తీయించకుండా నగరాన్ని మురికికూపంగా మార్చారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. మంగళవారం 11వ డివిజన్ కరణంగారి బజారులో కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంజిసర్కిల్, పంటకాల్వ రోడ్డులో వర్షం వచ్చినప్పుడు నీరు అధికంగా నిల్వ ఉంటున్నాయని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాలువల్లో పూడిక తీయిస్తున్నామని, భూగర్భ డ్రెయినేజీ, స్ట్రామ్ వాటర్‌ను ప్రక్షాళన చేస్తే గానీ మురికి కూపం నుంచి నగరాన్ని బయటకు తీసుకురాగలమని చెప్పారు. కోనేరు రాజేష్, జాస్తి సురేష్, యలమంచిలి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరెసాకు నివాళి

మొగల్రాజపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మదర్ థెరెసా జయంతి సందర్భంగా మదర్ థెరెసా మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మొగల్రాజపురం పిన్నమనేని



రోడ్డులో ఉన్న విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి శానిటరీ వర్కర్స్‌కు అల్పాహారం ఇచ్చారు. గోగినేని ధనశేఖర్, డాక్టర్ ఎ.శిరీష (ఎండీ,ఆయుష్), డాక్టర్ డి.కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ కార్డుల పంపిణీ

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: 18వ డివిజన్‌లో మంగళవారం స్మార్ట్ కార్డుల పంపిణీ జరిగింది. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల నుంచి అభినందనలు పొందుతున్నారని తెలిపారు. పగడాల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

PLOT FOR SALE

» 150 చ.గ. నుండి 1200 చ.గ. ప్లాట్స్ అమ్మకం. చ.గ.5,000/- నుండి 1,30,000/- గూడవల్లి, గన్నవరం దగ్గర, పోరంకి, కంకిపాడు విజయవాడ సిటీ & అమరావతి సిటీ M.P.Developers: ✆ 94944 03040 AJB-76

FLAT FOR SALE

» జగ్గయ్యపేట - కోదాడ రోడ్డు, హీరో హోండా షోరూమ్ వెనుక, సై హోమ్ అపార్ట్మెంట్ నందు (ఫ్లాట్ నెం. 305) 3BHK - 1320 S.Ft ఫ్లాట్ అమ్మకం. Car పార్కింగ్, 100 అడుగులు UD ఫేస్: 78934 31395 AJB-1047

HOUSE FOR SALE

» ప్రసాదంపాడు నందు 55 చ.గ. స్థలములో గ్రౌండ్ ఫస్ట్ సెకండ్ ఫ్లోర్స్ గల 3 అంస్థుల బిల్డింగు అమ్మకము. గ్రౌండ్ ఫ్లోర్‌లో 3 షాపులు అద్దె. PER MONTH 27,000/-, రేటు 55 లక్షలు. ✆ 76720 94576 AJB- 152

EDUCATION

» PRABHAS COLLEGES, VJA: REGULAR/DIST/ONLINE: MBA, MCA, MA, M.Com, M.Sc., BCA, BBA, B.Sc., BA, ADMS. L.Dt.:10-8-2025. Ph: 99634 72800, 99634 72819, 94935 32525. AJB-81

TO-LET COMMERCIAL

» విజయవాడ, గాంధీనగర్, హిందీ స్ట్రీట్ నందు 1500 SFT గల గ్రౌండ్ ఫ్లోర్ గూడౌన్ అద్దెకు కలదు. సంప్ర: 98480 83199, 98483 94395 AJB-209476

» విజయవాడ, కామయ్యతోపు, చలసాని నగర్, డా. గోపాళం శివన్నారాయణ హాస్పిటల్ ప్రక్క రోడ్డులో 3 అంతస్థుల బిల్డింగ్ అద్దెకు కలదు. సంప్ర. 63034 98345, 98481 02023 AJB - 209483

WANTED

» VJA, మధురానగర్ రైల్వేస్టేషన్ ఎదురు మా అడ్వర్టైజింగ్ ఏజెన్సీ నందు మార్కెటింగ్ & ఆఫీసు అసిస్టెంట్ (Male) & ఆఫీసు అసిస్టెంట్ (Female)గా (ఇంటర్ పాస్/ఫెయిల్) చేయుటకు అనుభవం గలవారు కావలెను. వయస్సు: 40-50 సం.లు. సంప్ర: సాయిప్రభు ఆర్ట్స్ ✆ 93484 82263, 93934 82263 AJB-209486

» కోటక్ బ్యాంకు అనుబంధ సంస్థలకు రిటైర్డ్, VRS, స్టేట్ మరియు సెంట్రల్ ఎంప్లాయీస్, గృహిణులు, టీచర్స్, రియల్ ఎస్టేట్ వారు కావలెను. వ: 35-70, Q: 10th, జీ: 12-15వేలు, సంప్ర: 9703812355 AJG-10274

24/7 అంబులెన్స్ సర్వీస్

» వేళంగణీమాత అంబులెన్స్ సర్వీస్: A/C వెంటిలేటర్ & రన్నింగ్ ఫ్రీజర్ బాక్స్ సదుపాయం కలదు. ఆల్ ఇండియా అంబులెన్స్ సర్వీస్ కలదు. ✆ 93911 15067, 88815 38888 AJB-209479

CHANGE OF NAME

» నేను అనగా భారత చంద్ర. నా యొక్క టెన్త్ క్లాస్ సర్టిఫికెట్‌లో భారత దుర్గారావు అని ఉంది. నా ఎల్ఐసి పాలసీలో భారత దుర్గారావు అని వ్రాయబడింది. భారత చంద్ర మరియు భారత దుర్గారావు అనేవి రెండు నా పేర్లే. నేను ఎల్ఐసి పాలసీలో నా పేరు భారత దుర్గారావు నుండి భారత చంద్రగా మార్చుకుంటున్నాను. ఈ విషయంపై ఏ వివాదం వచ్చినా నేనే బాధ్యుడిని. AJB-209484

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, వల్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

మార్కెట్‌లో చవితి సందడి

- రద్దీగా మారిన కేఆర్ మార్కెట్
- ఆకాశాన్నంటుతున్న ధరలు
- మల్లెలు, జాజులు కేజీ రూ.1200
- కనకాంబరాలు కేజీ రూ.1000

వన్‌టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను పురస్కరించుకుని వీఎంసీ పూలమార్కెట్ మంగళవారం జనంతో కిటకిటలాడింది. పూల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యులు పూలు కొనాలంటేనే బెంబేలెత్తుతున్నారు. పూజ అంటేనే పూలుండాలి. దేవతలను ఆరాధించేటప్పుడు ఫలం, పుష్పం, తోయం అన్నారు. పండ్లు, పూలు, జలం, నైవేద్యానికి పొంగలి వంటి తీపి వస్తువులు, తదితరాలన్నీ సమకూర్చుకోవాలి. వినాయకచవితికి పూలు, పత్రి, పండ్లు తప్పనిసరిగా ఉండాలి. వినాయక ప్రతిమకు పాలీలు కట్టి పూలు, పత్రితో ప్రత్యేకంగా అలంకరిస్తారు. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా వినాయక చవితి తొలి పండుగను అందరూ చేసుకుంటారు. అంతేకాకుండా వీధి వీధినా, వాడవాడలా వినాయక చవితి పందిళ్లు ఏర్పాటు చేసి అందులో రకరకాల వినాయక విగ్రహాలను ఉంచి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ముఖ్యంగా వివిధ రకాల పూల పంట తక్కువగా ఉండటంతో మార్కెట్‌లో కొన్ని రకాల పూలు కనిపించటం లేదు. దీంతో వ్యాపారులు పూల ధరలను అమాంతంగా పెంచేశారు. ముఖ్యంగా విజయవాడ పూల మార్కెట్‌లో ధరలు చూసి సామాన్యులు కొనేటట్టుగా లేదు. నాలుగు పూలు పెట్టి రూ.25 ఇవ్వమంటున్నారు. హోల్‌సేల్ ధరలకు వస్తే జాజులు, మల్లెలు కేజీ రూ.1200, కనకాంబరాలు కేజీ రూ.1000, గులాబీ, చామంతి కేజీ రూ.600, బంతిపూలు కేజీ రూ.300, హోల్‌సేల్ మార్కెట్‌లోనే పూల ధరలిలా ఉన్నాయి. పండుగ డిమాండ్‌ను పురస్కరించుకుని అమాంతంగా రేట్లను పెంచేయటంపై భక్తవర్గాల్లో విమర్శలకు దారితీసింది. పూలమార్కెట్ జనం రద్దీతో కిటకిటలాడింది. వీఎంసీ కార్యాలయం నుంచి పూలమార్కెట్ వరకు, పూలమార్కెట్ ఎదురుగా ఉన్న వంతెనపై జనం బారులు తీరారు.







కేఆర్ మార్కెట్ సెంటర్‌లో జనంతో రద్దీ

వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ వద్ద పూజ సామగ్రి కొనుగోలుకు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలిరావటంతో మార్కెట్ సెంటర్ కిటకిటలాడింది. గద్దబొమ్మ సెంటర్ నుంచి పోస్టాఫీస్ సెంటర్, వస్త్రలత సెంటర్ వద్ద పూజ సామాను కొనుగోలుతో జనం కిటకిటలాడారు. వివిధ రకాల పండ్లు, పత్రి, పాళీలు కొనుగోలు చేసేందుకు జనం తరలిరావటంతో ధరలు అమాంతంగా పెంచేశారు. పాళీలు రూ.50 నుంచి రూ.100 వరకు ధరలు పలుకుతున్నాయి. వినాయక చవితికి అతి ప్రాముఖ్యమైనది వివిధ రకాల పత్రి. పత్రి ధరలు కూడా విపరీతంగా పెంచేశారు. 21 రకాల మొక్కల పత్రిని ఉంచాలి. కానీ కొన్ని రకాల మొక్కల పత్రిని ఏర్పాటు చేసి దానినే అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

అమ్ముకోవడానికేనా..?

జిల్లా మలేరియా కార్యాలయం నుంచి గుట్టుగా అంబులెన్స్ తరలింపు

- ఏటీవోకు కాకుండా ప్రైవేటు ప్లేస్‌కు తరలించడంపై అనుమానం
- పార్కింగ్‌తో ఇబ్బందిగా ఉందని చందన గ్రాండ్ లేఖ
- లేఖపై ఎన్టీఆర్ జిల్లా అధికారి కాక కృష్ణాజిల్లా అధికారి సంతకం
- డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు.. విచారణకు ఆదేశం




తరలించిన అంబులెన్స్ ఇదే..

ఆంధ్రజ్యోతి, విజయవాడ: జిల్లా మలేరియా హాస్పిటల్‌లో నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్ తరలింపు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. అధికారుల కనుసన్నల్లో కింది స్థాయి సిబ్బంది దీన్ని అమ్మేందుకు కదిలించారన్న తీవ్ర విమర్శలు వస్తున్నాయి. నగరంలోని లబ్బీపేటలో జిల్లా మలేరియా కార్యాలయం ఉంది. గంపలగూడెం ప్రైమరీ హాస్పిటల్‌లో వినియోగిస్తున్న అంబులెన్స్‌ను విజయవాడ మలేరియా విభాగానికి కొంతకాలం కిందట తరలించి మూలన పెట్టారు. ప్రస్తుతం వినియోగంలో లేదు. ఈ అంబులెన్స్‌ను కిందిస్థాయి సిబ్బంది ఒకరు ఇక్కడి నుంచి బయటకు కదిలించారు. దీంతో అంబులెన్స్ తరలింపు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ శాఖల్లోని పనిచేయని వాహనాలను ప్రైవేటు ప్లేస్‌లకు తరలించకూడదు. ఇలాంటి వాహనాలను తరలించటానికి రాష్ట్ర స్థాయిలో స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు (ఎస్‌టీవో), జిల్లా స్థాయిలో అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ (ఏటీవో) ఉంటాయి. వాహనాన్ని కదిల్చితే వీటి దగ్గరికే తీసుకువెళ్లాలి. మలేరియా హాస్పిటల్ వద్ద ఉన్న అంబులెన్స్‌ను మాత్రం ఓటీవోకు తరలించకుండా ప్రైవేటు ప్లేస్‌కు తరలించారు. దీనిపై విమర్శలు రావటంతో పాటు డీఎంహెచ్‌వో సుహాసినికి ఫిర్యాదు కూడా వెళ్లటంతో ఆమె దీనిపై విచారణకు ఆదేశించారు. చందన గ్రాండ్ బట్టల దుకాణానికి వస్తున్న లారీలకు అడ్డుగా ఉండటంతో వారి విజ్ఞప్తి మేరకే తాత్కాలికంగా సిబ్బంది పక్కన పెట్టించారని జిల్లా మలేరియా అధికారి మోతిబాబు చెబుతున్నారు. ఇంతవరకు ఇలా ఉంటే చందన గ్రాండ్ యాజమాన్యం లేఖ రాసిన మాట వాస్తవమే. దీనిపై మచిలీపట్నం జిల్లా మలేరియా అధికారి రామారావు సంతకం చేయటం గమనార్హం. కండీషన్‌లో లేని అంబులెన్స్‌ను విజయవాడలోని అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ (ఏటీపీ)కి తరలించాల్సి ఉంటుంది. జిల్లా మలేరియా అధికారి సంతకం పడిన తర్వాత ఏటీవోకే వెళ్లాలి. కానీ, ఏటీవో కార్యాలయానికి కాకుండా వేరే ప్రాంతానికి తరలించారు. ఇది ఉద్దేశపూర్వకంగానే చేశారన్న విమర్శలు వస్తున్నాయి. చందన గ్రాండ్ యాజమాన్యం లేఖపై ఎన్టీఆర్ జిల్లా మలేరియా అధికారి సంతకం చేయాల్సి ఉండగా.. కృష్ణా జిల్లా మలేరియా అధికారి ఎలా సంతకం చేశారన్నది మిస్టరీగా మారింది. ఈ వ్యవహారంలో అధికారుల పాత్ర ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తప్పో, ఒప్పో ఈ వ్యవహారం డీఎంహెచ్‌వో దృష్టికి వెళ్లటంతో ఆమె విచారణకు ఆదేశించారు.

జిల్లా ఎన్నికల గోడౌన్‌కు పటిష్ఠ భద్రత

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గోడౌన్‌కు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశామని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా విజయవాడ రూరల్ గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరిచే డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గోడౌన్‌ను మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గోడౌన్‌ను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందించడం జరుగుతుందన్నారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలన్నారు. తనిఖీ ప్రక్రియలో డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం, వై రామయ్య (టీడీపీ), వై ఆంజనేయరెడ్డి (వైసీపీ), కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ అధికారులు ఉన్నారు.

పర్యావరణ హితం 'అంకుర గణపతి'

- 10 వేల మట్టి విగ్రహాలు పంపిణీ చేసిన రెవెన్యూ శాఖ



అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకానికి పనికొచ్చేలా సీడ్ బాల్‌తో కూడిన 10వేల అంకుర గణపతి విగ్రహాలను రెవెన్యూ శాఖ తయారు చేసింది. శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్‌ఏ జయలక్ష్మికి సీడ్ బౌల్ ఉన్న మట్టి విగ్రహాన్ని మంత్రి అనగాని వ్యక్తిగత కార్యదర్శి నాగేశ్వరరావు, సిబ్బంది అం దించారు. తర్వాత సచివాలయం పరిధిలోని ప లు శాఖల కార్యదర్శులు, విభాగ అధికారులు, సెక్షన్ల పరిధిలో విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ విగ్రహాలను నిమజ్జనం చేయాల్సిన అవస రం లేదని, దాన్ని ఇంట్లో ఉంచుకుంటే సీడ్ బా ల్‌లోనే మట్టి కరిగిపోయాక అందులో నుంచి మొక్క పెరుగుతుందని మంత్రి అనగాని వివరించారు. పర్యావరణ హితం, పచ్చదనాన్ని పెంచాలన్న ఉద్దేశంతో ఈ విగ్రహాలను పంపి ణీ చేసినట్లు తె లిపారు. రాష్ట్ర ప్రజలకు ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యారంగాన్ని దేశంలోనే

తొలిస్థానంలో నిలబెడతాం

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల వల్ల దేశంలోనే విద్యారంగాన్ని అగ్రస్థానంలో నిలబెడతామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో యువతకిచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులకు వయోపరిమితిని సడలించి అవకాశాలు కల్పించినట్టు తెలిపారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పనతోపాటు వారికి సరిపడ ఉపాధ్యాయులుంటేనే విద్యారంగం ముందుకు వెళుతుందని నమ్మిన మంత్రి లోకేశ్ ఆ దిశగా చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వ విద్యలో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఎన్నో సంస్కరణలు చేపట్టి నూతన వెలుగులు తెస్తున్న లోకేశ్ కృషిని కొనియాడారు. 14ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు తన హయాంలో 13 డీఎస్సీలు నిర్వహించి 1.8 లక్షల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి చరిత్ర సృష్టించారన్నారు. కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ 14 నెలల్లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 729 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీతో పాటు 90 మంది ఎస్టీ యువతను కొత్తగా ఉపాధ్యాయులుగా నియమించినట్టు చెప్పారు. 700 కోయ భారతి టీచర్ పోస్టుల భర్తీనే కాకుండా జూనియర్ కాలేజీల్లో 700 మంది సిబ్బంది సేవలను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 476 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 3619 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ సేవలను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఈ మెగా డీఎస్సీను ఆపేందుకు కోర్టుల్లో 24 కేసులు వేయించారని అవన్నీ తట్టుకొని డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేసిన ఘనత లోకేశ్‌కే దక్కుతుందన్నారు. ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి చివరి వరకు సాగదీసి 2024 ఎన్నికలకు ముందు కేవలం 6100 పోస్టులకు డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగులను మోసం చేశారని ధ్వజమెత్తారు.

'డ్రగ్' ఫిర్యాదుపై విచారణ

విజయవాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు డ్రగ్స్ సరఫరా, కబడ్డీ పోటీల్లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు సంబంధించి అందిన ఫిర్యాదులపై పోలీసులు విచారణ మొదలుపెట్టారు. ఫిర్యాదు చేసిన కబడ్డీ సంఘ మాజీ కార్యదర్శి కేపీ రావు, ఫిర్యాదు కాపీలో పేరున్న కబడ్డీ సంఘం కార్యదర్శి శ్రీకాంత్‌ను పటమట ఇన్‌స్పెక్టర్ వీ పవన్‌కిషోర్ పిలిపించారు. ఇద్దరినీ ముఖాముఖిగా విచారించారు. తాను చేసిన ఫిర్యాదుకు సంబంధించిన ఆధారాలున్నాయని కేపీ రావు చెప్పినట్టు తెలిసింది. తాను ఎలాంటి తప్పు చేయలేదని ఏ విచారణకైనా సహకరిస్తానని శ్రీకాంత్ చెప్పినట్టు తెలిసింది.

వాస్తవం లేదు'

క్రీడాకారులకు డ్రగ్స్ సరఫరాపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. శ్రీకాంత్‌తో పాటు మరికొంతమంది క్రీడాకారులపై సంఘం మాజీ కార్యదర్శి కేపీ రావు పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. డ్రగ్స్, మ్యాచ్‌ఫిక్సింగ్, బెట్టింగ్‌లో రావు చేసిన ఆరోపణలు అవాస్తవమని ఖండించారు. ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానన్నారు.

తిరుపతమ్మ ఆలయ హుండీల ఆదాయం రూ.94లక్షలు



తిరుపతమ్మ దేవస్థానంలో నగదు లెక్కిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

పెనుగంచిప్రోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ అమ్మవారికి భక్తులు 79 రోజుల నుంచి సమర్పించిన కానుకలను దేవదాయ ధర్మాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ నటరాజ షణ్ముగం పర్యవేక్షణలో మంగళవారం హుండీలను లెక్కించారు. 94 లక్షల 58,4507 రూపాయల నగదు, 158 గ్రాముల బంగారం, కేజీ 280 గ్రాముల వెండి, యూఎస్ఏ డాలర్లు 663, ఫౌండ్లు 30, సింగపూర్ కరెన్సీ 12 డాలర్లు, ఆస్ట్రేలియా కరెన్సీ 15 డాలర్లు, ఆదాయంగా వచ్చినట్టు ఆలయ డిప్యూటీ కమిషనర్ బీహెచ్‌వీఎస్ఎస్ కిషోర్ కుమార్ తెలిపారు. ఈ లెక్కింపులో ధర్మకర్తల మండలి, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది భక్తబృందం పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుల సత్కారానికి దరఖాస్తులు



శతాధిక వృద్ధుల సత్కారం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, ట్రస్టీలు

సత్యనారాయణపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శతాధిక వృద్ధులకు సత్కారం నిర్వహించనున్నట్టు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ పేర్కొన్నారు. మంగళవారం దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో శతాధిక వృద్ధుల సత్కారం కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన నూరేళ్లు పూర్తిచేసుకున్న వయోవృద్ధులను గుర్తించి వారినందరినీ ఒకే వేదికపై ఉంచి ప్రముఖుల చేతులమీదుగా సత్కరించనున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు 12 సార్లు 17 మంది శతాధిక వృద్ధులను గుర్తించి సత్కారం చేశామన్నారు. నూరేళ్లు పూర్తిచేసుకున్న వారు వచ్చేనెల 10లోపు వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో స్వయంగా కానీ, 9848111138, 9347572766 ఫోన్ నంబర్లలో కానీ నమోదు చేయించుకోవాలని కోరారు. శతాధిక వృద్ధుల సత్కారం ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రస్టీలు తట్టి అర్జునరావు, అమరా ఉమామహేశ్వరరావు, కే మధుసూదనరావు, పీ లక్ష్మీ నరసింహరావు, వెంకటేష్ గోదావరి పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ జీవోలో మార్పులు చేయాలి



పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ స్వర్ణలతకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

విజయవాడ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జర్నలిస్ట్ అక్రిడిటేషన్ జీవోలో మార్పులు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడ పీఎన్‌బీఎస్ సముదాయంలో ఉన్న రాష్ట్ర పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్ స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్ పీ కిరణ్‌కుమార్‌కు మంగళవారం విడివిడిగా వినతిపత్రాలను అందజేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని, ఎంపానల్‌మెంట్ అర్జీలను వెంటనే పరిశీలించి అక్రిడిటేషన్ పొందే వీలు కల్పించాలని, దరఖాస్తులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని, డిగ్రీ/ఇంటర్ విద్యార్హత ప్రమాణికం కంటే నియామకాన్ని, అనుభవాన్ని పరిగణలోకి తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ నేతలు ఖాజావలి, ఎం రాఘవులు, షేక్ సల్మాన్, సురేష్‌బాబు, తుపాకుల హరికృష్ణ, ఆవుటి బాబు పాల్గొన్నారు.

31న ఉమ్మడి జిల్లాల యోగాసన పోటీలు

విజయవాడ, స్పోర్ట్స్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా ఈ నెల 31న ఉమ్మడి జిల్లాల యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి ఎల్ మురళీకృష్ణా తెలిపారు. ఈ పోటీలు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నందు జరుగుతాయని, జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికలు, సీనియర్ పురుషులు, స్త్రీల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచినవారు 30న ఉదయం 11 గంటల లోపు తమ పేర్లు ఫోన్ నెంబర్ 94411 19909, 94402 276648 నందు నమోదు చేసుకోవాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఫారం నెం VI (ఎ)

(2013 సంవత్సరం 30వ చట్టం భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం లో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్19, సబ్ రూల్ (1) అనుసరించి).

ప్రాధమిక ప్రకటన

ఆర్ సి నెం.1450/2025-G2 తేది:26 -08-2025

ఈ దిగువ సుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను గుంటూరు జిల్లాలో గుంటూరు రెవిన్యూ డివిజన్ లోని గ్రామములు అయిన పట్టిచెరుకూరు మండలంలోని గారపాడు గ్రామం (య 2.58 సెంట్లు) పెదనందిపాడు మండలం లోని గోరిజనవోలుగుంటపాలెం గ్రామం (విస్తీర్ణము Ac 23.422 సెంట్లు) రావిపాడు గ్రామం (విస్తీర్ణము Ac 38.516 సెంట్లు) మరియు ప్రతిపాడు మండలం లోని కొండెపాడు గ్రామం (విస్తీర్ణము Ac 38.605 సెంట్లు) ఎనమదల గ్రామం(విస్తీర్ణము Ac 3.సెంట్లు) ప్రతిపాడు గ్రామం (విస్తీర్ణము Ac 66.711 సెంట్లు) మల్లాయపాలెం గ్రామం (విస్తీర్ణము Ac 28.285సెంట్లు యందు ప్రజా ప్రయోజనమునకై అనగా నీటిపారుదల సౌకర్యం పెంపు నిమిత్తం "గుంటూరు చానల్ పొడిగింపు" (47.00 Km నుండి 76.400 Km వరకు) పథకము ద్వారా పై మొత్తము విస్తీర్ణము Ac 201.149 సెంట్ల భూమి కావలయునని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, శ్రీయుత జిల్లా కలెక్టరు గుంటూరు జిల్లా వారు 2013వ సంవత్సరము, 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్ట పరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలను అనుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలంగా నోటీసు జారీ చేయడ మైనది.

ఆంధ్రప్రదేశ్ భూ సేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం (2018 లోని 22 వ చట్టం) ద్వారా సవరించబడిన విధంగా 2013 భూసేకరణ పునరావాసం, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం (2013 లో 30వ చట్టం) సెక్షన్ 10 A ప్రకారం సామాజిక ప్రభావ అంచనా ప్రకటనకు మినహాయింపు ఇవ్వడమైనది .

చట్టములోని సెక్షన్ 43 (1) మేరకు ప్రభావిత కుటుంబాలకు సహాయ పునరావాస చర్యలు చేపట్టుట కొరకు ప్రభుత్వ ఉత్తర్వు నెం.1 రెవిన్యూ (భూ.సే) శాఖ, తేది. 02.01.2015 నందు ఇవ్వబడిన ప్రకటన ద్వారా సంయుక్త కలెక్టరు, గుంటూరు వారు ప్రాజెక్ట్ అడ్మినిస్టేటర్ గా నియమించడమైనది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియులేవు.

కలెక్టరు గుంటూరు జిల్లా వారు పైన పేర్కొన్న చట్టంలో సెక్షన్ 12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి, గుంటూరు వారికీ, వారి సిబ్బందికి మరియు వారి పనివారలుకు ఈ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

చట్టంలోని 11(4) విభాగం క్రింది కలెక్టరు పూర్వ ఆమోదంలేకుండా అట్టి ప్రకటనను ప్రచురించిన తేది నుండి ఏదేని లావాదేవీ లేదా ఏదేని భూమియొక్క లావాదేవీలు కారణం అంటే అమ్మకం / కొనుగోలు ముస్నగునవి లేదా అట్టి భూమిపై ఎవైన తాకట్టులను సృష్టించడం ఏ వ్యక్తి చేయరాదు

పై చట్టం సెక్షన్ 15ను అనుసరించి భూసేకరణపై ఏవిధమైన అభ్యంతరములు / ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధిత వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించిన తేది నుండి 60 (అరువది దినములలోగా శ్రీయుత జిల్లా కలెక్టర్, గుంటూరు / శ్రీయుతి రెవిన్యూ డివిజనల్ అధికారి, గుంటూరు వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకోనవచ్చును.

షెడ్యూలు :

మండలం పేరు : వట్టిచెరుకూరు — గ్రామం పేరు : గారపాడు

క్రమ సంఖ్య	LPM నెం.	భూమి వివరణ	మొత్తం విస్తీర్ణం (ఎ.సెం.)	భూ సేకరణ చేయు విస్తీర్ణం ఎ.సెం	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	పరిహద్దులు (LPM నెం.)				చెట్లు, కట్టడములు ఇతరములు వివరములు
						ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	
1	2	3	4	5	6	7	8	9	10	11
1	219	సర్కారు పుంజ	0.639	0.349	అరుమళ్ల ప్రభాకర్ రెడ్డి S/o సాంబి రెడ్డి	220, 221	228	218	225	-
2	225	సర్కారు పుంజ	1.189	0.209	బొబ్బా సీతారావమ్మ W/o వెంకట రత్న రెడ్డి	220	226	219	కొండెపాడు గ్రామం - ప్రతిపాడు మండలం	-
3	226	సర్కారు పుంజ	1.005	0.937	నల్లూరి శ్యామ్ బాబు S/o నాగయ్య	225	227	228	కొండెపాడు గ్రామం - ప్రతిపాడు మండలం	-
4	227	సర్కారు పుంజ	0.391	0.366	నల్లూరి సెకస్ కుమార్ S/o నాగయ్య	226	229	228	కొండెపాడు గ్రామం - ప్రతిపాడు మండలం	-
5	228	సర్కారు పుంజ	0.637	0.57	భవనం రత్న కుమారి W/o సుబ్బారెడ్డి	219	229	234	226&227	-
6	229	సర్కారు పుంజ	0.623	0.145	నర్రా రాంబాబు S/o శేషగిరిరావు	227	227 & 228	234	కొండెపాడు గ్రామం - ప్రతిపాడు మండలం	-
7	247	సర్కారు పుంజ	1.997	0.004	అయినంపూడి రత్న కుమారి W/o శివయ్య	249 & 250	245 & 246	251	248	-
మొత్తం				2.580						

మండలం పేరు : పెదనందిపాడు — గ్రామం పేరు : గోరిజవోలు గుంటపాలెం

1	535	సర్కారు పుంజ	1.941	1.316	కాసు శివా రెడ్డి S/o సుబ్బా రెడ్డి	534	1586, 1585	536	532	-
2	687	ఇనాం పుంజ	3.00	1.603	వజ్రాల భారతమ్మ W/o గంగి రెడ్డి	686	688	709	685	-
3	712	ఇనాం పుంజ	13.72	3.869	ప్రత్తిపాటి శ్రీ వేణు గోపాల స్వామి వారి దేవస్థానం	710, 711	716, 715, 714	713	709	-
4	715	సర్కారు పుంజ	0.36	0.125	వజ్రాల సుబ్బారెడ్డి S/o సాంబిరెడ్డి	712	1588	714	716	-
5	716	సర్కారు పుంజ	1.718	1.396	పిడపర్తి శైలజ W/o రఘునాథ రెడ్డి	712	1659, 772, 773,774	1588, 715	771	-
6	769	సర్కారు పుంజ	3.726	1.574	వణుకూరి బుచ్చి రెడ్డి S/o సాంబి రెడ్డి	776	768, 792	789	753	-
7	773	సర్కారు పుంజ	1.07	0.766	వజ్రాల వెంకట్ రెడ్డి S/o తిరుపత రెడ్డి	716	776	774	772	-
8	774	సర్కారు పుంజ	1.07	0.814	తుమ్మూరు శేష రత్నం W/o బ్రహ్మ రెడ్డి	716, 1588, 714	776	775	773	-
9	776	సర్కారు పుంజ	3.24	2.05	వణుకూరి దీపిక W/o బుచ్చి రెడ్డి	1659, 772, 773, 774, 775	769, 789	777	771, 770	-
10	789	సర్కారు పుంజ	5.285	1.585	బొందలపాటి బాజీ ప్రదీప్ కుమార్ S/o రామారావు	776, 777, 778, 779, 780, 785	791	788	769	-
11	791	సర్కారు పుంజ	1.968	1.138	కాసు ఝాన్సీ లక్ష్మి W/o వెంకట్ రెడ్డి	789	793, 794	790	792	-
12	792	సర్కారు పుంజ	1.91	0.389	చీడిపూడి జ్యోతిర్మయి D/o వెంకట్ రెడ్డి	769	767	791	768	-
13	793	సర్కారు పుంజ	0.943	0.912	ఈమని శివమ్మ W/o సీతారామి రెడ్డి	791	795	794	792	-
14	794	సర్కారు పుంజ	0.958	0.419	ఈదా సుబ్బారెడ్డి స/ఓ చిన్న వెంకటేశ్వర రెడ్డి	791	795	790	793	-
15	795	సర్కారు పుంజ	3.817	1.56	కంకణాల శివ కుమారి D/o సుబాష్ చంద్ర బోస్	792, 793, 794, 790	796, 798	1803	767	-
16	796	సర్కారు పుంజ	0.968	0.153	వెలగా రజని W/o శివ శంకర్ రావు	795	797	798	766	-
17	797	సర్కారు పుంజ	0.933	0.014	కుంచనపల్లి వీర రాఘవమ్మ W/o బాజీ రావు	796	800	798	766	-
18	798	సర్కారు పుంజ	2.011	1.538	కంకణాల పద్మావతి W/o శివన్నారాయణ	795	800	1803	796, 797	-
19	801	సర్కారు పుంజ	5.247	1.665	గింజుపల్లి రజని W/o రాంబాబు	800	895, 892, 889	1803, 1866	890	-
20	889	ఇనాం పుంజ	1.171	0.117	పొన్నం శిరీష W/o లక్ష్మి నారాయణ	801	892, 799	1866	801	-
21	1586	సర్కారు పుంజ	1.271	0.159	కాసర్ల కృష్ణా రెడ్డి S/o కోటిరెడ్డి	535	539	536	537	-
22	1588	సర్కారు పుంజ	0.36	0.26	వజ్రాల వెంకట్ రెడ్డి S/o తిరుపతి రెడ్డి	715	774	714	716	-
సర్కారు పుంజ				23.422						

మండలం పేరు : పెదనందిపాడు — గ్రామం పేరు : రావిపాడు

1	26	సర్కారు పుంజ	1.503	0.051	ఆలపాటి శివ పార్వతి W/o శ్రీనివాసరావు	18	27,25	20	జి.జి పాలెం డొంక	-
2	27	సర్కారు పుంజ	0.945	0.56	చుండు రాజమ్మ W/o సాంబశివరావు	26	28	24, 25	జి.జి పాలెం డొంక	-
3	28	సర్కారు పుంజ	1.898	0.861	సుందిపూడి రామకృష్ణ S/o సాంబయ్య	24, 27	29, 31	23, 42	జి.జి పాలెం డొంక	-
4	29	సర్కారు పుంజ	1.895	1.686	పరిటాల హేమలత D/o శ్రీనివాసరావు	28	30	31	జి.జి పాలెం డొంక	-
5	30	సర్కారు పుంజ	1.016	0.706	కంకణాల శివ కుమారి W/o సుభాష్ చంద్ర	29	32,33	31	30	-
6	31	సర్కారు పుంజ	2.401	0.087	పొన్నం వినీషా D/o వీర ప్రసాదరావు	29	30	31	29	-
7	31	సర్కారు పుంజ		0.001	పొన్నంవినీషా D/o వీర ప్రసాదరావు	30	33	31	30	-
8	32	ఇనాం పుంజ	1.875	0.82	ముప్పా వెంకట కృష్ణ S/o వెంకటేశ్వర్లు	30	34	33	32	-
9	33	ఇనాం పుంజ	1.685	0.592	ముప్పా బాపయ్య స/ఓ వెంకట రత్నం	30	34	33	32	-
10	34	ఇనాం పుంజ	8.082	3.01	దూపాటి రత్న కిరణ్ S/o వీర రాఘవాచార్యులు	32,33	628&629	34	34	-
11	35	ఇనాం పుంజ	1.00	0.046	వెలగా గోపీక్రాంతి మరియు మోపర్తి సుహాసిని	34	628	35	34	-
12	651	సర్కారు పుంజ	4.848	0.068	బత్తుల పద్మావతి W/o వెంకట లింగేశ్వరరావు	628	652	652	651	-
13	652	సర్కారు పుంజ	4.11	3.164	బత్తుల శ్రీనివాస్ S/o వెంకట లింగేశ్వరరావు	628	654	652	652	-
14	653	సర్కారు పుంజ	1.94	0.007	పోసాని వెంకటప్పయ్య S/o శేషగిరి రావు	652	654	653	652	-
15	655	సర్కారు పుంజ	5.429	2.02	బండ్ల వెంకట రత్నం S/o సూరయ్య	654	661	655	656&660	-
16	656	సర్కారు పుంజ	1.639	0.5	కొలసాని వేణుబాబు S/o శ్రీనివాసరావు	654	660	655	656	-
17	660	ఇనాం పుంజ	2.217	0.701	పొన్నం నాగేశ్వరరావు S/o సీతా రామయ్య	656	664	655	660	-
18	661	ఇనాం పుంజ	2.216	1.427	పరిటాల హేమ లత W/o శ్రీనివాసరావు	655	664	661	660	-
19	664	ఇనాం పుంజ	1.483	1.034	గింజుపల్లి రాంబాబు S/o వీరయ్య	660&661	665	664	664	-
20	665	ఇనాం పుంజ	1.484	1.084	గింజుపల్లి అంకమ్మ రావు S/o వీరయ్య	664	666&734	665	665	-
21	666	సర్కారు పుంజ	2.475	0.53	పొన్నం వీర ప్రసాదరావు S/o వెంకటరావు	667&665	734	666	659	-
22	734	ఇనాం పుంజ	29.9	8.367	శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం	666&665	794&735	734	734	-
23	735	ఇనాం పుంజ	29.427	0.624	శ్రీ సీతా రామ స్వామి వారి దేవస్థానం	734	794 &793	735	734	-
24	793	సర్కారు పుంజ	1.658	0.49	గోగినేని అరుణ కుమారి W/o బ్రహ్మయ్య	735	791	793	794 ,795 &798	-
25	794	సర్కారు పుంజ	1.996	1.028	షేక్ మస్తాన్ వలి S/o హిమామ్ సాహెబ్	734&735	795	793	794	-
26	795	సర్కారు పుంజ	0.95	0.433	రామినేని వెంకట రత్నం S/o కోటేశ్వరరావు	794	798	793	795	-
27	798	సర్కారు పుంజ	0.949	0.402	గంగా భవాని W/o శ్రీనివాసరావు	795	799	793&791	798	-
28	799	సర్కారు పుంజ	1.995	0.704	ధూళిపాళ్ల పృథ్వీ S/o రవీంద్రనాథ్ చౌదరి	798	802	791&790	799	-
29	791	సర్కారు పుంజ	2.655	0.427	గోగినేని బ్రహ్మయ్య s/o వెంకట సుబ్బయ్య	793	790	791	798&799	-
30	790	సర్కారు పుంజ	1.16	0.398	గోగినేని వెంకట సాయి S/o శివ రామ కృష్ణయ్య	791	789	790	799&802	-
31	789	సర్కారు పుంజ	0.85	0.333	శానం రవి కుమారి W/o చెన్నయ్య	790	788	789	802&803	-
32	788	సర్కారు పుంజ	1.715	0.436	లావు వీర రాఘవులు S/o భద్రయ్య	789	807	788	803	-
33	802	సర్కారు పుంజ	1.035	0.264	ముప్పా ప్రసాద్ S/o కొండయ్య	799	803	790&789	802	-
34	803	సర్కారు పుంజ	1.946	0.478	చుండు రాజమ్మ W/o సాంబశివరావు	802	807	789&788	803	-
35	807	ఇనాం పుంజ	13.23	5.177	ధర్మ చెరువు నిమిత్త దానం	803&788	వరగాని	807	807	-
మొత్తం				38.516						

మండలం పేరు : ప్రత్తిపాడు — గ్రామం పేరు : కొండెపాడు

1	184	సర్కారు పుంజ	3.554	2.036	అరుమళ్ల రస్మిత W/o పేరెడ్డి	185	184	180	186& 223	-
2	185	సర్కారు పుంజ	2.838	1.411	అరుమళ్ల సుబ్బారెడ్డి S/o కోటిరెడ్డి	185	184	180	186	-
3	186	సర్కారు పుంజ	1.016	0.329	కొల్లి వసంత లక్ష్మి W/o చంద్ర శేఖర్ రెడ్డి	186	223	184, 185	187	-
4	187	సర్కారు పుంజ	4.088	0.965	అరుమళ్ల ప్రభాకర్ రెడ్డి S/o సాంబి రెడ్డి	187	221, 222, 223	186	218, 219	-
5	215	సర్కారు పుంజ	2.033	0.426	దాగంటి రమాదేవి W/o అప్పారావు	215	253	216	254	-
6	216	సర్కారు పుంజ	1.931	0.891	దాగంటి వెంకట మహేశ్వర రావు S/o వెంకటేశ్వర్లు	216	216, 253	217	215	-
7	217	సర్కారు పుంజ	1.972	0.792	దాగంటి బాపారావు S/o వెంకటేశ్వర్లు	217	217	219, 220	216	-
8	218	సర్కారు పుంజ	1.001	0.236	నల్లూరి పరమేశ్వరరావు S/o సత్యనారాయణ	218	219	187	218	-
9	219	సర్కారు పుంజ	1	0.958	తియ్యగూర్ ప్రియాంక W/o కొండా వేణు గోపాల రెడ్డి	218, 219	220, 219	187, 221	217	-
10	220	సర్కారు పుంజ	2.04	0.179	గాదె అనంత లక్ష్మి W/o భీమేశ్వర రెడ్డి	219	220	220	217	-
11	221	సర్కారు పుంజ	0.607	0.298	తమ్మా సాంబి రెడ్డి W/o కోటిరెడ్డి	187	221	222	219	-
12	222	సర్కారు పుంజ	1.019	0.385	తమ్మా లలిత కుమారి W/o కోటి రెడ్డి	187	222	223	221	-
13	223	సర్కారు పుంజ	1.005	0.252	అరుమళ్ల శంకర రెడ్డి S/o సాంబశివా రెడ్డి	186, 187	223	184	222	-
14	252	సర్కారు పుంజ	3.755	0.032	వెలగా భాస్కరరావు S/o మల్లేశ్వరరావు	253	252	252	254	-
15	253	సర్కారు పుంజ	3.009	0.787	వెలగా భాస్కరరావు S/o మల్లేశ్వరరావు	215, 216	252	253	254	-
16	254	సర్కారు పుంజ	2.499	1.145	కోటపాటి జయమ్మ W/o సత్యనారాయణ	214	255	215, 252, 253	258	-
17	255	సర్కారు పుంజ	1	0.676	నర్రా నాగశ్రీ W/o రాంబాబు	254, 258	256	252, 288	257	-
18	256	సర్కారు పుంజ	2.687	1.164	దాగంటి భారతమ్మ W/o రామారావు	255, 257	281, 282, 285	287, 288	261	-
19	257	సర్కారు పుంజ	0.96	0.267	తోకల సరస్వతమ్మ W/o వెంకటరావు	258, 259, 260	256	255	261	-
20	258	సర్కారు పుంజ	0.932	0.039	మన్నె మాధవి W/o సతీష్ బాబు	214	255, 257	254	259	-
21	275-2	సర్కారు పుంజ	1.39	0.793	కుర్ర సునీత W/o సుధాకర్ బాబు	270	276, 277	278	274, 409	-
22	276	సర్కారు పుంజ	0.1	0.1	కోటపాటి సత్యనారాయణ S/o అంజయ్య	275	404	277	409	-
23	277	సర్కారు పుంజ	0.1	0.1	కోటపాటి చంద్ర శేఖర్ S/o సూర్య ప్రకాశ రావు	275	404	278	276	-
24	279	సర్కారు పుంజ	3.671	0.108	గడ్డం నాగ మల్లేశ్వరరావు W/o ఆదయ్య	280, 283, 284	376, 377, 378, 379	284, 291, 292, 376, 378	278, 280, 281	-
25	280	సర్కారు పుంజ	0.787	0.341	బండ్లమూడి సాంబశివ ప్రసాద్ S/o వెంకట రత్నం	281	279	279	278	-
26	281	సర్కారు పుంజ	1.39	1.166	కుర్రా సునీత W/o సుధాకర్ బాబు	256	280	279, 282, 283	278	-
27	282	సర్కారు పుంజ	0.501	0.029	మన్నె సతీష్ బాబు S/o రామారావు	256	283	285	281	-
28	379	సర్కారు పుంజ	4.66	0.052	దాగంటి హరి బాబు S/o నాగేంద్రం	279, 377, 378	380, 381, 382	383, 384, 378	380, 278, 403	-
29	404	సర్కారు పుంజ	1.027	0.706	కుర్ర సునీత W/o సుధాకర్ బాబు	276, 277	405	403	409	-
30	405	సర్కారు పుంజ	2.085	0.012	బండ్లమూడి సాంబశివరావు S/o వెంకటేశ్వర్లు	404, 409	999	403, 398	406, 407	-
31	406	సర్కారు పుంజ	1.075	0.049	బండ్లమూడి చిన్న కోటేశ్వర్ రావు S/o సాంబయ్య	407	999	405	408, 412	-
32	407	సర్కారు పుంజ	0.683	0.506	బండ్లమూడి శ్రీనివాసరావు S/o సాంబయ్య	409	406	405	408	-
33	408	సర్కారు పుంజ	1.259	0.515	జంపని లక్ష్మి సాయి కుమార్ S/o శ్రీనివాసరావు	410	406	406, 407, 409	411, 412	-
34	409	సర్కారు పుంజ	2.315	1.065	పచ్చల సాంబయ్య S/o కోటయ్య	274	407, 405	275, 276, 404	408, 410	-
35	413	సర్కారు పుంజ	1.046	0.721	నల్లూరి నాగ సంజీవ్ కుమార్ S/o సీతారామయ్య	433	816	412	414	-
36	414	సర్కారు పుంజ	1.89	0.888	బండ్లమూడి పద్మారావు S/o శ్రీకృష్ణయ్య	433	816	413	415	-
37	415	సర్కారు పుంజ	1.9	0.034	కొమ్మినేని ప్రమీలా రాణి W/o శేషగిరి రావు	431, 432, 433	418, 808, 816	414	416	-
38	418	సర్కారు పోరంబోకు	1.468	0.001	గ్రామకంఠం	419	808	415, 416, 417, 420	808	-
39	813	సర్కారు పుంజ	1.357	0.065	బండ్లమూడి కిరణ్ కుమార్ S/o శివ ప్రసాద్	808	822	814	812	-
40	814	సర్కారు పుంజ	1.921	1.51	బండ్లమూడి అచ్చయ్య S/o సత్యనారాయణ	816	819, 820	815, 819	813, 822	-
41	815	సర్కారు పుంజ	1.148	0.03	మండలపు శ్రీనివాసరావు S/o నరసింహారావు	816	819	818	814	-
42	820	సర్కారు పుంజ	2.387	0.308	మండలపు శ్రీనివాసరావు S/o నరసింహారావు	814, 819	844	818	822, 821, 843	-
43	821	సర్కారు పుంజ	1.452	0.772	దాగంటి పద్మావతి W/o వెంకట ఉమా మహేశ్వర రావు	822	842, 843	820	823, 841	-
44	822	సర్కారు పుంజ	1.461	0.387	దాగంటి సరోజిని W/o బాపారావు	812, 813	821	814, 820	823, 824	-
45	837	సర్కారు పుంజ	0.971	0.072	షేక్ సిలార్ బుడే S/o నూరుల్లా	838	865	856	836, 866	-
46	838	సర్కారు పుంజ	0.945	0.022	బండ్లమూడి శివ మల్లికార్జునరావు S/o లక్ష్మినారాయణ	839	837	842	836	-
47	842	సర్కారు పుంజ	1.92	1.553	మల్నేడి సాంబశివరావు S/o రామయ్య	821	856	843	838,839, 840, 841	-
48	843	సర్కారు పుంజ	1	0.361	మల్నేడి శివ కుమారి W/o కోటేశ్వరరావు	821	856	820, 844, 845	842	-
49	856	సర్కారు పుంజ	1.374	0.742	బండ్లమూడి సరిత W/o పేరయ్య చౌదరి	842, 843	857	845, 855	837, 865	-
50	857	సర్కారు పుంజ	0.434	0.233	యలవర్తి సత్య దేవ ప్రసాద్ S/o రాధా కృష్ణ మూర్తి	856	858	854, 855	865	-
51	858	సర్కారు పుంజ	1.802	0.983	బండ్లమూడి సాంబశివరావు S/o కృష్ణయ్య	857	859	853, 854	865	-
52	859	ఇనాం పుంజ	5.378	2.604	శ్రీ వేణుగోపాల స్వామి గోపాల దేవస్థానం	865, 858	897, 898, 904	851, 852, 853, 904	860, 864	-
53	865	సర్కారు పుంజ	3.106	0.255	మోపర్తి వెంకట్ రత్నం S/o చౌడేశ్వరరావు	837	859, 864	856, 857, 858	866	-
54	893	సర్కారు పుంజ	1.004	0.934	వణుకూరి వెంకటేశ్వర రెడ్డి S/o సాంబిరెడ్డి	894	920, 921	899, 900	892	-
55	894	సర్కారు పుంజ	0.374	0.161	షేక్ చాంద్ బాషా S/o అదం షఫీ	895	8982, 893	898, 899	889, 890	-
56	895	సర్కారు పుంజ	0.374	0.156	షేక్ మహబూబ్ సుభానీ S/o సిలార్ సాహెబ్	896	894	898	889	-
57	896	సర్కారు పుంజ	0.733	0.302	షేక్ సత్తా బి W/o షారి సాహెబ్	897	895	898	888, 889	-
58	897	సర్కారు పుంజ	0.864	0.343	ముప్పాల శివ చంద్ర శేఖర్ రావు S/o అప్పయ్య	859, 860	896	898	888	-
59	898	సర్కారు పుంజ	1.487	0.558	తుమ్మల శైలజ W/o భాస్కర్ రావు	859	899	903, 904	897, 896, 895, 894	-
60	899	సర్కారు పుంజ	0.561	0.18	తుమ్మల సాయి కృష్ణ S/o భాస్కర్ రావు	898	900	903	893, 894	-
61	900	సర్కారు పుంజ	1.004	0.272	నూకవరపు నాగ సరోజిని W/o చంద్ర శేఖర్ రావు	899, 903	916, 920	901, 916	893	-
62	919	సర్కారు పుంజ	1.05	0.451	ముప్పాల సామ్రాజ్యమ్మ W/o నాగేంద్రం	920	947, 948	917, 918	921, 922	-
63	920	సర్కారు పుంజ	1	0.666	మన్నె మాధవి W/o సతీష్ బాబు	893, 900	919	916, 917	921	-
64	921	సర్కారు పుంజ	0.741	0.51	వణుకూరి వెంకటేశ్వర రెడ్డి S/o సాంబిరెడ్డి	893	922	920, 919	921	-
65	922	సర్కారు పుంజ	0.741	0.713	పుస్తేపల్లి మాధవ రెడ్డి S/o వెంకటేశ్వర రెడ్డి	921	945, 947	919	922, 923	-
66	923	సర్కారు పుంజ	0.791	0.066	ఉప్పాల శిల్పశ్రీ W/o సుధాకర్	923	945	922	923	-
67	943	సర్కారు పుంజ	2.406	0.002	నల్లూరి సాంబశివరావు S/o అంజయ్య	943	Enama dala Village Donka	946	943	-
68	945	సర్కారు పుంజ	1.739	0.922	నల్లూరి శిరీష W/o వేణు కుమార్	923, 922	946	947	945	-
69	946	సర్కారు పుంజ	1.47	1.237	కందూరి రమాదేవి W/o శంకర రెడి	945	ఎనమదల గ్రామ డొంక	946, 947	946, 943	-
70	947	సర్కారు పుంజ	1.869	0.781	పుస్తేపల్లి మహేష్ రెడ్డి S/o శ్రీనివాస లింగారెడ్డి	922, 919	947-2	947	945, 946	-
మొత్తం				38.605						

మండలం పేరు : ప్రత్తిపాడు — గ్రామం పేరు : ఎనమదల

1	4910	ఇనాం పుంజ	1.008	0.058	బండ్లమూడి లక్ష్మీపతి S/o సంపెంగరావు	4916	ప్రత్తిపాడు గ్రామ డొంక	4911	4907	-
2	4911	ఇనాం పుంజ	2.041	1.332	తియ్యగూర తులసీ రత్నం వరఫ్ తులసీ S/o నాగిరెడ్డి	4916	ప్రత్తిపాడు గ్రామ డొంక	4912	4911	-
3	4912	ఇనాం పుంజ	2.146	1.567	వణుకూరి శ్రీదేవి - శేషరత్నం W/o వెంకట సుబ్బారెడ్డి	4916	ప్రత్తిపాడు గ్రామ డొంక	4912	4911	-
4	4914	సర్కారు పుంజ	2.199	0.006	మలిసెని కోటేశ్వరరావు S/o రామయ్య	4915	ప్రత్తిపాడు గ్రామ డొంక	4912	4914	-
5	4915	సర్కారు పుంజ	0.7	0.067	మండవ ఆదిలక్ష్మి W/o సాంబశివ రావు	4916	4914	4915	4912	-
మొత్తం				3.03						

(మిగతా 12వ పేజీలో)

మండలం పేరు : ప్రత్తిపాడు **గ్రామం పేరు : ప్రత్తిపాడు**

1	1279	సర్కారు పుంజ	1.067	0.525	వణుకూరి నిరంజన్ రెడ్డి S/o సుబ్బారెడ్డి	1290, 1289	1280, 1282	1286	1279	-
2	1280	సర్కారు పుంజ	1.071	0.644	మేకా శివారెడ్డి స/ఓ సుబ్బారెడ్డి	1279, 1286	1281	1282	1280	-
3	1281	సర్కారు పుంజ	2.483	1.912	కుందూరి దుర్గా ప్రసాద్ రెడ్డి S/o సాంబి రెడ్డి	1280	1284	1281	1281	-
4	1282	సర్కారు పుంజ	2.346	0.143	కుర్రి సాంబిరెడ్డి S/o వీరా రెడ్డి	1286, 1279	1282	1282	1280, 1281	-
5	1286	సర్కారు పుంజ	1.119	0.206	బాణాల నాగిరెడ్డి S/o రామి రెడ్డి	1289	1282, 1280	1286	1279	-
6	1288	సర్కారు పుంజ	1.5	0.618	కుర్రి శివలిల్ల W/o శ్రీనివాస రెడ్డి	1292, 1285	1289, 1290	1288-2	1291	-
7	1289	సర్కారు పుంజ	0.749	0.458	వణుకూరి శంకర రెడ్డి స/ఓ ముసల రెడ్డి	1288	1279, 1286	1289	1290	-
8	1290	సర్కారు పుంజ	1.418	0.385	వణుకూరి మనోహర రెడ్డి S/o శ్రీనివాస రెడ్డి	1291	1279	1288, 1289	1290	-
9	1291	సర్కారు పుంజ	1.38	0.196	వణుకూరి పరమేశ్వర రెడ్డి s/o అప్పిరెడ్డి	1292	1290	1288	1291	-
10	1292	సర్కారు పుంజ	1.188	0.66	కొల్లా అప్పారావు S/o వెంకటేశ్వర్లు	1296	1291, 1288	1298, 1295	1292	-
11	1296	సర్కారు పుంజ	3.668	0.827	కొల్లా శ్రీనివాసరావు S/o వెంకట సుబ్బయ్య	1260	1292	1297, 1298	1295, 1293	-
12	1297	సర్కారు పుంజ	1.677	1.287	గోరంట్ల సుబ్బారావు S/o సత్యనారాయణ	1305, 1260	1298, 1299	1300	1296	-
13	1298	సర్కారు పుంజ	0.957	0.915	మూరకొండ కళ్యాణి W/o వెంకటేశ్వరరావు	1297	1285	1299	1296, 1292	-
14	1299	సర్కారు పుంజ	1.056	0.099	మూరకొండ జగన్మోహన్ రావు S/o	1297	1285	1300	1298	-
15	1341	సర్కారు పుంజ	2.216	0.007	వణుకూరి రంగా రెడ్డి S/o శేషు రెడ్డి	1284	1343, 1342	1340	1344	-
16	1343	సర్కారు పుంజ	1.579	0.536	ఆరె సుధా రాణి W/o బుల్లిరెడ్డి	1344	1338	1342	1345	-
17	1344	సర్కారు పుంజ	1.961	1.693	కల్లి పద్మావతి W/o శ్రీనివాస రెడ్డి	1284	1343	1341	1345	-
18	1346	సర్కారు పుంజ	1.506	0.585	కాను సంబ్రాజయం W/o సాంబి రెడ్డి	1158	1348	1345	1347	-
19	1348	సర్కారు పుంజ	2.79	0.958	కుర్రి రత్నా రెడ్డి	1346, 1347	1350, 1349	1345	1384,1383, 1382	-
20	1349	సర్కారు పుంజ	1.581	1.237	కుర్రి నరెంర ప్రతాప్ రెడ్డి S/o సాంబి రెడ్డి	1348	4785	1345	1350	-
21	1352	సర్కారు పుంజ	0.498	0.484	బోలె జయ వంశీ మైనర్ గార్డియన్ ఫాదర్ అంజిబాబు, S/o అంజిబాబు	4784	1355	1352, 1345	1353	-
22	1353	సర్కారు పుంజ	0.997	0.276	బోలె సాంబశివరావు S/o రాఘవయ్య	4784	1354, 1355	1352	1380	-
23	1354	సర్కారు పుంజ	0.471	0.435	పోలూరి వెంకట శివ రెడ్డి S/o నాగి రెడ్డి	1353	1359	1355	1360	-
24	1355	సర్కారు పుంజ	0.976	0.595	కుర్రి శివ సాంబి రెడ్డి S/o వెంకట రెడ్డి	1352, 1353	1357, 1356	1345	1354, 1359	-
25	1357	సర్కారు పుంజ	0.407	0.128	కుర్రి వెంకట రజని W/o అప్పిరెడ్డి	1355, 1359	1363, 1364	1356	1358	-
26	1358	సర్కారు పుంజ	0.847	0.764	బొందలపాటి నాగి రెడ్డి S/o కోటి రెడ్డి	1360, 1359	1362, 1363	1357	1361	-
27	1359	సర్కారు పుంజ	0.47	0.47	కేలూరి సాంబి రెడ్డి S/o వెంకటేశ్వర రెడ్డి	1354	1357, 1358	1355	1360	-
28	1360	సర్కారు పుంజ	0.562	0.179	వజరాల శివి రెడ్డి W/o సాంబి రెడ్డి	1360	1378, 1361, 1358	1354, 1359	1360	-
29	1361	సర్కారు పుంజ	0.39	0.39	బొందలపాటి రత్న కుమారి W/o రత్న రెడ్డి	1360	1362, 1377	1358	1378	-
30	1362	ఇనాం పుంజ	0.746	0.168	అన్నపురెడ్డి వెంకట్ శివ రామ కృష్ణా రెడ్డి S/o నాగి రెడ్డి	1358, 1361	1368	1363	1377	-
31	1369	ఇనాం పుంజ	1.997	0.427	వణుకూరి వెంకయ్యమ్మ W/o సాంబి రెడ్డి	1377	1370	1362	1371	-
32	1371	సర్కారు పుంజ	1.438	0.613	వజరాల వరలక్ష్మి W/o సుబ్బారెడ్డి	1375, 1376	3064	1377, 1369	1375, 1372	-
33	1372	సర్కారు పుంజ	0.139	0.018	కుర్రి సాంబి రెడ్డి S/o సుబ్బారెడ్డి	1375	3064	1371	1373	-
34	1373	సర్కారు పుంజ	1.998	1.276	వణుకూరి సుబ్బాయమ్మ W/o వెంకట సుబ్బారెడ్డి	1374, 1375	3064	1372	1399, 1400	-
35	1374	సర్కారు పుంజ	1.281	0.167	వజరల్ శివి రెడ్డి S/o సాంబి రెడ్డి	1398	1373	1375	1399	-
36	1375	సర్కారు పుంజ	0.977	0.909	వనుకూరి దుర్గా లక్ష్మి W/o వీరా రెడ్డి	1376	1372, 1373	1371	1374, 1373	-
37	1376	సర్కారు పుంజ	0.834	0.4	కుర్రి గోవిందమ్మ మరియు ఇతర 2 సభ్యులు W/o కోటిరెడ్డి	1398	1371, 1375	1377	1374	-
38	1377	ఇనాం పుంజ	1.987	1.794	కుర్రి ఇందిరమ్మ W/o వెంకట రెడ్డి	1398, 1379, 1378, 1361	1369	1,362	1376, 1371	-
39	1378	సర్కారు పుంజ	0.386	0.35	యర్రబోతుల శ్రీనివాస రెడ్డి S/o వెంకటేశ్వర	1360, 1378	1377	1361	1371	-
40	1379	సర్కారు పుంజ	0.997	0.391	వుస్తిపల్లి శివ పార్వతి W/o చైతన్య రెడ్డి	1379	1377	1361	1379, 1398	-
41	1398	ఇనాం పుంజ	10.239	0.001	శ్రీ వేణు గోపాల స్వామి దేవస్థానం	1392, 1393, 1396, 1397	1377	1379,1380	1404,1405	-
42	1399	సర్కారు పుంజ	1	0.051	అన్నపురెడ్డి చాముండేశ్వరి W/o సాంబి రెడ్డి	1399	1400	1373, 1374	1401	-
43	1400	సర్కారు పుంజ	1.019	0.969	కొల్లి అనూష W/o శ్రీనివాస రెడ్డి	1399	3064	1373, 1400	1401	-
44	1401	ఇనాం పుంజ	2.094	0.633	బాణాల గోపి మణిదీప్ రెడ్డి S/o నాగి రెడ్డి	1398	3064	1399, 1400	1402	-
45	1402	ఇనాం పుంజ	2.088	0.287	కుర్రి వీరారెడ్డి W/o దత్తత తండ్రి వెంకట్ రెడ్డి	1398	3064	1401	1419	-
46	1419	ఇనాం పుంజ	13.559	0.999	శ్రీ వేణు గోపాల స్వామి దేవస్థానం తత్కాల్ మేనేజర్	1443,1403,1404	1752	2167	1420,1440,1442	-
47	1419	ఇనాం పుంజ		0.02	శ్రీ వేణు గోపాల స్వామి దేవస్థానం తత్కాల్ మేనేజర్	1443,1403,1404	1752	2167	1420,1440,1442	-
48	1557	ఇనాం పుంజ	41.856	3.958	శ్రీ దండేశ్వర స్వామి వారి దేవస్థానం తత్కాల్ మేనేజర్	2009, 2010, 2011, 2012	2366	1557	1557	-
49	2009	సర్కారు పుంజ	0.562	0.237	ప్రత్తిపాటి సాంబయ్య S/o అరోహోను	2013	1557	2010	4590, 4589	-
50	2010	ఇనాం పుంజ	0.564	0.491	ప్రత్తిపాటి చిన్నయ్య S/o పున్నయ్య	2013	1557	2011	2009	-
51	2011	ఇనాం పుంజ	0.748	0.675	ప్రత్తిపాటి శివశంకర్ S/o సాంబయ్య	2013	1557	2012	2010	-
52	2012	ఇనాం పుంజ	0.766	0.294	ప్రత్తిపాటి బాబు S/o కోటయ్య	2013, 2095	1557	2096	2011	-
53	2013	ఇనాం పుంజ	1.013	0.393	డేగల వీరయ్య S/o నాగయ్య	2014	2010, 2011, 2012	2095	2008	-
54	2014	ఇనాం పుంజ	1.011	0.224	ఎంగల దాసు అజయ్ బాబు S/o వీర రాఘువులు	2015	2013	2094, 2095	2008	-
55	2015	ఇనాం పుంజ	1.012	0.087	షేక్ మస్తాన్ బి W/o అబ్దుల్ నబీ	2016	2014	2094	2008	-
56	2016	ఇనాం పుంజ	0.691	0.001	ప్రత్తిపాటి సౌభాగ్యం W/o అంకమ రావు	2017	2015	2094	2008	-
57	2043	సర్కారు పుంజ	2.055	0.048	లంబు సుబ్బా రావు S/o మస్తాన్ రావు	2044	2087	2058	1981	-
58	2057	సర్కారు పుంజ	2.311	0.229	గుంటుపల్లి సుఖిల్ S/o సాంబశివరావు	2052 ,2056	2058	2059, 2060	2051	-
59	2058	సర్కారు పుంజ	2.933	1.809	కడియాల శ్రీదేవి W/o శ్రీనివాసరావు	2057, 2059	2086, 2087	2069	2051 ,2044 ,2043	-
60	2059	సర్కారు పుంజ	0.802	0.726	వణుకూరి పున్నా రెడ్డి S/o వెంకట సుబ్బారెడ్డి	2060	2058	2068 ,2069	2057	-
61	2060	సర్కారు పుంజ	0.796	0.679	ప్రత్తిపాటి భాగ్యం W/o సాలి	2061	2059	2068	2057	-
62	2061	సర్కారు పుంజ	0.799	0.246	బండి లలిత రెడ్డి W/o శ్రీనివాస రెడ్డి	2062	2060	2068	2056 ,2057	-
63	2066	సర్కారు పుంజ	1.013	0.066	కందుల అర్జునరావు S/o సూర్య నారాయణ	2065	2068	2067	2062 ,2063 ,2064	-
64	2067	సర్కారు పుంజ	1.073	0.646	కందుల కోటేశ్వరరావు S/o సూర్య నారాయణ	2065 ,2074	2068, 2072	2073	2066	-
65	2068	సర్కారు పుంజ	2.319	1.416	వణుకూరి అశోక్ రెడ్డి s/o శంకర్ రెడ్డి	2066, 2067	2069	2072 ,2070	2061, 2060, 2059	-
66	2072	సర్కారు పుంజ	3.918	0.253	వణుకూరి రామి రెడ్డి S/o గంగి రెడ్డి	2067, 2073, 2068	2070 ,2071	2079 ,2080	2068	-
67	2073	సర్కారు పుంజ	1.005	0.863	కందుల రాధా కృష్ణ మూర్తి S/o సూర్య నారాయణ	2074	2072	2075	2067	-
68	2074	సర్కారు పుంజ	1.614	0.232	కొర్రపాటి రవీంద్ర కుమార్ s/o అక్కయ్య	1752	2073	2075	2065	-
69	2075	సర్కారు పుంజ	3.912	1.984	కుర్రి పద్మ W/o సింగారెడ్డి లక్ష్మారెడ్డి	1752	2072 ,2079 ,2078	2076	2073, 2074	-
70	2076	సర్కారు పుంజ	2.337	0.558	కుర్రి మంగమ్మ W/o గోపాల్ రెడ్డి	1752	2077	2167	2075	-
71	2086	సర్కారు పుంజ	0.428	0.263	కడియాల శ్రీదేవి W/o శ్రీనివాసరావు	2058	2166	2085	2087	-
72	2087	సర్కారు పుంజ	0.323	0.08	లంబు సుబ్బా రావు S/o మస్తాన్ రావు	2043	2088	2086	2043	-
73	2089	సర్కారు పుంజ	0.315	0.013	సంగన హారిక W/o రామాంజనేయ రెడ్డి	2088 ,2042	2093	2134	2091 ,2090	-
74	2092	సర్కారు పుంజ	0.256	0.017	దున్న సామ్రాజ్యం W/o యేసు	2091	2094	2093	2018	-
75	2093	సర్కారు పుంజ	1.865	1.569	సంగన హారిక W/o రామాంజనేయ రెడ్డి	2089	2095	2134, 2133	2092, 2094	-
76	2094	సర్కారు పుంజ	0.779	0.623	షేక్ కాలేషావలి S/o సిలార్	2092	2095	2093	2016, 2015, 2014	-
77	2095	ఇనాం పుంజ	1.496	0.497	నంబూరి చిన నాగేంద్రం W/o రోశయ్య	2093, 2094	2012, 3070, 2131	2132	2013, 2014	-
78	2133	సర్కారు పుంజ	1.109	0.172	ప్రత్తిపాటి సాంబయ్య స/ఓ యలమంద	2134	2132, 2130, 2095	2139	2093	-
79	2134	సర్కారు పుంజ	1.012	0.824	ప్రత్తిపాటి సాంబయ్య s/o కోటయ్య	2088	2133, 2134	2135	2089, 2093	-
80	2135	సర్కారు పుంజ	0.5	0.218	బండారు శివ లీల S/o సాంబయ్య	2088, 2166	2139	2136	2134	-
81	2136	ఇనాం పుంజ	1.164	0.091	చాగం రెడ్డి పద్మ W/o శివ నారాయణ రెడ్డి	2166	2137	2142 2141	2135	-
82	2177	ఇనాం పుంజ	1.001	0.736	పెంటేల పద్మావతి W/o నాగేశ్వరరావు	3064	2176	2178	2167	-
83	2178	ఇనాం పుంజ	1.811	0.769	తరిగోపుల రవి S/o రంగారావు	3064	2175, 2174, 2176,	2179	2177	-
84	2179	ఇనాం పుంజ	2.138	0.215	మున్నంగి లక్ష్మి సుజాత W/o శ్రీనివాస రెడ్డి	3064	2174	2180, 2192, 2193	2178	-
85	2379	ఇనాం పుంజ	10.627	3.053	శ్రీ వీరభద్ర స్వామి వారి దేవస్థానం తత్కాల్ మేనేజర్	2366	2380, 2384	2378	1880, 2379	-
86	2380	సర్కారు పుంజ	0.598	0.552	ఈమని వనజ W/o హనుమంత రావు	2379	2381	2384	1880	-
87	2381	సర్కారు పుంజ	1.46	0.992	కుర్రి వెంకట శివారెడ్డి W/o రోపి రెడ్డి	2380	2382	2383, 2384	1880	-
88	2382	సర్కారు పుంజ	0.531	0.211	షేక్ జాని మియ్యా S/o షేక్ మీరా సాహెబ్	2381, 2383 ,2385	2386	2385	1880	-
89	2383	సర్కారు పుంజ	1.061	0.58	కాసు శివ పార్వతి W/o శివ బ్రహ్మ రెడ్డి	2384	2382	2385	2381	-
90	2384	సర్కారు పుంజ	1.063	0.367	కారుమూరి శ్రీలక్ష్మి W/o రామ కృష్ణ రెడ్డి	2379	2383	2385	2380, 2381	-
91	2386	సర్కారు పుంజ	0.53	0.204	సయ్యద్ కౌసర జహా S/o నాయబ్ రసూల్	2382	2387	2385	1880	-
92	2387	సర్కారు పుంజ	2.186	0.823	షేక్ మస్తాన్ S/o నన్నె సాహెబ్	2386	2469, 2468	2388	1880	-
93	2440	సర్కారు పుంజ	1.076	0.157	బాధినేని పిచ్చమ్మ W/o అనంత కోటి నారాయణ	2441 ,2443	2491, 2407	2439	2477	-
94	2441	సర్కారు పుంజ	0.989	0.244	కాసు వేణు గోపాల రెడ్డి S/o శివ బ్రహ్మ రెడ్డి	2442	2440	2443	2476, 2477	-
95	2442	సర్కారు పుంజ	0.993	0.119	వణుకూరి శివ రామి రెడ్డి S/o వెంకట రెడ్డి	2476	2441	2443 ,2447	2476	-
96	2466	సర్కారు పుంజ	0.508	0.047	మెండూరు వెంకట లక్ష్మి కుమారి W/o వెంకట సత్య నారాయణ	2467	2471	2465	2470	-
97	2467	సర్కారు పుంజ	1.18	0.024	కుర్రి సుబాయమ్మ W/o వెంకటేశ్వర రెడ్డి	2387, 2388	2466	2465	2470, 2468	-
98	2468	సర్కారు పుంజ	0.581	0.564	అర్లల సూర్య చంద్రరావు W/o సాంబశివరావు	2387	2470	2467	2469	-
99	2469	సర్కారు పుంజ	0.656	0.092	కారసాల యేసు రత్నం W/o మస్తాన్	2387	2470	2468	1880	-
100	2470	సర్కారు పుంజ	1.158	0.586	నల్లపాటి పరమేశ్వరుడు S/o వెంకట రత్నం	2468, 2469	2471	2467, 2466	1880	-
101	2471	సర్కారు పుంజ	1.15	0.33	నల్లపాటి పరమేశ్వరుడు మరియు ఇతరులు S/o వెంకట రత్నం	2470, 2466	2473, 2485, 2486	2453	2490	-
102	2473	సర్కారు పుంజ	0.87	0.515	వజ్రాల శివ రామ కోటి రెడ్డి S/o సాంబి రెడ్డి	2471	2474	2472, 2476	2485	-
103	2474	సర్కారు పుంజ	0.346	0.331	వణుకూరి వెంకటరెడ్డి S/o రామి రెడ్డి	2473	2475	2476	2485, 2484	-
104	2475	సర్కారు పుంజ	0.36	0.36	కారుమూరి సాంబి రెడ్డి S/o శివారెడ్డి	2474	2476	2476	2484	-
105	2476	సర్కారు పుంజ	3.038	1.061	వణుకూరి వెంకట రెడ్డి S/o రామిరెడ్డి	2484, 2475, 2474	2477, 2441, 2442	2441, 2442, 2447, 2448, 2449	2483	-
106	2477	సర్కారు పుంజ	2.04	1.05	వణుకూరి వీరారెడ్డి S/o నాగి రెడ్డి	2476	2478 ,2479	2441, 2440	2480 ,2481	-
107	2478	సర్కారు పుంజ	0.824	0.422	వణుకూరి శంకర రెడ్డి S/o వీరారెడ్డి	2477	2491	2440	2479	-
108	2484	సర్కారు పుంజ	1.002	0.357	కారుమూరి విమలమ్మ W/o వీర రాఘువ రెడ్డి	2485 ,2486	2476	2474, 2475	2483	-
109	2485	సర్కారు పుంజ	1.888	1.647	కారుమూరి వెంకట రత్తమ్మ W/o రాఘువ రెడ్డి	2471	2484	2473, 2474	2486	-
110	2486	సర్కారు పుంజ	0.999	0.109	కూసం సుమతి W/o శ్రీనివాస రెడ్డి	2471	2482	2485	2487	-
111	2494	ఇనాం పుంజ	2.949	1.539	కాసు సామ్రాజ్యమ్మ W/o శివ నాగేంద్ర రెడ్డి	2493	2495	2493	2501	-
112	2495	ఇనాం పుంజ	0.999	0.241	కాసు రమాదేవి W/o పుల్లా రెడ్డి	2494	2496	2493	2501	-
113	2496	ఇనాం పుంజ	1.995	0.089	యర్రం భానుశ్రీ W/o శ్రీనివాస రెడ్డి	2495	జి జి పాలెం డొంక	2493	2497 ,2501	-
114	4589	సర్కారు పుంజ	0.166	0.006	కారసాల మెలియ్య W/o ప్రసాద్ రావు	2006	4590	2009	2004	-
115	4590	సర్కారు పుంజ	0.157	0.052	కారసాల వీరయ్య S/o ప్రసాద రావు	4589	1557	2009	2004	-
116	4784	సర్కారు పుంజ	0.742	0.352	కుర్రి వెంకట రత్నం W/o శివా రెడ్డి	4785	1353, 1352	1345	1380	-
117	4785	సర్కారు పుంజ	0.74	0.348	కుర్రి వెంకట రెడ్డి S/o బాపి రెడ్డి	1381 ,1350 ,1349	4784	1345	1380	-
	మొత్తం			66.711						

మండలం పేరు : ప్రత్తిపాడు **గ్రామం పేరు : మల్లయపాలెం**

క్రమ సంఖ్య	సర్వే నెం.	భూమి వివరణ	మొత్తం విస్తీర్ణం (య.సెం.)	భూ సేకరణ చేయు విస్తీర్ణం య. సెం	సంబంధిత అసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు సర్వే నెం. ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడములు ఇతరముల వివరములు
1	25	ఇనాం పుంజ	17.75	0.14	కారుమూరి వెంకట శివా రెడ్డి S/o సత్యనారాయణ రెడ్డి	38	గోరిజవోలుగుంట పాలెం	24, గోరిజవోలుగుంట పాలెం	26, గోరిజవోలుగుంట పాలెం	-
2				0.32	వజ్రాలపద్మావతి W/o శివ నాగి రెడ్డి	38	గోరిజవోలుగుంట పాలెం	24,గోరిజవోలుగుంట పాలెం	26, గోరిజవోలుగుంట పాలెం	-
3				0.53	కాసు శివ అంజి రెడ్డి S/o నాగి రెడ్డి	38	గోరిజవోలుగుంట పాలెం	24,గోరిజవోలుగుంట పాలెం	26, గోరిజవోలుగుంట పాలెం	-
4	26	ఇనాం పుంజ	14.3	0.45	మొవ్వా నాగమ్మ W/o నాగి రెడ్డి	38	గోరిజవోలుగుంట పాలెం	25	27,28	-
5				1.66	కాసు సాంబి రెడ్డి S/o కోటి రెడ్డి	38	గోరిజవోలుగుంట పాలెం	25	27,28	-
6				1.40	యెనిరెడ్డి సుబ్బా రెడ్డి S/o సాంబి రెడ్డి	38	గోరిజవోలుగుంట పాలెం	25	27,28	-
7				0.75	దంటు వెంకట రెడ్డి S/o సాంబి రెడ్డి	38	గోరిజవోలుగుంట పాలెం	25	27,28	-
8				0.19	యెనిరెడ్డి సామ్రాజ్యం W/o సాంబి రెడ్డి	38	గోరిజవోలుగుంట పాలెం	25	27,28	
9				0.07	మారెళ్ల అనంత లక్ష్మి W/o పెద్ది రెడ్డి	38	గోరిజవోలుగుంట పాలెం	25	27,28	-
10				0.03	కాసు ఝాన్సీ లక్ష్మి W/o వెంకట రెడ్డి	38	గోరిజవోలుగుంట పాలెం	25	27,28	
11	27-A	సర్కారు పుంజ	4.58	1.46	కుర్రి సాంబి రెడ్డి S/o వెంకటప్ప రెడ్డి	28	గోరిజవోలుగుంట పాలెం	26	గోరిజవోలుగుంట పాలెం	-
12				1.32	కుర్రి సుబ్బారెడ్డి S/o సాంబి రెడ్డి	28	గోరిజవోలుగుంట పాలెం	26	గోరిజవోలుగుంట పాలెం	-
13	27-C	సర్కారు పుంజ	2.38	0.16	కుర్రి ఆది లక్ష్మి W/o నాగి రెడ్డి	28	గోరిజవోలుగుంట పాలెం	26	గోరిజవోలుగుంట పాలెం	-
14	29-A		1.64	0.005	వణుకూరి హర్షవర్ధన్ రెడ్డి .మై.గా.రాతా నాగిరెడ్డి	31,32	28,గోరిజవోలుగుంట పాలెం	28,30	గోరిజవోలుగుంట పాలెం	-
15	29-B	సర్కారు పుంజ	7.62	0.19	చిడిపూడి అంజిరెడ్డి S/o సుబ్బా రెడ్డి	31,32	28,గోరిజవోలుగుంట పాలెం	28,30	గోరిజవోలుగుంట పాలెం	-
16				2.03	వణుకూరి శ్రావ్య రెడ్డి D/o సురేష్ రెడ్డి	31,32	28,గోరిజవోలుగుంట పాలెం	28,30	గోరిజవోలుగుంట పాలెం	-
17				0.39	వణుకూరి లాస్య రెడ్డి D/o సురేష్ రెడ్డి	31,32	28,గోరిజవోలుగుంట పాలెం	28,30	గోరిజవోలుగుంట పాలెం	-
18	29-C	సర్కారు పుంజ	5.9	0.75	వణుకూరి వెంకట రెడ్డి S/o వీరా రెడ్డి	31,32	28,గోరిజవోలుగుంట పాలెం	28,30	గోరిజవోలుగుంట పాలెం	-
19				0.77	కుర్రి ఆది లక్ష్మి S/o నాగి రెడ్డి	31,32	28,గోరిజవోలుగుంట పాలెం	28,30	గోరిజవోలుగుంట పాలెం	-
20				0.62	చల్లా శేషమ్మ,	31,32	28,గోరిజవోలుగుంట పాలెం	28,30	గోరిజవోలుగుంట పాలెం	-
21				0.46	చల్లా సామ్రాజ్యం	31,32	28,గోరిజవోలుగుంట పాలెం	28,30	గోరిజవోలుగుంట పాలెం	-
22				0.16	కాసు వెంకట రెడ్డి S/o వెంకటేశ్వర రెడ్డి	31,32	28,గోరిజవోలుగుంట పాలెం	28,30	గోరిజవోలుగుంట పాలెం	-
23	30-A	సర్కారు పుంజ	0.05	0.05	కారుమూరి జాహ్నవి D/o కోటి రెడ్డి	31	29	31	29	-
24	32-A		0.12	0.12	చల్లా భాస్కర రెడ్డి S/o కృష్ణా రెడ్డి	44	29	33	గోరిజవోలుగుంట పాలెం	-
25	32-B	సర్కారు పుంజ	1.93	0.85	వణుకూరి జితేంద్ర రెడ్డి S/o వెంకట రెడ్డి	44	29	33	గోరిజవోలుగుంట పాలెం	-
26	32-B			0.02	లంకపోతున అప్పమ్మ W/o వీర రాఘువ రెడ్డి;; కురి లక్ష్మి W/o	44	29	33	గోరిజవోలుగుంట పాలెం	-
27	32-C	సర్కారు పుంజ	0.89	0.68	చీడిపూడి అంజిరెడ్డి S/o సుబ్బారెడ్డి	44	29	33	గోరిజవోలుగుంట పాలెం	-
28	32-D		1.25	0.77	చీడిపూడి అంజిరెడ్డి S/o సుబ్బారెడ్డి	44	29	33	గోరిజవోలుగుంట పాలెం	-
29	32-E	సర్కారు పుంజ	0.43	0.42	చీడిపూడి అంజిరెడ్డి S/o సుబ్బారెడ్డి	44	29	33	గోరిజవోలుగుంట పాలెం	-
30	60-A	సర్కారు పుంజ	2.08	0.44	చల్లా లక్ష్మి W/o సాంబి రెడ్డి	61,62,63	44,గోరిజవోలుగుంట పాలెం	59	ప్రత్తిపాడు	-
31				0.31	చల్లా భాస్కర రెడ్డి S/o కృష్ణా రెడ్డి	61,62,63	44,గోరిజవోలుగుంట పాలెం	59	ప్రత్తిపాడు	-
32				0.49	బాణాల వెంకట శివా రెడ్డి S/o రామి రెడ్డి	61,62,63	44,గోరిజవోలుగుంట పాలెం	59	ప్రత్తిపాడు	-
33	62-D	సర్కారు పుంజ	1.52	0.04	బాణాల ఉగ్రసింహారెడ్డి S/o వెంకట శివారెడ్డి	66	60	61	63	-
34	63-C	సర్కారు పుంజ	1.38	0.09	యరద్ల శివ పార్వతి W/o ఆది నారాయణ రెడ్డి	66	60	62	64, ప్రత్తిపాడు	-
35				0.26	రెడ్డి బత్తుల శ్యాంకుమార్ రెడ్డి S/o వెంకట రెడ్డి	66	60	62	64, ప్రత్తిపాడు	-
36	63-D	సర్కారు పుంజ	1.30	1.06	చల్లా భాస్కర రెడ్డి S/o కృష్ణా రెడ్డి	66	60	62	64, ప్రత్తిపాడు	-
37	64	సర్కారు పుంజ	4.95	0.27	భీమవరపు భార్గవి W/o రవి క్రిషోర్ రెడ్డి	65	ప్రత్తిపాడు	63	ప్రత్తిపాడు	-
38				0.24	కుర్రి బాపి రెడ్డి S/o శివి రెడ్డి	65	ప్రత్తిపాడు	63	ప్రత్తిపాడు	-
39				0.51	అరుమల్ల జ్యోతి W/o కృపాల్ రెడ్డి	65	ప్రత్తిపాడు	63	ప్రత్తిపాడు	-
40				0.18	అరుమల్ల అంజిరెడ్డి S/o పెరిరెడ్డి	65	ప్రత్తిపాడు	63	ప్రత్తిపాడు	-
41				0.61	యెనిరెడ్డి బ్రహ్మ రెడ్డి S/o బంగారు రెడ్డి	65	ప్రత్తిపాడు	63	ప్రత్తిపాడు	-

(మిగతా 13వ పేజీలో)



72 అడుగుల కార్యసిద్ధి మహాగణపతి

విజయవాడ(విద్యాధరపురం), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా విజయవాడ విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్‌లో 72 అడుగుల మట్టి కార్యసిద్ధి మహాగణపతి విగ్రహం ఏర్పాటుచేశారు. ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని 40 టన్నుల బంక మట్టి, రాజస్థాన్ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన మట్టితో రూపొందించారు.



పెన్సిల్ ముల్లుపై సూక్ష్మ గణపతి

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేశ్ వినాయక చవితిని పురస్కరించుకుని పెన్సిల్ ముల్లుపై బొజ్జ గణపతి రూపాన్ని తీర్చిదిద్దారు. చార్కోల్ పెన్సిల్ ముల్లుపై 8 మి.మీ. వెడల్పు, 23 మి.మీ. ఎత్తు కలిగిన కళాఖండాన్ని తయారు చేశారు. ఇందుకు 6గంటల సమయం పట్టిందని వెంకటేశ్ చెప్పారు.

- ఆంధ్రజ్యోతి, నక్కపల్లి




కోటి లింగాలతో 108 అడుగుల గణపతి

విశాఖపట్నం గాజువాక ఆర్టీసీ డిపో సమీపాన కోటి శివలింగాలతో 108 అడుగుల ఎత్తయిన భారీ వినాయక విగ్రహాన్ని రూపొందించారు. దీనికి అవసరమైన శివలింగాలను అనకాపల్లిలో తయారు చేయించారు. కోటి శివలింగాలను భక్తులకు పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి







అద్దంకిలో నాట్యగణపతి ఆలయం

అద్దంకి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా అద్దంకిలో అతి పురాతనమైన వినాయకుని ఆలయం ఉంది. 13వ శతాబ్దంలో కాకతీయుల కాలంలోనే దీన్ని నిర్మించారు. నాట్య భంగిమలో ఉన్న గణపతి విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు. గతంలో ఏరువాక సందర్భంగా రైతులు తమ ఎడ్ల జతలతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన తరువాత పొలాలకు వెళ్లేవారు. కానీ ఇప్పుడు ప్రదక్షిణ చేసే అవకాశం లేకపోవడంతో పూజల వరకే పరిమితమవుతున్నారు.

దేశ ఆర్థిక భద్రతకు నేవీ వెన్నుదన్ను

- ఉదయగిరి, హిమగిరి యుద్ధనౌకల ప్రారంభ వేడుకలో రాజ్‌నాథ్



ఐఎన్ఎస్ హిమగిరిని జాతికి అంకితం చేస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్. చిత్రంలో చీఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి, ఎంపీ సీఎం రమేశ్, తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సముద్ర తీరానికి రక్షణ కల్పించడమే కాకుండా దేశ ఆర్థిక భద్రతలో కూడా భారత నావికాదళం ప్రధాన భూమిక పోషిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. సముద్ర జలాల్లో లభించే చమురు, సహజ వాయువులను శత్రువుల నుంచి కాపాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. రెండు వేర్వేరు నౌకా నిర్మాణ కేంద్రాల్లో (ముంబై, కోల్‌కతా) తయారుచేసిన మల్టీ మిషన్ స్టెల్త్ ఫ్రిగేట్లు ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరి నౌకలను విశాఖపట్నం నేవల్ డాక్ యార్డులో ఆయన మంగళవారం సాయంత్రం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. రెండు వేర్వేరు షిప్ యార్డుల్లో నిర్మించిన రెండు యుద్ధ నౌకలను ఇలా ఏకకాలంలో ప్రారంభించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా సొంతంగా యుద్ధనౌకలు తయారు చేసుకోవాలనే కల వీటితో సాకారమైందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన మారణకాండకు ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో సమాధానం చెప్పామని తెలిపారు. అయితే ఈ ఆపరేషన్ పూర్తి కాలేదని, తాత్కాలికంగా ఆగిందని వెల్లడించారు. కార్యక్రమంలో తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అత్యాధునిక ఆయుధాలు, సెన్సర్లు

ఉదయగిరి, హిమగిరి నౌకలను దేశీయంగా నిర్మించారు. సముద్ర రక్షణలో ఇవి భారత నౌకాదళానికి కీలకం కానున్నాయి. ప్రాజెక్ట్-17ఏ కింద నిర్మించిన రెండో నౌక ఐఎన్ఎస్ ఉదయగిరి. ఇందులో తొలి నౌక ఐఎన్ఎస్ నీలగిరిని ఈ ఏడాదే ప్రధాని మోదీ ప్రారంభించారు. ఉదయగిరిని ముంబైలోని మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) నిర్మించింది. మూడో నౌకగా ఐఎన్ఎస్ హిమగిరిని కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ) రూపొందించింది. నీలగిరి శ్రేణిలో మొత్తం 7 గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్లను భారత్ నిర్మిస్తోంది. నీలగిరి, ఉదయగిరి, తారగిరి, మహేంద్రగిరి యుద్ధనౌకలను ఎండీఎల్.. హిమగిరి, దునాగిరి, వింధ్యాగిరి యుద్ధనౌకలను జీఆర్ఎస్ఈ నిర్మిస్తున్నాయి. ఉదయగిరి బరువు 6,700 టన్నులు. ఇది శివాలిక్ క్లాస్ కంటే ఐదు శాతం ఎక్కువ. అధునాతన రాడార్ వ్యవస్థ కలిగిన ఉదయగిరి సొగసైన రూపంతో మరింత ఆకర్షణీయంగా ఉంటుంది. అధునాతన ఆయుధాలు, సెన్సర్లు, రాడార్ వ్యవస్థలను అమర్చారు. సూపర్‌సోనిక్ క్షిపణులు, ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే మధ్యశ్రేణి క్షిపణులు, 76 ఎంఎం ఎంఆర్ గన్, 30 ఎంఎం, 12.7 ఎంఎం క్లోజ్-ఇన్ ఆయుధ వ్యవస్థలు కూడా ఉన్నాయి. భారత నేవీకి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో డిజైన్ చేసిన 100వ నౌకగా ఐఎన్ఎస్ ఉదయగిరి నిలిచింది.

ఆమె.. తాటకి, లంకిణి!

- అవినీతి అనకొండ.. వేల కోట్ల లూటీ
- సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మిని ఉద్దేశించి భూమన వ్యాఖ్యలు

తిరుపతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి పేరెత్తకుండానే వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. "ఆమె తాటకి, పూతన, లంకిణి.. ఆధునిక రజియా సుల్తానా." అంటూ మంగళవారం సెల్ఫీ వీడియోలో మండిపడ్డారు. "తిరుపతిలో టీడీఆర్ బాండ్ల అవినీతి జరిగిందంటూ ప్రచారం జరగడానికి కారణం ఓ మహిళా ఐఏఎస్" అంటూ శ్రీలక్ష్మిపై ఆరోపణలు గుప్పించారు. తిరుపతిలో గత ప్రభుత్వంలో తాము మాస్టర్ ప్లాన్ కింద 21 రోడ్లు కొత్తగా వేస్తుండగా, ఆ రోడ్ల నిర్మాణంతో స్థలాలు కోల్పోయే వారిని టీడీఆర్ బాండ్ల పేరుతో దోపిడీ చేయడానికి, తద్వారా రూ.వందల కోట్లు నొక్కేయడానికి ఆవిడ కుటిల పన్నాగం పన్నారని ఆరోపించారు. దాన్ని తాము అడ్డుకున్నామన్న దుగ్ధతో ఆమె తమ పక్క జిల్లా టీడీపీ నేతలకు ఆ విషయం చెప్పి, రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని తమపై ఎంత ప్రచారం చేశారో అందరికీ తెలుసన్నారు. అవినీతిలో ఆమె అనకొండ అని, రాష్ట్రంలో అప్పటి మంత్రులను పూచిక పుల్లల్లా చూసేవారని ఆరోపించారు. చివరికి తన శాఖకు ఇంచార్జిగా ఉన్న మంత్రులను కూడా లెక్క చేయలేదని ఆరోపించారు. "డబ్బు సంపాదించడం తప్ప ఏ నైతిక విలువలూ లేని మనిషి. కింది స్థాయి అధికారుల పట్ల తాటకిలా వ్యవహరించారు. ఈ అవినీతి అధికారిణి గత 30-35 ఏళ్లుగా ఎక్కడ పనిచేసినా వందల, వేల కోట్లు లూటీ చేశారు. చివరికి అత్యున్నత న్యాయస్థానంతో కూడా 'మీ నీతి గురించి మాకు చాలా బాగా తెలుసులే' అని అనిపించుకున్నారు" అని ఎద్దేవా చేశారు. పూతనకు ఏమాత్రం తక్కువ కాదని, లంకిణి కంటే చాలా విపరీత చేష్టలున్న అధికారిణి అని ఆరోపించారు.

జీతమెంత.. చీర ధరెంత?

ఐఏఎస్ శ్రీలక్ష్మి వస్త్రాలపైనా భూమన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆమె రోజూ ధరించే చీర ఖరీదు రూ.లక్షన్నరకు పైగా ఉంటుందన్నారు. "ఆమె చేసే ఉద్యోగమేంటి? ఆమెకు వచ్చే జీతమెంత? ధరించే చీరల ఖరీదు ఎంత?." అని ప్రశ్నించారు. రూ.50 లక్షలకు పైగా ఖరీదు చేసే విగ్గులు ఆమెకు 11 ఉన్నాయని, ఒక్కో రోజు ఒకో విగ్గు ధరిస్తూ ఆఫీసులో దర్శనమిస్తుంటారని ఆరోపించారు. అవినీతితో పాటు భూమిని కూడా ఆమె కొల్లగొట్టారని ఆరోపించారు. విలువలు, ఉద్యమాలు, పోరాటాలతో రాజకీయాలు చేసిన తనపై ఆమె కక్ష కట్టారని ఆరోపించారు. "టీడీఆర్ బాండ్లపై ఏ విచారణకైనా సిద్ధమే. ఒక్క రూపాయి అవినీతి చేసివున్నా ఏ శిక్షకైనా సిద్ధమే. ఇలాంటి నీచ ఆలోచన ఉన్న అధికారుల వల్ల సమస్యలు వస్తాయి. అయినా రాజకీయాల్లో ఇలాంటివి సహజం. కాబట్టి భరిస్తాం" అని వ్యాఖ్యానించారు.

పేదింటి బిడ్డకు పెద్ద కష్టం

- కూలీ దంపతుల కుమారుడికి కాలేయ వ్యాధి
- వైద్యానికి రూ.30 లక్షలు అవసరం
- దాతలు సాయం చేయాలని వినతి



ఆసుపత్రిలో రంగస్వామి

బళ్లారి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పేదింటి బిడ్డకు పెద్ద కష్టం వచ్చింది. కూలీ దంపతుల కుమారుడు కాలేయ వ్యాధితో బాధ పడుతున్నాడు. చికిత్సకు రూ.30 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బళ్లారి జిల్లా కురుగోడు తాలూక హెచ్.విరుపాపుర గ్రామానికి చెందిన రంగస్వామి(17) కుడుగోడులో పీయూసీ చదువుతున్నాడు. ఈ విద్యార్థి తల్లిదండ్రులు నీలమ్మ, సోనస్వామి కూలి పనులు చేస్తారు. రంగస్వామికి కొన్నాళ్ల క్రితం కడుపు ఉబ్బడం, నొప్పి రావడం మొదలైంది. కురుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే వైద్యులు బళ్లారి విమ్స్‌కు వెళ్లాలని సూచించారు. విమ్స్‌లో పరిశీలించిన వైద్యులు.. బెంగళూరుకు వెళ్లాలని చెప్పారు. బెంగళూరుకు తీసుకెళ్లి చూపిస్తే రంగస్వామికి కాలేయం దెబ్బతిందని, ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని అక్కడి వైద్యులు చెప్పారు. లేదంటే ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని తెలిపారు. చికిత్సకు రూ.30 లక్షల దాకా ఖర్చవుతుందని తెలిపారు. చేతిలో చిల్లి గవ్వ లేని ఆ తల్లిదండ్రులు తమ బిడ్డ ప్రాణాలను కాపాడాలని దాతలకు విన్నవిస్తున్నారు. సాయం చేయదలచినవారికి సమాచారం

పేరు: హెచ్. సన్న సోమ
సిండికేట్ బ్యాంకు ఖాతా నంబరు: 06292210030376
ఐఎఫ్ఎస్సీ: సీఎన్ఆర్‌బీ0010629
ఫోన్ పే నంబర్: 9019408912

కొత్త ఏసీ బస్సులొచ్చాక వాటిలోనూ మహిళలకు ఉచిత ప్రయాణం

- సజావుగా స్త్రీశక్తి పథకం అమలు
- ఎండీ ద్వారకాతిరుమలరావు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): త్వరలో ఆర్టీసీకి 1500 ఎలక్ట్రికల్ ఏసీ బస్సులు రానున్నాయని, వాటిలోనూ స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఏసీ ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఆర్టీసీ బస్టాండ్, డిపోలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్న పక్క రాష్ట్రాలతో పోలిస్తే మనకు ఇక్కడ ఎలాంటి సమస్యలు ఎదురుకాలేదన్నారు. పక్క రాష్ట్రాల్లో మహిళలు, పురుష ప్రయాణికుల నిష్పత్తి 63-37 శాతం ఉండగా మన రాష్ట్రంలో 70-30గా ఉందన్నారు. గతంతో పోలిస్తే మహిళా ప్రయాణికులు పెరిగారని చెప్పారు. స్త్రీ శక్తి పథకం కారణంగా పాత రూట్లు రద్దు చేసే ఆలోచన ఏదీ లేదని, అవసరమైతే డిమాండ్‌ను బట్టి మరిన్ని బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

తడి తగిలితే తంటా!

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించింది. అంతేకాదు, 'ఈ-20 పెట్రోల్ పాలసీ'ని తెచ్చింది. ముడిచమురు దిగుమతులను నియంత్రించడం, కాలుష్యానికి కారణమయ్యే కర్బన ఉద్గారాలను నియంత్రించే లక్ష్యంతో ఈ పాలసీని తీసుకువచ్చినట్టు కేంద్రం పేర్కొంది. 2030 నాటికి దశలవారీగా పెట్రోలులో ఇథనాల్‌ను 30 శాతానికి పెంచే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఇదిలావుంటే, ఇథనాల్ కలిపిన పెట్రోలు నింపిన వాహనం ట్యాంకులోకి ఒక్క నీటి చుక్క చేరినా లేదా నీటి చెమ్మ(తడి) తగిలినా.. వెంటనే పెట్రోలులో కలిసి ఉన్న ఇథనాల్ మొత్తం నీరుగా మారిపోతోంది. అప్పటి వరకు ట్యాంకులో పాలు-నీళ్లగా కలిసి ఉన్న పెట్రోలు-ఇథనాల్ పూర్తిగా వేరైపోతాయి. పెట్రోలు కంటే నీరు బరువుగా ఉండటం వల్ల నీరుగా మారిన ఇథనాల్ ట్యాంకు అడుగు భాగంలోకి, పెట్రోలు పైభాగంలోకి చేరుతుంది. ఈ కారణంగానే వాహనాలు మొరాయిస్తున్నాయి. వాహనాలకు వాటర్ సర్వీసింగ్ చేయించినా, వర్షంలో ఉంచినా పెట్రోలు ట్యాంకులోకి నీరు చేరడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో పెట్రోలుతో కలిసి ఉన్న ఇథనాల్ నీరుగా మారిపోతోంది.

సుప్రీం కోర్టులో పిల్

రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా ఈ సమస్య తీవ్రంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'ఈ-20 పెట్రోలు పాలసీ'ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. తప్పనిసరిగా 20 శాతం ఇథనాల్ కలిపిన ఇంధనాన్నే విక్రయించాలంటూ కేంద్రం విధించిన నిబంధనలను వ్యతిరేకిస్తూ న్యాయవాది అక్షయ్ మల్హోత్రా ఈ పిల్ వేశారు. పెట్రోలులో ఇథనాల్ బ్లెండింగ్‌పై వాహనదారులకు అవగాహన కల్పించకుండా ఈ పాలసీని అమలు చేయడం వినియోగదారుల రక్షణ చట్టం-2019 ఉల్లంఘనేనని వ్యాజ్యంలో పేర్కొన్నారు.

బంకులకు పంపే ట్యాంకుల్లో పెట్రోలు, ఇథనాల్‌ను విడివిడిగా నింపి తరలిస్తున్నాయి. పెట్రోలు బంకుల్లోని అండర్ గ్రౌండ్ ట్యాంకుల్లోకి నీరు చేరినా, చెమ్మ తగిలినా.. ఆ ట్యాంకులోని ఇథనాల్ మొత్తం నీరుగా మారిపోతోందని నిపుణులు చెబుతున్నారు. పెట్రోలు-ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియ సరిగా ఉండాలని సూచిస్తున్నారు.

ఏంటీ బ్లెండింగ్?

చెరకు, మొక్కజొన్న తదితర వ్యవసాయ ఉత్పత్తుల నుంచి ఇథనాల్‌ను తయారు చేస్తారు. పెట్రోల్ తరహాలోనే ఇథనాల్‌కు కూడా మండే స్వభావం ఉంది. వాహనాలకు పెట్రోలు ఏవిధంగా పని చేస్తుందో ఇథనాల్ కూడా అదే తరహా ఇంధనంగా పని చేస్తుంది. కాబట్టి పెట్రోలులో ఇథనాల్ కలపడం వల్ల ఎలాంటి నష్టం ఉండదని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అయితే, ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలిపే ప్రక్రియ కీలకం. దీనినే 'ఇథనాల్ బ్లెండింగ్' అంటారు. నిబంధనల ప్రకారం బ్లెండింగ్ చేసి బంకులకు సరఫరా చేయాల్సిన ఆయిల్ కంపెనీలు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

అవగాహన కల్పించాలి

"పెట్రోలులో ఇథనాల్ కలుపుతున్నారనే విషయం ఇప్పటికీ చాలామంది వాహనదారులకు తెలియదు. దీనిపై ప్రభుత్వాలు, ఆయిల్ కంపెనీలు అవగాహన కల్పించాలి. ఇథనాల్‌ను శాస్త్రీయ పద్ధతుల్లో బ్లెండింగ్ చేస్తే సమస్య రాకపోవచ్చు. కానీ, ఆయిల్ కంపెనీలు బ్లెండింగ్ ప్రక్రియను ఎలా నిర్వహిస్తున్నాయో ఎవరికీ తెలియడం లేదు. వాహనదారులకు నష్టం జరిగితే.. దానికి పెట్రోలు బంకులను బాధ్యులను చేస్తున్నారు. పెట్రోలులో ఇథనాల్ బ్లెండింగ్ విధానంపై వాహనదారులకు అవగాహన కల్పించాల్సి ఉంది"

- రావి గోపాలకృష్ణ, పెట్రోలు డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

దివ్యాంగులందరికీ యథావిధిగా పెన్షన్లు: సెర్ప్

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులందరికీ సెప్టెంబరులో యథావిధిగా పెన్షన్లు అందుతాయని, దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సెర్ప్ అధికారులు స్పష్టం చేశారు. పింఛను నిలిపివేస్తున్నామంటూ పలువురు దివ్యాంగులకు ఇటీవల నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో.. 'ఆందోళన వద్దు, పెన్షన్ వస్తుంది' అని భరోసా ఇస్తూ మంగళవారం నుంచి వారందరికీ మెసేజ్‌లు పంపుతున్నారు. దివ్యాంగుల పెన్షన్లకు సంబంధించి ఇటీవల సదరం సర్టిఫికెట్లు రీవెరిఫికేషన్ చేశారు. అందులో 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారికి సెప్టెంబరు నుంచి పెన్షన్ నిలిపేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరగడంతో సెర్ప్ అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు. సెప్టెంబరులో యథావిధిగా పెన్షన్లు పంపిణీ చేయాలని సీఎం ఆదేశించడంతో ఆమేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం దివ్యాంగుల పింఛన్లపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి ఆరోపించారు.

బోగస్ దివ్యాంగ పింఛన్ల ఏరివేత మంచిదే: షర్మిల

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ముసుగులో తీసుకుంటున్న బోగస్ పింఛన్లను గుర్తించి ఏరివేయడం మంచిదేనని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. అయితే, ఈ రీ-వెరిఫికేషన్ పేరిట అర్హులను సైతం అనర్హులుగా పరిగణించి, వారి పొట్టకొట్టడం దుర్మార్గమని మంగళవారం ఆమె ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నోటీసులు ఇచ్చిన లక్షా ఇరవై వేల మందిలో అర్హులే ఎక్కువమంది ఉన్నారని తెలుస్తోందని షర్మిల తెలిపారు. అనర్హులుగా గుర్తించిన జాబితాపై మళ్లీ వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. దొంగ సర్టిఫికెట్లు తీసుకున్న వాళ్లపైనా, సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు.

అంగన్వాడీల సమస్యలన్నీ పరిష్కరిస్తున్నాం

- గ్రాట్యుటీ ఇచ్చాం.. మినీలను మెయిన్‌గా మార్చాం
- నెలలో 5జీ ఫోన్లు.. మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ వెల్లడి
- వేతనాలు వెంటనే పెంచాలి: అంగన్వాడీ సంఘాలు



వేణుగోపాల్ రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న అంగన్వాడీ సంఘాల నేతలు

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సమస్య పరిష్కారంపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పలు సానుకూల నిర్ణయాలు తీసుకుందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి చెప్పారు. గ్రాట్యుటీ అమలుకు, మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్పునకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఇంకా కొన్ని సాంకేతిక సమస్యలు, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అంగన్వాడీలకు నెల రోజుల్లో 5జీ నెట్‌వర్క్‌తో కొత్త మొబైల్ ఫోన్లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మంగళవారం గుంటూరులోని తన కార్యాలయంలో అంగన్వాడీ సంఘాల నేతలతో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అసోసియేషన్, ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కె సుబ్బరావమ్మ, లలితమ్మ, జ్యోతి భారతి తదితరులు పాల్గొన్నారు. భేటీ అనంతరం ఆ వివరాలతో అంగన్వాడీ సంఘాల నేతలు ఒక ప్రకటన విడుదల చేశారు. వెంటనే అంగన్వాడీల వేతనాలు పెంచాలని, లేకపోతే మరో ఆందోళనకు సిద్ధమవుతామని సమావేశంలో అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిపారు. పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయనవి మాత్రమే బాల సంజీవని యాప్‌లో చేయాలని డైరెక్టర్ చెప్పారన్నారు. గ్రాట్యుటీ అమలుకు లేబర్ డిపార్ట్‌మెంట్ సలహాతో గైడ్‌లైన్స్ రూపొందుతున్నాయని తెలిపారు. 1810 మంది మినీ వర్కర్ల అర్హతకు మినహాయింపు ఇవ్వాలని కోరామన్నారు. వేసవి సెలవులు నెలరోజులు పాటు ఇవ్వడానికి అంగీకారం కుదిరిందన్నారు. జూన్ 2025 వరకు అన్ని రకాల బిల్లులకు బడ్జెట్ ఇచ్చినట్లు తెలిపారన్నారు. పలు జిల్లాల్లో బీఎల్‌వో డ్యూటీ తప్పించేందుకు హామీ ఇచ్చారన్నారు.

కామ్రేడ్లలో కుదరని ఏకాభిప్రాయం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక వాయిదా

ఒంగోలు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలులో మూడ్రోజులు నిర్వహించిన సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు సోమవారం రాత్రితో ముగిశాయి. అయితే మహాసభల ముగింపులో జరగాల్సిన రాష్ట్ర నూతన నాయకత్వ ఎన్నిక మాత్రం పూర్తి కాలేదు. పార్టీ రాష్ట్ర కమిటీకి కొత్త కార్యదర్శిపై నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చివరి నిమిషంలో ఎన్నికను వాయిదా వేశారు. వచ్చే నెలలో చండీగఢ్‌లో జరిగే జాతీయ మహాసభల అనంతరం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించి నూతన కార్యదర్శిని ఎన్నుకుంటారు. అప్పటి వరకు ప్రస్తుత కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలోని పాత కమిటీయే కొనసాగనుంది. ఒంగోలులో ఈ నెల 23 నుంచి 25వరకు సీపీఐ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. చివరి రోజైన సోమవారం సాయంత్రం 101 మందితో రాష్ట్ర కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. దాని నుంచి రాష్ట్ర కార్యవర్గం, కార్యదర్శివర్గాన్ని.. కార్యదర్శివర్గంలో ఒకరిని కార్యదర్శిగా ఎన్నుకోవాలి. గుంటూరు జిల్లాకు చెందిన సీనియర్ నేత, పార్టీ ప్రస్తుత సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కడప జిల్లాకు చెందిన యువనేత జి.ఈశ్వరయ్య ఆ పదవిని ఆశించారు. డి.రాజా, కార్యదర్శి నారాయణ సూచనలు, రామకృష్ణ ప్రతిపాదనతో ముప్పాళ్ల వైపు నేతలు మొగ్గు చూపారు. దీన్ని ఈశ్వరయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ఇప్పటి వరకు సహాయ కార్యదర్శిగా ఉన్న విశాఖకు చెందిన జేవీవీఎస్ మూర్తిని అదే పదవిలో కొనసాగిస్తూ ఈశ్వరయ్యను మరో సహాయ కార్యదర్శిగా నియమించాలని ప్రతిపాదించారు. దీనిపై అర్ధరాత్రి వరకూ గందరగోళం కొనసాగడంతో నారాయణ సీరియస్ అయ్యారు. అర్ధరాత్రి దాటాక ఓటింగ్, కౌన్సిల్‌లో చర్చకు ఆస్కారంలేదని.. ఎన్నికను వాయిదా వేయాలని సూచించారు. దీంతో సమావేశం వాయిదా పడింది.

(12వ పేజీ తరువాయి)

42	65-A	సర్కారు పుంజ	2.26	0.68	ఈమని చిన శేషి రెడ్డి S/o రామి రెడ్డి	66	64	63,66	ప్రత్తిపాడు	-
43				0.06	ఈమని రామిరెడ్డి S/o శేషి రెడ్డి	66	64	63,66	ప్రత్తిపాడు	-
44				0.05	ఈమని సీరి రెడ్డి S/o శేషి రెడ్డి	66	64	63,66	ప్రత్తిపాడు	-
45				0.10	ఈమని శేషి రెడ్డి S/o సుబ్బారెడ్డి	66	64	63,66	ప్రత్తిపాడు	-
46	65-B	సర్కారు పుంజ	2.14	0.04	ఆరుమళ్ల జ్యోతి W/o కృపాల్ రెడ్డి	66	64	63,66	ప్రత్తిపాడు	-
47	65-B	సర్కారు పుంజ		0.20	ఆరుమళ్ల కాంతమ్మ W/o వెంకటేశ్వర రెడ్డి	66	64	63,66	ప్రత్తిపాడు	-
48	65-B	సర్కారు పుంజ		0.35	కాసు నాగ లక్ష్మి W/o వెంకట రెడ్డి	66	64	63,66	ప్రత్తిపాడు	-
49	66-A1A	సర్కారు పుంజ	12.05	0.20	నక్కా శంకరరావు S/o సాంబయ్య	67,68	61,62, 63,65	58,70, 71	ప్రత్తిపాడు	-
50				0.22	షేక్ అల్లావుద్దీన్ S/o మస్తాన్ సాహెబ్	67,68	61,62, 63,65	58,70, 71	ప్రత్తిపాడు	-
51				0.40	ఈదర నాగి రెడ్డి S/o చెంచి రెడ్డి	67,68	61,62, 63,65	58,70, 71	ప్రత్తిపాడు	-
52				0.65	కారుమూరి మల్లా రెడ్డి S/o సత్యనారాయణ రెడ్డి	67,68	61,62, 63,65	58,70, 71	ప్రత్తిపాడు	-
53				0.12	కాసు నాగి రెడ్డి	67,68	61,62, 63,65	58,70, 71	ప్రత్తిపాడు	-
54				0.53	విప్పల నాగమ్మ W/o వెంకట రెడ్డి	67,68	61,62, 63,65	58,70, 71	ప్రత్తిపాడు	-
55	67	సర్కారు పుంజ	1.94	0.19	మలక కోటి రెడ్డి S/o సాంబి రెడ్డి	68	66	68	ప్రత్తిపాడు	-
56				0.89	విప్పాల ఉల్లేరు రెడ్డి S/o కోటి రెడ్డి	68	66	68	ప్రత్తిపాడు	-
57	68-A1A	సర్కారు పుంజ	9.1	0.27	కాసు వెంకట సుబ్బారెడ్డి S/o శివ బ్రహ్మ రెడ్డి	ప్రత్తిపాడు ,69	66	70	68.ప్రత్తిపాడు	-
58				0.27	విప్పాల ఉల్లేరు రెడ్డి S/o కోటి రెడ్డి	ప్రత్తిపాడు ,69	66	70	68.ప్రత్తిపాడు	-
59				0.85	విప్పాల వెంకట రెడ్డి	ప్రత్తిపాడు ,69	66	70	68.ప్రత్తిపాడు	-
60	68-B	శిస్తు కట్టిన బంజరు	0.58	0.55	షేక్ హుస్సేన్ సాహెబ్ S/o ఖాసీం సాహెబ్	ప్రత్తిపాడు ,69	66	70	68.ప్రత్తిపాడు	-
61	194	ఇనాం పుంజ	6.1	0.37	వణుకూరి పున్నారెడ్డి S/o వెంకట రెడ్డి	ప్రత్తిపాడు	193	195	ప్రత్తిపాడు	-
62				0.03	యార్లగడ్డ నాగేశ్వరరావు S/o సుబ్బారావు	ప్రత్తిపాడు	193	195	ప్రత్తిపాడు	-
మొత్తం				28.285						

ప్రదేశం : గుంటూరు
తేది: 26-08-2025

సం/- యస్ నాగలక్ష్మి
కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్
గుంటూరు


బిజినెస్

అమెరికా ఫెడ్ రిజర్వ్ గవర్నర్ లిసా కుక్‌కు ఉద్వాసన

న్యూయార్క్: తనఖా రుణాల అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ లిసా కుక్‌కు ఉద్వాసన చెప్పాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం నిర్ణయించారు. ఫెడ్‌కు గవర్నర్‌గా నియమితురాలైన తొలి ఆఫ్రికన్-అమెరికన్ ఆమె. ట్రంప్ నియమించిన ఫెడరల్ హౌసింగ్ ఫైనాన్స్ ఏజెన్సీ చీఫ్ విలియం పుల్టే.. లిసా తనఖా పెట్టిన రెండు నివాసాలు ఆమెకు సంబంధిచినవేనని ఆరోపించారు. దీన్ని ఆధారం చేసుకుని లిసాను రాజీనామా చేయాలని ఈ నెల 20న ట్రంప్ ఆదేశించారు. అంతేకాకుండా "మిమ్మల్ని పదవి నుంచి తొలగించేందుకు తగిన ఆధారాలున్నట్టు నేను నిర్ధారించుకున్నాను" అని ట్రంప్ ఆమెకు రాసిన లేఖలో పేర్కొన్నారు. తనఖా దరఖాస్తుల్లో ఆమె తప్పుడు సమాచారం ఇచ్చారని కూడా ఆరోపించారు. ఫెడ్ నాయకత్వంలో మార్పులు చేయాలన్న తన ప్రయత్నంలో భాగంగా ట్రంప్ అనుసరిస్తున్న ఒత్తిడి వ్యూహమని విశ్లేషకులంటున్నారు. వడ్డీరేట్ల తగ్గింపు విషయంలో ఫెడ్‌కు, ట్రంప్‌కు మధ్యన విభేదాలున్న విషయం విదితమే.

వచ్చే ఐదేళ్లలో భారత్‌లో రూ.70,000 కోట్ల పెట్టుబడులు

సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ



ఈ-విటారా ఎగుమతులను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీతో తొషిహిరో సుజుకీ

హన్సల్‌పూర్ (గుజరాత్): భారత్‌లో సంస్థ కార్యకలాపాలు పటిష్ఠం చేయడంపై జపాన్‌కు చెందిన సుజుకీ మోటార్ కార్పొరేషన్ దృష్టి సారించింది. వచ్చే ఐదారేళ్ల కాలంలో ఇందుకోసం రూ.70,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ కారు ఈ-విటారా ఎగుమతులను, లిథియం అయాన్ బ్యాటరీ సెల్స్ తయారీ విభాగాన్ని మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో సుజుకీ మోటార్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ మాట్లాడుతూ.. తమ పెట్టుబడి ప్రణాళికలను వివరించారు. గత నాలుగు దశాబ్దాలుగా భారత మొబిలిటీ యానంలో సుజుకీ చురుకైన భాగస్వామిగా ఉన్నదని, పర్యావరణహితమైన హరిత మొబిలిటీని ప్రోత్సహించాలన్న భారత్ విజన్‌కు మద్దతుగా నిలుస్తుందని అన్నారు. ఏడాదికి 40 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యం సాధించడం, అందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి, ఆర్ అండ్ డీ ఏర్పాటు, కొత్త టెక్నాలజీలపై ఈ పెట్టుబడులుంటాయని మారుతి సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్‌సీ భార్గవ చెప్పారు. రూ.35,000 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్టు గత ఏడాది ప్రకటించిన రెండో ప్లాంట్ నిర్మాణం గురించిన ప్రశ్నకు స్పందిస్తూ జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం అనంతరం దానికి తాను సమాధానం చెప్పగలుగుతానన్నారు. మారుతి సుజుకీ ఇండియా భాగస్వామిగా ఉన్న సుజుకీ గ్రూప్ ఇప్పటికే దేశంలో రూ.లక్ష కోట్లు పెట్టుబడి పెట్టింది. ఈ పెట్టుబడితో అందుకు సంబంధించిన విభాగాల్లో 11 లక్షల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయని భార్గవ అన్నారు. ఈ-విటారా ఎగుమతి మార్కెట్ల కోసం తయారు చేస్తున్నామని, దేశీయ మార్కెట్లో దాన్ని విడుదల చేయడానికి నిర్దిష్ట కాల పరిమితి ఏదీ పెట్టుకోలేదని ఆయన వెల్లడించారు. ఆ కారును దేశీయ మార్కెట్లో విడుదల చేయకపోవడానికి ఎగుమతి కట్టుబాట్లతో పాటు ధర కూడా ప్రధానమని చెప్పారు. బ్యాటరీల దిగుమతి కారణంగా దేశంలో ఈవీల ధరలు అధికంగా ఉన్నాయన్నారు. గుజరాత్ ప్లాంట్‌లో తయారైన మేడ్ ఇన్ ఇండియా ఈ-విటారాను జపాన్, యూరప్ సహా 100 దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు ఆయన చెప్పారు. 10 లక్షల కార్ల తయారీ లక్ష్యంతో ఈ యూనిట్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆటోమొబైల్ తయారీ హబ్ కానుందని ఆయన వెల్లడించారు. కాగా దేశంలో తొలి లిథియం అయాన్ బ్యాటరీ తయారీ యూనిట్ ప్రారంభించడాన్ని ఒక మైలురాయిగా సుజుకీ అభివర్ణించారు.

లిథియం సరఫరానే పెద్ద సమస్య

లిథియం కోసం మనం చైనాపై అధికంగా ఆధారపడాల్సి రావడమే పెద్ద సమస్య అని, అందుకే బ్యాటరీ సెల్స్ తయారీ విభాగంలో భారీ ఎత్తున ప్రవేశించేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంలేదని భార్గవ అన్నారు. వెలుపలి సరఫరాలపై ఆధారనీయత తగ్గించుకోగల ప్రత్యామ్నాయ టెక్నాలజీలను భారత శాస్త్రవేత్తలు కనుగొనగలరన్న ఆశాభావం ఆయన ప్రకటించారు. బ్యాటరీ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయడం చాలా ఖర్చుతో కూడుకున్న పని అని పేర్కొంటూ బ్యాటరీ ప్లాంట్ ఏర్పాటుకు రూ.20,000 కోట్ల పెట్టుబడి అవసరమన్నది పరిశ్రమ అంచనా అని చెప్పారు. ప్లాంట్ ఏర్పాటుకు ఎవరైనా ముందుకు వచ్చినా ముడిసరుకు లేకపోవడం అనేది పెద్ద రిస్క్‌గా అంచనా వేయవచ్చన్నారు.

ఫార్మాపై జీఎస్‌టీని హేతుబద్ధీకరించాలి

కీలక అంశాలనూ పరిష్కరించాలి

డాక్టర్ రెడ్డీస్ చైర్మన్ సతీష్ రెడ్డి



న్యూఢిల్లీ: ప్రతిపాదిత జీఎస్‌టీ సంస్కరణలు ఫార్మా పరిశ్రమకు తోడ్పడేలా ఉండాలని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సంస్కరణలు హేతుబద్ధంగా, ఫార్మా కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేలా ఉండాలన్నారు. చాలా కాలంగా ఫార్మా కంపెనీలు ఔషధాలపై తక్కువ పన్ను, ముడి పదార్థాలపై ఎక్కువ పన్నుల సమస్యను ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తు చేశారు. దీనివల్ల ఉత్పత్తి వ్యయం పెరిగి, రోగులకూ ఔషధాలు అందుబాటు ధరల్లో లేకుండా పోతున్నాయన్నారు. త్వరలో చేపట్టే సంస్కరణలు ఈ కీలక సవాళ్లను అధిగమించేలా ఉంటాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. పన్నుల హేతుబద్ధీకరణ ద్వారా ప్రతి పౌరుడికి అత్యవసర మందుల ధర అందుబాటులో ఉండే అవకాశం ఏర్పడుతుందన్నారు. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లోనూ మన కంపెనీల పోటీ సామర్థ్యం పెరిగి సరికొత్త ఔషధాలనూ ఉత్పత్తి చేయగలుగుతామని సతీష్ రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమకు మేలు చేసే సంస్కరణల కోసం ప్రభుత్వంతో కలిపి పని చేసేందుకూ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం తుది ఔషధాలపై 12 శాతం, వాటి తయారీ కోసం వినియోగించే ముడి పదార్థాలపై 18 శాతం జీఎస్‌టీ అమల్లో ఉంది. సంస్కరణల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న నాలుగు జీఎస్‌టీ శ్లాబులను ప్రభుత్వం 5, 18 పేరుతో రెండు శ్లాబులుగా మార్చాలని యోచిస్తోంది.

దేశీ మార్కెట్లోకి లినాక్లోటైడ్ ఔషధం

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ దేశీయ మార్కెట్లోకి జెనరిక్ మలబద్ధకాన్ని తగ్గించే ఔషధం లినాక్లోటైడ్‌ను తీసుకువచ్చింది. కొలోజో బ్రాండ్ పేరుతో దీన్ని విక్రయించనుంది. ఈ ఔషధం పెద్దలు, 6 నుంచి 17 ఏళ్ల వయసు కలిగిన వారిలో తలెత్తే మలబద్ధకాన్ని నివారిస్తుందని తెలిపింది.

మార్కెట్లో మళ్లీ టారిఫ్ కల్లోలం

81,000 దిగువకు సెన్సెక్స్

రూ.5.41 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: భారతీయ వస్తువులపై అమెరికాలో బుధవారం నుంచి అమల్లోకి రానున్న 25% అదనపు టారిఫ్‌లు ఈక్విటీ మార్కెట్లలో కల్లోలం సృష్టించాయి. అదనపు టారిఫ్‌లకు సంబంధించి అమెరికా ముసాయిదా నోటీసు జారీ చేయడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు పరుగులు తీశారు. ఫలితంగా సెన్సెక్స్ 849.37 పాయింట్లు నష్టపోయి 80,786.54 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 25 నష్టాల్లోనే ముగిశాయి. ఇంట్రాడేలో సూచీ 949.93 పాయింట్లు నష్టపోయి 80,685.98 వరకు దిగజారింది. బీఎస్‌ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ ఒక్క రోజులోనే రూ.5,41,542.83 కోట్లు నష్టపోయి రూ.449 లక్షల కోట్లకు దిగజారింది. మరోవైపు నిఫ్టీ 255.70 పాయింట్ల నష్టంతో 24,712.05 వద్ద క్లోజైంది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి కూడా డాలర్ మారకంలో 13 పైసలు దిగజారి 87.69 వద్ద ముగిసింది.

నేడు మార్కెట్లకు సెలవు బుధవారం వినాయక చవితి సందర్భంగా స్టాక్ మార్కెట్లకు సెలవు. బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ సహా కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. గురువారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

ఆర్డీ ఇంజనీరింగ్ ఇష్యూకు సెబీ ఓకే

రూ.580 కోట్ల సమీకరణ లక్ష్యం

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఆర్డీ ఇంజనీరింగ్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.580 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇష్యూలో భాగంగా రూ.500 కోట్లకు కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయనుండగా ప్రమోటర్ చంద్రశేఖర్ మోటూరు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.80 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నట్లు ఐపీఓ ముసాయిదా పత్రాల్లో వెల్లడించింది. ఈ ఏడాది మార్చి నెలలో కంపెనీ ఐపీఓకి దరఖాస్తు చేసింది. ఇష్యూ ద్వారా సమీకరించిన మొత్తాల్లో రూ.279.60 కోట్లను తెలంగాణలోని సీతారాంపూర్‌లో కొత్తగా రెండు తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు వినియోగించనుంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని పరవాడలో రూ.44.8 కోట్లతో సమీకృత మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. రూ.65 కోట్ల మొత్తాలను సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనుంది.

సగ్స్ లాయడ్ ఇష్యూ ధర రూ.117-123: ఇంటిగ్రేటెడ్ ఈపీసీ కంపెనీ సగ్స్ లాయడ్ పబ్లిక్ ఇష్యూ వచ్చే శుక్రవారం ప్రారంభమై మంగళవారంతో (సెప్టెంబరు 2) ముగియనుంది. షేరు ధరల శ్రేణిని రూ.117-123గా ప్రకటించారు.

ఫ్రీడమ్ ఆఫర్ విక్రయాల్లో ఏపీకి రెండోస్థానం

బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ సీజీఎం శేషాచలం



విజయవాడ సిటీ (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ ప్రవేశ పెట్టిన ఫ్రీడమ్ ఆఫర్‌కు ఆంధ్రప్రదేశ్‌లో మంచి ఆదరణ లభిస్తోందని ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం శేషాచలం తెలిపారు. ఫ్రీడమ్ ఆఫర్ ద్వారా రూపాయికే సిమ్‌ను ఈ నెల ఒకటో తేదీ నుంచి బీఎస్ఎన్ఎల్ దేశవ్యాప్తంగా అందిస్తోందన్నారు. ఫ్రీడమ్ సిమ్ విక్రయాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని ఆయన తెలిపారు. గడిచిన 26 రోజుల్లో ఉమ్మడి 13 జిల్లాల్లో 1.21 లక్షల సిమ్‌లను విక్రయించినట్లు ఆయన చెప్పారు. అత్యధికంగా గుంటూరులో 30,179 మంది ఫ్రీడమ్ సిమ్ ఆఫర్‌ను ఉపయోగించుకున్నారని తెలిపారు. మరో ఐదు రోజులు ఈ ఆఫర్ ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 1.50 లక్షల పైబడి సిమ్‌లను విక్రయించి ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27 తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	550
వరంగల్	502	గోదావరి	540
చిత్తూరు	558	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	112
వరంగల్	98	గుంటూరు	112
కరీంనగర్	98	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	88
కర్నూలు	98	నెల్లూరు	93
విశాఖపట్నం	116	అనంతపురం	93
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,060 ▲	93,550 ▲	1,30,000 ▼
విజయవాడ	1,03,800 ▲	97,000 ▲	1,19,200 ▼
విశాఖపట్నం	1,03,940 ▲	93,050 ▲	1,30,000 ▲
రాజమండ్రి	1,02,050 ▲	93,550 ▲	1,19,500 ▲
ప్రొద్దుటూరు	1,02,250 ▲	94,070 ▲	1,19,100 ▲
ముంబై	1,00,884	92,410	1,15,870

ఏఐ మన మెదళ్లను భర్తీ చేయలేదు

స్పష్టం చేసిన లింక్డ్‌ఇన్ సర్వే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కృత్రిమ మేధ (ఏఐ) ఎంతగా అభివృద్ధి చెందినా అది మానవ మస్తిష్కానికి ప్రత్యామ్నాయం కాదని సర్వేలు చెబుతున్నాయి. వృత్తి నిపుణుల ఏఐ వినియోగంపై లింక్డ్‌ఇన్ జరిపిన ఒక సర్వేలోనూ ఇదే విషయం తేలింది. ఈ సర్వేలో పాల్గొన్న హైదరాబాద్ వృత్తి నిపుణుల్లో ప్రతి ఐదుగురిలో నలుగురు ఇదే విషయం చెప్పారు. ఇంకా ఈ సర్వేలో అనేక ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. సర్వేలో పాల్గొన్న వారిలో 78 శాతం మంది ఏఐ రైటింగ్, డ్రాఫ్టింగ్‌కు ఉపయోగపడుతుంది తప్ప, నిర్ణయాలు తీసుకునేందుకు పనికి రాదన్నారు. నిర్ణయాలు తీసుకోవడంలో ఏఐ కంటే తమ బుద్ధి లేదా సహచరులు, మేనేజర్లను నమ్ముకుంటాం తప్ప ఏఐని కాదని 83 నుంచి 88 శాతం మంది చెప్పారు. సర్వే ఇతర ప్రధాన అంశాలు..

- మరో ఉద్యోగం చూసుకోవాలంటే ఏఐపై పట్టు తప్పనిసరి అని అన్న నాలుగింట మూడు వంతుల మంది
- వేగంగా ఏఐ నేర్చుకునేందుకు 70% మంది ఆసక్తి
- ఉద్యోగులు ఏఐ నేర్చుకోవాలని కోరుతున్న 77 శాతం కంపెనీలు
- నియామకాలు, సమీక్షల్లో ఏఐపై పట్టును పరిగణనలోకి తీసుకుంటున్న 64 శాతం ఎగ్జిక్యూటివ్‌లు
- మంచి వ్యాపార నిర్ణయాలు ఏఐ ద్వారా కంటే మానవ మస్తిష్కం ద్వారానే వస్తాయని నమ్ముతున్న 83 శాతం ఎగ్జిక్యూటివ్‌లు.

స్పోర్ట్స్

చోప్రాకు కఠిన సవాల్



- రేపు డైమండ్ లీగ్ ఫైనల్
- రాత్రి 11.15 నుంచి..

న్యూఢిల్లీ: మరోసారి డైమండ్ లీగ్ (డీఎల్) టైటిల్ సొంతం చేసుకోవాలనుకొంటున్న భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు గట్టిపోటీ ఎదురుకానుంది. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో గురువారం రాత్రి జరిగే డీఎల్ ఫైనల్లో సమకాలీన ప్రత్యర్థులు.. డిఫెండింగ్ చాంప్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జూలియన్ వెబర్ (జర్మనీ) కూడా బరిలో నిలవనున్నారు. రెండు ఒలింపిక్ పతకాలు నెగ్గిన చోప్రా సెలెసియా, బ్రస్సెల్స్‌లో జరిగిన డైమండ్ లీగ్‌ల్లో పాల్గొనలేదు. దోహా, పారిస్ ఈవెంట్లలో బరిలోకి దిగిన నీరజ్ నాలుగో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. గత మేలో దోహాలో జరిగిన ఈవెంట్‌లో చోప్రా 90.23 మీటర్ల దూరం విసిరినా.. వెబర్ తర్వాత రెండో స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2022లో డైమండ్ లీగ్ టైటిల్ నెగ్గిన చోప్రా.. 2023, 2024లో రన్నరప్‌గా నిలిచాడు.

సిఫ్ట్ కౌర్ డబుల్ గోల్డ్

ఆసియా షూటింగ్



షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో సిఫ్ట్ కౌర్ సమ్రా డబుల్ ధమాకా సృష్టించింది. వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో స్వర్ణాలు కొల్లగొట్టింది. మంగళవారం జరిగిన మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్లో చైనా షూటర్ యాంగ్ యూజీ (458.8 పాయింట్లు)ని ఓడించిన కౌర్ (459.2) పసిడి నెగ్గింది. ఇక, టీమ్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్, ఆషి చోక్సీ, అంజుమ్ మౌద్గిల్ త్రయం ఫైనల్లో 1753 పాయింట్లతో టాప్‌లో నిలిచి పసిడి పతకాన్ని నెగ్గింది. మరోవైపు జూనియర్ మహిళల 50 మీ. రైఫిల్ 3 పొజిషన్స్‌లో అనుష్క వ్యక్తిగత స్వర్ణంతో పాటు ప్రాచీ గైక్వాడ్, మహిత్ సంధుతో కలిసి టీమ్ పసిడిని కూడా సొంతం చేసుకొంది. పురుషుల 25 మీ. ర్యాపిడ్ ఫైర్ టీమ్ ఈవెంట్‌లో సూరజ్, అభినవ్, సమీర్‌ల టీమ్ బంగారు పతకం సాధించగా.. ఇదే ఈవెంట్‌లో సమీర్‌కు వ్యక్తిగత కాంస్యం దక్కింది. మహిళల ట్రాప్‌లో హరీస్, ఆద్య కత్యాల్ స్వర్ణ, రజతాలు గెలిచారు. ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో సబీరా, ఆద్య, భవ్య త్రిపాఠిల త్రయం, పురుషుల్లో అర్జున్, ఆర్యవంశ్, ఉద్ధవ్ రాథోడ్‌ల టీమ్‌లు బంగారు పతకాలు కొల్లగొట్టాయి. ఆర్యవంశ్ వ్యక్తిగత విభాగంలో రజతం సాధించాడు.

అల్కారజ్ అలవోకగా..



యూఎస్ ఓపెన్

- రెండో రౌండ్‌కు స్వియటెక్, రూడ్
- కీస్, స్విటోలినా, వీనస్ ఇంటిబాట

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో రెండో రోజు పురుషుల సింగిల్స్ బరిలోకి దిగిన స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కారజ్‌తో పాటు కాస్పర్ రూడ్, ఖచనోవ్, ఆండ్రీ రుబ్లెవ్, హోల్గర్ రూన్, ఫ్రాన్సెస్ టియాఫోలాంటి సీడెడ్‌లంతా రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. మహిళల్లో మాత్రం ఆరో సీడ్ మాడిసన్ కీస్, ఉక్రెయిన్ స్టార్ స్విటోలినా, వెటరన్ ఏస్ వీనస్ విలియమ్స్ ఆరంభంలోనే ఇంటిబాట పట్టారు. స్థానిక ఆటగాడు రిలీ ఓపెల్కాతో జరిగిన పోరును మాజీ చాంపియన్ అల్కారజ్ 6-4, 7-5, 6-4తో వరుససెట్లలో ముగించాడు. కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌ను మూడేళ్ల క్రితం (2022) ఇక్కడే నెగ్గిన 22 ఏళ్ల అల్కారజ్.. గ్రాండ్‌స్లామ్స్‌లో తొలి రౌండ్ విజయాల రికార్డును 19-0తో మరింత పదిలం చేసుకున్నాడు. 11వ సీడ్ రూన్ 6-3, 7-6 (4), 7-6 (2)తో బొటిక్ వాన్‌పై, 12వ సీడ్ రూడ్ 6-1, 6-2, 7-6 (5)తో సెబాస్టియన్‌పై, 15వ సీడ్ రుబ్లెవ్ 6-4, 6-4, 6-4తో ప్రిజ్‌మిక్‌పై, 17వ సీడ్ టియాఫో 6-3, 7-6 (6), 6-3తో నిషిఒకపై గెలిచారు.

కీస్.. 89 తప్పిదాలు: ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గి జోరుమీదున్న అమెరికా స్టార్ క్రీడాకారిణి మాడిసన్ కీస్‌కు సొంతగడ్డపై మాత్రం చుక్కెదురైంది. మెక్సికోకు చెందిన 82వ ర్యాంకర్ రెనటా జరజువా 6-7 (12), 7-6 (3), 7-5తో కీస్‌ను కంగుతినిపించి రెండో రౌండ్ చేరింది. 3 గంటలా పది నిమిషాల హోరాహోరీ పోరులో కీస్.. 89 అనవసర తప్పిదాలు, 14 డబుల్ ఫాల్ట్స్ చేసి మ్యాచ్‌ను చేజార్చుకుంది. గతంలో ఇక్కడ రెండుసార్లు విజేతగా నిలిచిన 45 ఏళ్ల వీనస్‌ను 11వ సీడ్ ముచోవా 6-3, 2-6, 6-1తో ఓడించింది. 12వ సీడ్ స్విటోలినా 2-6, 4-6తో అన్నా బొండర్ చేతిలో చిత్తయింది. రెండో సీడ్ స్వియటెక్ 6-1, 6-2తో ఎమిలియానో అరంగానును, ఐదో సీడ్ ఆండ్రీవ 6-0, 6-1తో అలిసియాను, 15వ సీడ్ కసత్కినా 7-5, 6-1తో ఎలెనాను, సక్కారి 6-3, 6-2తో మరియాను ఓడించి రెండో రౌండ్లో ప్రవేశించారు.

వావ్.. వాంగ్: హాంకాంగ్‌కు చెందిన 21 ఏళ్ల కోల్‌మన్ వాంగ్ 6-4, 7-5, 7-6 (4)తో అలెగ్జాండర్‌ను ఓడించి రెండో రౌండ్ చేరాడు. ఈ క్రమంలో ఓపెన్ ఎరా (1968 నుంచి)లో గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ మ్యాచ్ నెగ్గిన తొలి హాంకాంగ్ ఆటగాడిగా వాంగ్ చరిత్ర సృష్టించాడు.

పోరాడి ఓడిన బసవా రెడ్డి

అమెరికాకు చెందిన తెలుగు సంతతి ఆటగాడు నిశేష్ బసవా రెడ్డి తొలి రౌండ్లోనే వెనుదిరిగాడు. 9వ సీడ్ ఖచనోవ్‌తో జరిగిన పోరులో తొలి సెట్ గెలిచిన బసవా రెడ్డి 7-6 (5), 3-6, 5-7, 1-6తో ఓడాడు. నెల్లూరు జిల్లాకు చెందిన బసవా రెడ్డి కుటుంబం అమెరికాలో స్థిరపడింది.

స్టయిల్ అదిరింది

అల్కారజ్ ఈ గ్రాండ్‌స్లామ్‌కు విభిన్నమైన గెటప్‌లో దర్శనమిచ్చి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఎప్పటిలా సాధారణ హెయిర్ కట్‌లో గాకుండా ఈసారి గుండు చేయించుకున్నాడు. గతానికి కాస్త భిన్నంగా స్లీవ్‌లెస్ టీ షర్ట్ ధరించిన అతను.. పూర్తిగా హెయిర్ కట్ చేయించుకొని తొలి రౌండ్ మ్యాచ్‌లో పోటీపడ్డాడు. మ్యాచ్ అనంతరం తన కొత్త హెయిర్ స్టయిల్‌పై అల్కారజ్ మాట్లాడుతూ.. 'నా సోదరుడు తన బార్బర్ నైపుణ్యాలను చూపించాడు. టోర్నీ ఆరంభానికి ముందు మెషీన్‌తో నా హెయిర్ కట్‌ను సరిచేసే క్రమంలో ఇలాగైంది. ఇది చాలామందికి నచ్చిందనే అనుకుంటున్నా. ఏమంటారు.. మీరంతా?' అని ప్రేక్షకులను అడిగాడు. వారంతా.. సూపర్బ్ అని గట్టిగా అరవడంతో.. 'ఇది బాగుందని మీరు అంగీకరిస్తున్నారు' అని అల్కారజ్ గట్టిగా నవ్వాడు. అయితే, సహచర ఆటగాడు ఫ్రాన్సెస్ టియాఫో మాత్రం.. 'వామ్మో.. భయంకరంగా ఉంది. అయినా, ఇదో రకం స్టయిల్ అనుకోవడమే' అని అనడం గమనార్హం.



సింధు, ప్రణయ్ ముందంజ

వరల్డ్ చాంపియన్‌షిప్

పారిస్: బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత ఏస్ షట్లర్లు పీవీ సింధు, హెచ్ఎస్ ప్రణయ్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో మాజీ చాంపియన్ సింధు 23-21, 21-6తో కలోయనా నల్బంటోవా (బల్గేరియా)పై వరుస గేమ్‌ల్లో గెలిచింది. తొలి గేమ్ ఆరంభంలో తడబడిన సింధు 0-4తో వెనుకబడింది. అయితే, 2-6తో ఉన్న సమయంలో నల్బంటోవా తప్పిదాలతో సింధు 5-7తో ఆధిక్యం తగ్గించింది. కానీ, బల్గేరియా షట్లర్ 11-7తో బ్రేక్‌కు వెళ్లింది. తిరిగి వచ్చిన తర్వాత పవర్‌ఫుల్ స్మాష్‌లతో విరుచుకుపడ్డ సింధు 12-12తో స్కోరు సమం చేసింది. 20-20 వద్ద మరోసారి స్కోరు సమం చేసిన సింధు.. గేమ్‌ను తన ఖాతాలో వేసుకొంది. రెండో గేమ్‌లో సింధు జోరుకు నల్బంటోవా చేతులెత్తేసింది. ఇక పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో ప్రణయ్ 21-18, 21-15తో జొయాకిమ్ ఓల్డోర్ఫ్ (ఫిన్లాండ్)పై సులువుగా నెగ్గాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-రుత్విక శివాని జోడీ 18-21, 21-16, 21-18తో లియాంగ్-వెంగ్ చి నెగ్‌పై గెలిచి ముందంజ వేసింది.



'జోర్డాన్, బ్రయాంట్' కార్డుకు వేలంలో రూ. 113 కోట్లు

న్యూయార్క్: అమెరికా బాస్కెట్‌బాల్ దిగ్గజాలు మైకేల్ జోర్డాన్, కోబ్ బ్రయాంట్ మరోసారి చరిత్ర సృష్టించారు. ఈసారి బాస్కెట్‌బాల్ కోర్టులో కాదు.. బయట. ఈ ఇద్దరూ సంతకాలు చేసిన బాస్కెట్‌బాల్ కార్డుకు వేలంలో ఏకంగా రూ. 113 కోట్ల ధర పలకడం విశేషం. 2007-08లో జోర్డాన్, బ్రయాంట్ ధరించిన జెర్సీలు, వాళ్ల సంతకాలతో కూడిన లోగోను ముద్రించిన ఆ కార్డును ఈనెల 23న వేలం వేశారు. క్రీడా చరిత్రలో వేలంలో ఓ కార్డుకు ఇంత ధర పలకం ఇదే తొలిసారి. ఈ క్రమంలో 2022లో బేస్‌బాల్ దిగ్గజం మికీ మాంటెల్ సంతకంతో కూడిన కార్డుకు పలికిన రూ. 110 కోట్ల ధర రికార్డును జోర్డాన్, బ్రయాంట్ కార్డు అధిగమించారు. కాగా బ్రయాంట్ 2020లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే.

సత్తాచాటిన నయనశ్రీ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఆసియా ఓపెన్ షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో తెలుగమ్మాయి తాళ్లూరి నయనశ్రీ నాలుగు పతకాలు సాధించింది. డెహ్రాడూన్‌లో జరిగిన ఈ పోటీల్లోని స్పీడ్ స్కేటింగ్ 500, 1500 మీటర్లలో కాంస్యాలు, 1000 మీ.లో రజతం, 3000 మీటర్లలో రజతం సాధించింది. ఖమ్మంకు చెందిన నయనశ్రీ ఈ ప్రదర్శనతో జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించడం విశేషం.

పుజార పెన్షన్ రూ. 70వేలు

న్యూఢిల్లీ: చటేశ్వర్ పుజార ఇటీవలే క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. దీంతో ఇప్పుడ తనికి పెన్షన్ రూపంలో బీసీసీఐ నుంచి నెలకు ఎంత లభిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. అయితే, 103 టెస్టులు ఆడిన పుజారకు అప్పర్ టైర్ (ఎక్కువ టెస్టులు ఆడడం) నిబంధనల ప్రకారం బీసీసీఐ నెలకు రూ. 70 వేలు చెల్లిస్తుంది.

పవర్‌లిఫ్టింగ్‌లో సాదియాకు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ జూనియర్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో మంగళగిరి యువ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా అల్మాస్ కాంస్యం కొల్లగొట్టింది. మంగళవారం జరిగిన ఈ పోటీల్లోని 57 కిలోల విభాగంలో సాదియా మొత్తం 470 కిలోల బరువెత్తి తృతీయ స్థానంలో నిలిచింది. డెడ్‌లిఫ్ట్‌లో రజతం, ఓవరాల్‌గా కాంస్యం దక్కించుకుంది.

ఆంధ్రను వీడిన విహారి

వచ్చే సీజన్‌నుంచి త్రిపుర తరపున బరిలోకి

ఏసీఏ నుంచి సహకారం లేదన్న హనుమ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): వైసీపీ ప్రభుత్వంలో అనేక అవమానాలనెదుర్కొని ఆంధ్ర క్రికెట్ జట్టును వీడి.. మళ్లీ వెనక్కివచ్చిన హనుమ విహారి తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకున్నాడు. వచ్చే సీజన్‌లో త్రిపుర తరపున ఆడేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆంధ్ర సీనియర్ జట్టు బాధ్యతలు పూర్తిగా తనకే అప్పగిస్తామని పెద్దలు చెప్పినా అలా జరగలేదని విహారి వాపోయాడు. ఏసీఏలో పెద్దగా మార్పులేమీ రాలేదని, అప్పుడు, ఇప్పుడు ఒకేలా ఉందని అన్నాడు. తనకు వైట్‌బాల్ క్రికెట్‌లో అవకాశం ఇస్తారన్న నమ్మకం లేదన్నాడు. మరోవైపు తనకు త్రిపుర నుంచి ప్రతిపాదన వచ్చిందని తెలిపాడు. దీంతో తాను ఏసీఏను నిరభ్యంతర పత్రం కావాలని అడిగానని, వారు మంజూరు చేశారని చెప్పాడు. ఇక, దీనిపై ఏసీఏ కార్యవర్గంలోని ఒక కీలక సభ్యుడు స్పందిస్తూ గత సీజన్‌లో విహారికి అన్ని మ్యాచ్‌లు ఆడేందుకు అవకాశం ఇచ్చామని తెలిపారు. 'యువ క్రికెటర్లకు అవకాశం ఇవ్వాలని విహారి కోరినందునే సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీకి విహారిని ఎంపిక చేయలేదు. ఏపీఎల్‌లో అద్భుతంగా ఆడినందున అతడికి ఈ సీజన్‌లో అన్ని ఫార్మాట్లలో అవకాశం ఇవ్వాలని అనుకున్నాం. కానీ, మమ్మల్ని సంప్రదించకుండా ఏకపక్షంగా త్రిపుర వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాడు' అని ఆ కార్యవర్గ సభ్యుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



2 గంటల్లో 7,730 మట్టి ప్రతిమలు!

విద్యార్థులు, 20 స్వచ్ఛంద సంస్థల ప్రపంచ రికార్డు

విజయవాడ సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంతో పాటు నగరంలోని పలు విద్యాసంస్థల్లో మంగళవారం నిర్వహించిన గణపతి మట్టి ప్రతిమల తయారీ కార్యక్రమం ప్రపంచ రికార్డును నెలకొల్పింది. పండుగలు పర్యావరణ హితం కావాలనే ఉద్దేశంతో విద్యా, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపు మేరకు 20 పాఠశాలల విద్యార్థులు, 20 స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని 2గంటల వ్యవధిలోనే మట్టితో 7,730 గణేశుడి విగ్రహాలను తయారు చేశారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్)కు చెందిన పర్యవేక్షకులు తయారీ విధానం, ప్రతిమల సంఖ్యను వీడియో, ఫొటోలు తీసి లండన్‌కు పంపారు. గతంలో 4,464ప్రతిమలు తయారు చేసి మహారాష్ట్ర నెలకొల్పిన రికార్డును ఎన్టీఆర్ జిల్లా అధిగమించింది. ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన కార్యక్రమ వేదికపై మంత్రి సత్యకుమార్, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), కలెక్టర్‌కు వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రాన్ని ఆ సంస్థ జాయింట్ సెక్రటరీ ఎలియాజర్ అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమా, పీసీబీ ఛైర్మన్ పి.కృష్ణయ్య, అధికారులు పాల్గొన్నారు.



బిఎంజె స్టేడియంలో తయారు చేసిన మట్టి గణపతి విగ్రహంతో కలెక్టర్ లక్ష్మీశ, పక్కన వరల్డ్ రికార్డు పత్రం

సచివాలయంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ



వినాయక చవితిని పురస్కరించుకుని 'మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అంటూ మంగళవారం అమరావతి సచివాలయంలో మట్టి వినాయక విగ్రహాలను పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేషీ అధికారులు, రాష్ట్ర కాలుష్య నివారణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ విగ్రహాలను పంపిణీ చేశారు.

- అమరావతి,ఆంధ్రజ్యోతి

పర్యావరణ హితంగా వినాయక చవితి

» ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. గణేశ్ చతుర్థి సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రత్యేక సందేశాలతో రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఇంటి పెరటిలోనే నిమజ్జనం చేసుకునేలా మట్టి గణపతి, విత్తన గణపతి ప్రతిమలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల్లో జిప్సమ్, గంధకం, మెగ్నీషియం వంటివి ఉంటాయని, అవి నీటిలో కలిసి, పెద్ద ఎత్తున నీటి కాలుష్యంతో ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. పీసీబీ ఛైర్మన్ పి.కృష్ణయ్య, పీసీబీ సభ్య కార్యదర్శి శరవణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు గవర్నర్ వినాయక చవితి శుభాకాంక్షలు

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. 'శాంతి, శ్రేయస్సు, సామరస్యంతో కూడిన జీవితాన్ని గడపడానికి విఘ్నేశ్వరుడు మనందరికీ ఆశీస్సులను అందించాలని ప్రార్థిస్తున్నా' అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు కాల్ లెటర్లు

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో మెరిట్ అభ్యర్థులకు పాఠశాల విద్యాశాఖ మంగళవారం కాల్‌లెటర్లు విడుదల చేసింది. అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌లలో అందుబాటులో ఉంచింది. సర్టిఫికెట్ల పరిశీలనపై ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించింది. గురువారం ఉదయం 9 గంటల నుంచి అన్ని జిల్లాల్లో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ప్రారంభం కానుంది. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరిశీలనకు హాజరుకావాలి. సరైన పత్రాలు సమర్పించని, వారి స్థానంలో తర్వాత మెరిట్ అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలవనున్నారు.

రాష్ట్ర అతిథులుగా మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్లుగా పని చేసిన వారందరినీ రాష్ట్ర అతిథులుగా ప్రభుత్వం కొనసాగించనుంది. మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ విన్నపం మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్ర ఎన్నికల కమిషనర్లుగా పని చేసిన వారందరూ రాష్ట్ర అతిథులుగానే పరిగణిస్తుంది. ఈ ప్రొటోకాల్‌ను కొనసాగిస్తున్నట్లు సీఎస్ కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వచ్చే నెలలో 3 లక్షల ఇళ్లు ప్రారంభం: కొలుసు

» మరో 50 వేల ఇళ్లకు శంకుస్థాపనలు: మంత్రి పార్థసారథి

రాజమహేంద్రవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తమ ప్రభుత్వం వచ్చాక నిర్మించిన 3 లక్షల ఇళ్లకు ప్రారంభోత్సవం.. మరో 50 వేల ఇళ్లకు శంకుస్థాపనల్ని వచ్చే నెలలో సీఎం చంద్రబాబు చేస్తారని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలపై పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సర్వే జరుగుతోందని, ఎవరికి ఇల్లు అవసరమో ఈ సర్వేలో గుర్తిస్తామన్నారు. రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన మాజీ సీఎం జగన్ ఇప్పటికీ ప్రజలు, రాష్ట్రం గురించి ఆలోచించడం లేదన్నారు.

'అందరికీ ఇళ్లు' అమలుకు మంత్రుల కమిటీ

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): 'అందరికీ ఇళ్లు' కార్యక్రమం అమలును పర్యవేక్షించడానికి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది. గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఈ బృందంలో సభ్యులుగా నియమించింది.

ప్రణాళికాబద్ధంగా ఖాళీల భర్తీ: సత్యకుమార్

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో ఖాళీలను ప్రణాళికాబద్ధంగా భర్తీ చేయాలని ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఆరోగ్యశాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశాఖలో వివిధస్థాయిల్లో మంజూరైన పోస్టులు, విభాగాల వారీగా ఖాళీలపై ఆయన ఆరా తీశారు. గతేడాది జూన్ నుంచి చేపట్టిన నియామకాల వివరాలు తెలుసుకున్నారు. ఆయుష్, ఏపీ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎంఎస్ఐడీసీ), ఆహార పదార్థాల కల్తీ నిరోధక విభాగాల్లో భారీగా ఉన్న ఖాళీలను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో వాట్సాప్ గవర్నెన్స్ ప్రవేశపెడితే.. రిపోర్టులు వెంటనే రోగులకు పంపడం సులువుగా ఉంటుందని చెప్పారు. కాగా, ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహంను మంత్రి సత్యకుమార్ అభినందించారు. వివాదరహితుడిగా పేరుగాంచారని అన్నారు.

హౌసింగ్‌లో ఏడుగురు డీఈఈలకు పదోన్నతి

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో ఏడుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు పదోన్నతులు లభించాయి. జగ్గంపేట డీఈఈ వేణుగోపాలస్వామి, వినుకొండ డీఈఈ ఎస్.శ్రీనివాస్, గుంటూరు తూర్పు డివిజన్ డీఈఈ యూవీఎస్‌వీ ప్రసాద్, ఉంగుటూరు డీఈఈ డి.రామాకాంతరావు, నూజివీడు డీఈఈ జీవీ విశ్వేశ్వరరావు, నగిరి డీఈఈ కె.శంకరప్ప, మచిలీపట్నం డీఈఈ బి.బుజ్జిబాబులకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సంక్షేమ హాస్టళ్లకు కాస్మెటిక్ కిట్లు

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలకు బదులుగా కాస్మెటిక్ కిట్‌లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కిట్లు ఇవ్వడం వల్ల విద్యార్థులకు ఉపయోగం ఉంటుందని పలువురు అధికారులు చేసిన సూచనలతో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వీటిలో హెయిర్ ఆయిల్, టూత్‌పేస్ట్, బ్రష్, పౌడర్, షాంపూ, బాత్/డిటర్జెంట్ సోప్స్, శానిటరీ నాపికిన్ ఉంటాయి.

డిగ్రీ అడ్మిషన్ల కౌన్సెలింగ్ గడువు పొడిగింపు

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్ల కౌన్సెలింగ్ గడువును ఉన్నత విద్యామండలి పొడిగించింది. మొదటి షెడ్యూలు ప్రకారం మంగళవారంతో రిజిస్ట్రేషన్ల గడువు ముగియనుంది. అయితే ఇంకా చాలా మంది విద్యార్థులు నమోదు చేసుకోకపోవడంతో గడువును పొడించింది. సవరణ షెడ్యూలు ప్రకారం సెప్టెంబరు 1 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 2వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపికకు గడువు ఉంది. 6న సీట్లు కేటాయింపు జరుగుతుంది. 8 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఉపాధ్యాయ అవార్డులపై రాష్ట్రస్థాయి కమిటీ

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు రాష్ట్రస్థాయి కమిటీని నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా విద్యాశాఖ మంత్రి, వైస్ ఛైర్మన్‌గా విద్యాశాఖ కార్యదర్శి, కన్వీనర్‌గా ఆ శాఖ డైరెక్టర్ వ్యవహరిస్తారు. సభ్యులుగా ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, మైసూర్ ఆర్ఐఈ ప్రొఫెసర్ మల్లిగాంధీ ఉన్నారు. ఇదిలా వుంటే, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన మాదాబత్తుల తిరుమల శ్రీదేవికి మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. ఉత్తమ టీచర్‌గా ఎంపిక కావడం రాష్ట్రానికే గర్వకారణమని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

పీ4లో బ్యాంకర్లూ భాగం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాధాన్యతలను చంద్రబాబు బ్యాంకర్లకు వివరించారు. 'గతంలో వన్ ఫ్యామిలీ- వన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అంటూ ప్రచారం చేశాం. ఇప్పుడు వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అనే నినాదంతో పని చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో మహిళలకు పెద్దపీట వేయాలని నిర్ణయించాం. వచ్చే ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాటికి లక్ష మంది మహిళలను పారిశ్రామివేత్తలుగా తీర్చిదిద్దేలా కార్యాచరణ సిద్ధం చేశాం. దీనికి బ్యాంకర్లు సహకరించాలి. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. డ్వాక్రా మహిళలకు బ్యాంకర్లు ఆనాడు ఏ విధంగా సహకరించారో.. దీనిక్కూడా సహకరించాలి. అలాగే యువత, మహిళా పారిశ్రామివేత్తలను ప్రోత్సహించేలా రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ ప్రాంతీయ కార్యాలయాలు ప్రారంభిస్తున్నాం. ఈ హబ్‌లకు ఆయా ప్రాంతాల్లో ఉండే బ్యాంకుల ప్రతినిధులను అనుసంధానించాలి' సీఎం కోరారు. ఉన్నత విద్యకు బ్యాంకర్లు తమ వంతు సాయం అందించాలని, తక్కువ వడ్డీలకు రుణాలివ్వడం, తక్కువ కిస్తీల వెసులుబాటు కలిగించాలని కోరారు.

> "సరైన పత్రాలు లేనివారికి రుణాలు ఇవ్వాలని (ఫాల్స్ లెండింగ్) ఎవ్వరూ సిఫారసు చేయరు. ఉత్పాదకత లేని రుణాలు కూడా మంచివి కావు. కానీ, పేదలు- ధనికుల మధ్య అంతరాలు తగ్గించేందుకు చర్యలు అవసరం. దీనికోసం పీ-4 కార్యక్రమం చేపట్టాం. ఈ ప్రక్రియలో బ్యాంకర్లు కూడా భాగస్వాములు కావాలి."
> - చంద్రబాబు

బ్యాంకర్ల సమావేశాలు ఫలితాలివ్వాలి

బ్యాంకర్ల సమావేశాలు అర్థవంతంగా జరగాలని, ఫలితాలిచ్చేలా ఉండాలని చంద్రబాబు అన్నారు. రొటీన్ సమావేశాల వల్ల ప్రయోజనం ఉండదన్నారు. "ఖరీఫ్ సీజన్ ఇప్పటికే సగం గడిచింది. ఈ పాటికే రైతులకు రుణాలివ్వాల్సి ఉంది. ప్రపంచమంతా వేగంగా మారిపోతోంది. బ్యాంకర్లూ మారాలి. జీఎస్టీలో సంస్కరణలను కేంద్రం తెచ్చింది. నెక్స్ట్ జనరేషన్ ఆఫ్ రిఫార్మ్స్ రావాలి. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజలను నియంత్రించేలా కాకుండా.. ప్రోత్సహించేలా ఉండాలని తెలిపారు. "పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు.. అన్ని రకాల రవాణా సౌకర్యాలకు సంబంధించి భారీ ప్రాజెక్టులు చేపట్టబోతున్నాం. ఏపీకి అతిపెద్ద తీర ప్రాంతం ఉంది. లాజిస్టిక్స్ రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయి. లాజిస్టిక్స్ సౌకర్యాలను మరింత విస్తరించేందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నాం. లాజిస్టిక్స్ వ్యయం ప్రస్తుతం 14% ఉంది. ఈ వ్యయాన్ని సింగిల్ డిజిట్‌కు తగ్గించేలా ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు రావాలి. ఐఐఎఫ్‌సీఎల్ వంటి ఆర్థిక సంస్థలు, బ్యాంకర్లు సహకరించాలి. ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఫండింగ్ ఇవ్వడానికి బ్యాంకర్లు ముందుకు రావాలి" అని కోరారు.

అమరావతిలో ఆర్థిక జిల్లా ఏర్పాటు

రాజధాని అమరావతిలో బ్యాంకులు తమ ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేయాలని చంద్రబాబు బ్యాంకర్లను కోరారు. "బ్యాంకులన్నీ కలిసి ఆర్థిక జిల్లాను ఏర్పాటు చేయాలి. అమరావతిలో ఐకానిక్ భవనాలు నిర్మించండి. బ్యాంకులకు అవసరమైన భూమిని కేటాయిస్తాం. రెండేళ్లలో అమరావతిలో బ్యాంకులు తమ కార్యాలయాలను నిర్మించాలి. అమరావతి రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలి. వారిని ఎలాంటి ఇబ్బంది పెట్టొద్దు" అని కోరారు. కౌలు రైతులకు రుణాలివ్వాలని సూచించారు. "బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాలకోసం వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి. పీఎం సూర్యఘర్ వంటి పథకాన్ని అత్యంత ప్రాధాన్యతాంశంగా గుర్తించాలి" అని కోరారు.

జూన్ వరకు రూ. 2,47,919 కోట్ల రుణాలు

వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా ఈ ఏడాది అన్ని రంగాలకు కలిపి రూ.6.60లక్షల కోట్ల రుణం లక్ష్యంగా పనిచేస్తున్నామని బ్యాంకర్లు తెలిపారు. ఇందులో ఈ ఏడాది జూన్ వరకు రూ2,47,919కోట్ల మేర రుణాలిచ్చినట్లు సీఎంకు వివరించారు. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.94,666కోట్లు (లక్ష్యం రూ.3.06లక్షల కోట్లు) ఎంఎస్ఎంఈ రంగానికి రూ.49,831 కోట్లు (లక్ష్యం రూ.1.28లక్షలకోట్లు), ప్రాధాన్యతరంగానికి రూ.1,47,641కోట్లు (లక్ష్యం రూ.4.58లక్షల కోట్లు), ప్రాధాన్యేతర రంగానికి రూ.1,00,278 కోట్ల రుణాలిచ్చినట్లు తెలిపారు. సమావేశంలో సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఎస్ఎల్‌బీసీ ఛైర్మన్ నితీశ్ రంజన్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

పంచాయతీలకు 1,120 కోట్లు

సెప్టెంబరు మొదటి వారంలో విడుదల

ఆర్థిక సంఘం నిధులపై సీఎం హామీ

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడి

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను సెప్టెంబరు మొదటి వారంలో విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక సంఘం నిధులను సకాలంలో విడుదల చేసినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో పంచాయతీల అభివృద్ధికి అన్ని విధాలుగా కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. ఈ నిధుల అంశంపై ఈనెల 15న పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని సర్పంచులు సంప్రదించారని, పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,120 కోట్లు సెప్టెంబరు మొదటి వారం నాటికి అన్ని పంచాయతీలకు విడుదల చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

భూమనను తిరుపతి నుంచి తరిమికొట్టాలి

» టీటీడీపై బురదజల్లితే ఊరుకునేది లేదు

» టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరిక

తిరుపతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంపై ప్రతిరోజూ బురదజల్లుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి తిరుపతిలో ఉండేందుకు అర్హుడు కాదని, ఆయనను నగరం నుంచి తరిమికొట్టాలని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో ఆయన టీటీడీ సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాశ్‌రెడ్డి, తుడా ఛైర్మన్, టీటీడీ ఎక్స్ అఫిషియో సభ్యుడు డాలర్స్ దివాకర్‌రెడ్డి, జేఈవో వీరబ్రహ్మంతో కలిసి మీడియాతో మాట్లాడారు. టీటీడీపై జరుగుతున్న విషప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. టీటీడీపై బురదజల్లితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వాస్తవానికి తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా శేషాచలం కొండ కింద ఒబెరాయ్ హోటల్‌కు స్థలాన్ని కేటాయించింది వైసీపీయేనని గుర్తు చేశారు. స్థలాన్ని వెనక్కి తీసుకోవాలని 2024 నవంబరు 18న టీటీడీ బోర్డు సమావేశంలో తాము తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. అయితే, మరోచోట భూమి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. కానీ, ప్రైవేటు సంస్థలకు టీటీడీ భూములు ధారాదత్తం చేస్తోందని భూమన ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

29న పోలవరానికి విదేశీ నిపుణులు

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం గ్యాప్-1 నిర్మాణ పనుల పరిశీలనకు విదేశీ నిపుణులు ఈ నెల 29న రానున్నారు. అమెరికాకు చెందిన జియాస్ ఫ్రాన్కో డి సిస్కో, డేవిడ్ బి.పాల్, కెనడాకు చెందిన రిచర్డ్ డొనెల్లీ పోలవరం ప్రాంతంలో పర్యటించనున్నారు. వీరితో పాటు కేంద్ర జలశక్తి శాఖ డిప్యూటీ కమిషనర్ గౌరవ్ సింఘాల్, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజనీర్ ఎస్ఎస్ బక్షి, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సభ్యకార్యదర్శి రఘురాం, జలసంఘం డైరెక్టర్ రాజేశ్ తొటేజా, సీఎస్ఎంఆర్ఎస్‌కు చెందిన మనీశ్ గుప్తా కూడా పోలవరానికి వస్తున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ దాకా ఈ బృందాలు అక్కడ పర్యటిస్తాయి.

బడి వచ్చిందోచ్!

» నెరవేరిన 30 ఏళ్ల రామాంజనేయపురం కల

» 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక

» విద్యామంత్రి లోకేశ్‌కు గ్రామస్థుల కృతజ్ఞతలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రామాంజనేయపురంలో ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న పాఠశాల

బెల్లంకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం రామాంజనేయపురం బడి కల ఎట్టకేలకు తీరింది. రెండు రోజుల్లో పాఠశాలను గ్రామంలో తెరుస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు ప్రకటించారు. నిజానికి, తమ గ్రామంలో పాఠశాల ఏర్పాటు కోసం 3 దశాబ్దాలుగా ఊరి జనం పోరాడుతూనే ఉన్నారు. పిల్లలు చదువుల కోసం అడవిబాటలో 6 కిమీ నడిచి పొరుగూరుకు వెళుతున్న వైనం.. ఈ క్రమంలో ప్రమాదాలకు గురవుతున్న తీరును 'చదువు వారికి సాహసమే' అనే శీర్షికన ఈ నెల 16న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఈ కథనం అధికారులను, స్థానిక నాయకులను కదిలించింది. రామాంజనేయపురంలో పాఠశాల ఏర్పాటు చేయిస్తానంటూ ఈ కథనంపై అప్పట్లోనే పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్పందించారు. అన్నట్టే రామాంజనేయపురం సమస్యను విద్యా మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి ఆదేశాలతో తాజాగా కలెక్టర్ అరుణ్ బాబు మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వైసీపీ హయాంలో నిర్మించి ఖాళీగా వదిలేసిన పాఠశాల భవనాన్ని ఆయన పరిశీలించారు. ఇద్దరు ఉపాధ్యాయులతో పాఠశాలను ప్రారంభించనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. ఈ విషయం తెలియగానే.. ఊరి జనం సంబరాలు చేసుకున్నారు. మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా అధ్యాపకులకు జాతీయ అవార్డులు

» విజయలక్ష్మి, దేవానంద్ కుమార్ ఎంపిక

» ఉన్నత, సాంకేతిక విద్య విభాగంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



ప్రొఫెసర్ అయ్యర్ విజయలక్ష్మి



డాక్టర్ మెండా దేవానంద్ కుమార్

న్యూఢిల్లీ/విజయవాడ/మైలవరం/మండవల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఇద్దరు అధ్యాపకులు జాతీయ అవార్డులకు ఎంపికయ్యారు. ప్రొఫెసర్ అయ్యర్ విజయలక్ష్మి(స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ), డాక్టర్ మెండా దేవానంద్ కుమార్ (డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మైలవరం)ను కేంద్రం ఉన్నత, సాంకేతిక విద్య విభాగంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. 2025 సంవత్సరానికి గానూ మంగళవారం కేంద్ర విద్యాశాఖ.. దేశవ్యాప్తంగా వివిధ ఉన్నత విద్యాసంస్థలు, పాలిటెక్నిక్ కళాశాలలలో పనిచేస్తున్న 21 మంది అధ్యాపకులకు ఈ అవార్డులను ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు చొప్పున నలుగురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ప్రొఫెసర్ సాంకేత్ గోయల్(బిట్స్‌పిలానీ, హైదరాబాద్), ప్రొఫెసర్ వినిత్ ఎన్‌బీ(ఐఐటీ, హైదరాబాద్) ఈ అవార్డులు స్వీకరించనున్నారు. సెప్టెంబరు 5న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. ఆర్కిటెక్చర్ విభాగంలో ప్రొఫెసర్ విజయలక్ష్మి ఏపీలో వాతావరణ పరిస్థితులపై పరిశోధనలు చేశారు. అధిక ఉష్ణోగ్రతలున్న ప్రాంతాల్లో ఏసీలు లేకుండా లోపల చల్లగా ఉండే విధంగా బిల్డింగ్(గ్రీన్ బిల్డింగ్)ల రూపకల్పనపై ప్రయోగం చేశారు. ఆమె రాసిన 60 పరిశోధనా పత్రాలన్నీ స్కోపస్ ఇండెక్స్ (ప్రముఖ అంతర్జాతీయ పత్రాల పరిశోధన సంస్థ)లో వచ్చాయి. మైలవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ దేవానంద్ కుమార్ తెలుగులో ఎంఏ, పీహెచ్‌డీ, హిస్టరీలో ఎంఏ, ఎంఈడీ చేశారు. 38 పరిశోధక పత్రాలు, ఐదు గ్రంథాలు రాశారు. ఏలూరు జిల్లా మండవల్లికి చెందిన ఈయన గత ఏడాది ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2024ను అందుకున్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

రేపటికి వాయుగుండంగా మారే అవకాశం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



శ్రీకాకుళం బస్టాండ్‌లో వాన నీటిలో ప్రయాణికుల పాట్లు

ఉత్తర ఒడిశాకు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది రెండు రోజుల్లో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం ఉదయం నుంచి ఉత్తర కోస్తాలోని అనేక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లా పోలాకిలో 11.17, నరసన్నపేటలో 10.42, శ్రీకాకుళంలో 9, ఆమదాలవలసలో 8.28, పాత కొప్పెర్లలో 7.7, భీమిలిలో 6.5, సాలవువానిపాలెంలో 6, శ్రీకాకుళంలో 5.8, నాతయ్యపాలెంలో 5.57 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోస్తాలోని 65 ప్రాంతాల్లో 4 సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. బుధవారం ఉత్తరకోస్తాలో అనేక చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఉత్తరకోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉత్తరాంధ్ర తీరంలో బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కళింగపట్నం, భీమునిపట్నం, విశాఖపట్నం, గంగవరం, కాకినాడ ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు.

జగన్ భూతం సీసాలో బందీ: నిమ్మల

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జరిగిన ఎన్నికల్లో వైఎస్ జగన్ అనే భూతాన్ని ప్రజలు బంధించి సీసాలో వేసి మూత పెట్టేశారని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. సీసా మూత తెరిస్తే భూతం బయటకొస్తుందని, అయితే వచ్చే ఎన్నికల్లోనూ ఆ పని చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో సానుకూలత వ్యక్తం కావడంతోపాటు, ప్రభుత్వానికి మంచి పేరు రావడంతో వైసీపీలో గుబులు మొదలైంది. అందుకే రాష్ట్రంలో అశాంతిని కలిగించేలా పేటీఎం బ్యాచ్‌లతో అసత్య ప్రచారానికి పాల్పడుతోంది. మానవత్వం లేని జగన్ విషప్రచారం చేస్తున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంపై మొసలి కన్నీరు కారుస్తున్నారు' అని నిమ్మల అన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ 25 పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో కొత్త కార్యవర్గాల ఏర్పాటు కోసం అభిప్రాయ సేకరణ మంగళవారంతో పూర్తయిందని తెలిపారు.

యువతకిచ్చిన హామీని నెరవేర్చాం: కొనకళ్ల

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యువతకు ఇచ్చిన మాట ప్రకారం తమ ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించిందని ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో 13 డీఎస్సీల ద్వారా 1,96,619 టీచర్ పోస్టులు భర్తీ చేశారని తెలిపారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయుల్లో అధికశాతం చంద్రబాబు హయాంలో నియమితులైన వారేనన్నారు.

విద్యార్థులను అభినందించే సంస్కారమూ లేదా?

» జగన్‌పై పిల్లి మాణిక్యరావు ఆగ్రహం

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో కష్టపడి చదివి ఐఐటీ, నీట్ వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షల్లో రాణించిన 55 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు సీఎం చంద్రబాబు ఒక్కొక్కరికీ రూ.లక్ష బహుమతి అందజేశారని, కానీ జగన్ దళిత విద్యార్థుల విజయాలను అభినందిస్తూ ఒక్క ట్వీట్ కూడా చేయలేదని ఏపీ లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను అభినందించే సంస్కారమూ లేదా అని నిలదీశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

కాంగ్రెస్ వైషమ్యాలు పెంచే ప్రయత్నం చేస్తోంది: మాధవ్

కాకినాడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ దేశంలో వైషమ్యాలు పెంచే ప్రయత్నం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం పండగలకు ట్యాక్స్‌లు పెట్టి, పోలీసు ఆంక్షలు విధించి పలు ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వినాయక చవితి, దసరా ఉత్సవాలకు ఉచిత కరెంట్ ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం శుభపరిణామమని, మంత్రి లోకేశ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రిపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నా!

» టీడీపీ క్రమశిక్షణ కమిటీకి రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి వివరణ

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): 'కొన్ని చానళ్లలో తాను పొరపాటున ఓ మంత్రిపై ఆవేదనతో అనుచిత వ్యాఖ్యలు చేశానని.. ఎవరిపైనా తనకు వ్యక్తిగత కక్ష లేదని తిరుపతి జిల్లాకు చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన పార్టీ క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరై తన సంజాయిషీ ఇచ్చారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ.. తాను మంత్రిపై చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపపడుతున్నట్లు తెలిపారు. ఆ వ్యాఖ్యలను క్రమశిక్షణ కమిటీ ముందు వెనక్కి తీసుకున్నట్లు చెప్పారు. ఇటీవల సుధాకర్‌రెడ్డి టీవీ డిబేట్‌లో ఓ మంత్రిపై చేసిన వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాలని ఆయన్ను ఆదేశించింది. దీంతో ఆయన సదరు కమిటీ సభ్యులు వర్ల రామయ్య, పంచుమర్తి అనూరాధ, కొనకళ్ల నారాయణరావు ముందు హాజరై వివరణ ఇచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రికి జిల్లా సమస్యలు చెప్పడానికి వెళ్తే.. తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా ఆయన హోటల్ రూంలో ఏకాంతంగా గడపడం వల్లే తానలాంటి వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని సుధాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఐపీఎస్ సంజయ్ లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)



విజయవాడలోని ఏసీబీ న్యాయ స్థానం వద్ద ఐపీఎస్ సంజయ్

మంగళవారం తన న్యాయవాదులతో కలిసి విజయవాడలోని ఏసీబీ కోర్టుకు వచ్చారు. న్యాయాధికారి పి.భాస్కరరావు సంజయ్‌కు వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు రిమాండ్ విధించారు. దీంతో ఆయన్ను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. కాగా.. ఈ కేసులో మరింత లోతుగా విచారించేందుకు సంజయ్‌ను వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కోర్టులో పిటిషన్ వేశారు. ఆయన గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నారని, మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని సంజయ్ తరఫు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. ఆయనకు ఏషియన్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స జరిగిందంటూ సంబంధిత రిపోర్టులను కోర్టుకు సమర్పించారు. మధ్యంతర బెయిల్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీని.. కస్టడీపై కౌంటర్ వేయాలని సంజయ్ తరఫు న్యాయవాదులను ఆదేశిస్తూ న్యాయాధికారి విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేశారు. మరోవైపు.. జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సంజయ్‌కు జైలు అధికారులు 7971 నంబర్‌ను కేటాయించారు.

దళితుల సొమ్ము స్వాహా

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): దళితులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు స్వాహా చేసిన సీఐడీ మాజీ ఏడీజీ ఎన్.సంజయ్.. అంతకు ముందు అగ్నిమాపక శాఖలో ఉన్నప్పుడు..ఎన్‌వోసీలు ఆన్‌లైన్‌లో జారీ చేసేందుకు మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, ట్యాబ్‌ల కొనుగోళ్లలో రూ. 1.19 కోట్ల అవినీతికి పాల్పడినట్లు తేలింది. దీనిపై టీడీపీ కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం జరిపిన విచారణలో ఆయన అవినీతి బాగోతం బయటపడింది. సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. మరోవైపు అగ్నిమాపక శాఖలో కూడా ఆయన అధికార దుర్వినియోగానికి పాల్పడి బిడ్ రిగ్గింగ్, టెండర్లు కట్టబెట్టడంలో పక్షపాత ధోరణి అవలంబించినట్లు తేలింది. సౌత్రికా టెక్నాలజీస్‌కు యాప్ అభివృద్ధి పేరుతో బిల్లులు చెల్లించి రూ.59.93 లక్షలు దుర్వినియోగం చేసినట్లు విజిలెన్స్ గుర్తించింది. 'అగ్ని-ఎన్‌వోసీ' వెబ్‌సైట్ రూపకల్పన, యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కోసం 2023 జనవరిలో టెండర్లు పిలిచారు. ముందే ఎంపిక చేసుకున్న మూడు సంస్థలతో బిడ్లు వేయించి ఎల్-1గా సౌత్రికా టెక్నాలజీస్ బిడ్‌ను ఖరారు చేశారు. మొత్తం రూ.2.29 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులో పనులు జరగకుండానే రూ.59.93 లక్షలు చెల్లించేశారు. మార్కెట్ ధరకన్నా ఎక్కువకు ట్యాబ్‌ల కొనుగోలు, బిడ్ వేసిన సంస్థకు నిబంధనలు అతిక్రమించి బిల్లులు చెల్లించడం వెనుక అవినీతి జరిగిందని విజిలెన్స్ స్పష్టం చేసింది. దీంతో ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వగా, ప్రభుత్వ విజ్ఞప్తితో దానిని సుప్రీంకోర్టు రద్దుచేసింది. లొంగుబాటుకు 3 వారాలు గడువిచ్చింది. దరిమిలా మంగళవారం ఏసీబీ కోర్టులో ఆయన లొంగిపోయారు.

ఐపీఎస్ సునీల్‌కుమార్ సస్పెన్షన్ పొడిగింపు

సీఐడీ మాజీ చీఫ్, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను రాష్ట్రప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అక్రమాలపై ఈ ఏడాది మార్చిలో ఆయన సస్పెండైన సంగతి తెలిసిందే. సస్పెన్షన్‌ను తాజాగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 24 వరకూ కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ చీఫ్‌గా ఉంటూ ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ పర్యటనలు చేయడం, అగ్రిగోల్డ్ బాధితుల నిధులు దుర్వినియోగం, అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేయడం.. అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్నప్పుడు జరిగిన అవినీతి మొదలైనవి ఆయన్ను చుట్టుముట్టాయి. అగ్నిమాపక శాఖలో అవినీతిని విజిలెన్స్ నిగ్గు తేల్చగా.. అగ్రిగోల్డ్ బాధితుల సొమ్ము స్వాహాపై ఏసీబీ కేసు నమోదు చేసింది. మరోవైపు కస్టోడియల్ టార్చర్‌కు సంబంధించిన కేసు గుంటూరులోని నగరంపాలెం పోలీసు స్టేషన్లో నమోదైంది.



కప్పట్రాళ్ల గ్రామం ఏరియల్ వ్యూ

కత్తులు వదిలి.. కలం, హలం!

(మొదటి పేజీ తరువాయి)

సంబరమైనా ఈ ఊళ్లోనే." అంటూ దత్తత తీసుకున్నారు. "రోడ్లు, మురుగుకాల్వలు, తాగు నీరు వంటి వసతులు కల్పిస్తే చాలా?. కానే కాదు, మనుషులు మారాలి.. వాళ్ల మనసులు మారాలి." అని సంకల్పించారు. అది జరగాలంటే కత్తులు పట్టిన చేతులు కలం.. హలం పట్టాలని భావించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) వంటి సంస్థల సహకారంలో ఓ వైపు ప్రగతి పనులు చేయిస్తూనే.. మరో వైపు చదువు.. ఉద్యోగం.. ఉజ్వల భవితపై యువతలో ఆసక్తి పెంపొందించారు. ఏడాదికిపైగా నిరుద్యోగ యువతకు ఆయన ఇచ్చిన ప్రేరణ ఫలించింది. ఫ్యాక్షన్ జోన్‌గా పేరుబడ్డ కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల నుంచి తాజా డీఎస్సీలో ఎనిమిది మంది గురువులుగా ఎంపికయ్యారు. ఆ ఐపీఎస్ అధికారే ఒకప్పటి కర్నూలు ఎస్పీ, ప్రస్తుత ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ.

రవికృష్ణ స్ఫూర్తి..

కప్పట్రాళ్లను దత్తత తీసుకున్న ఐపీఎస్ ఆకే రవికృష్ణ. ఇక్కడి చదువుకున్న యువత అభిరుచులు గుర్తించారు. పోలీస్ అవ్వాలని అనుకున్నవారికి ఉచిత కోచింగ్ సహా హాస్టల్ వసతి కల్పించారు. ఆయన ప్రేరణతో నలుగురు యువకులు కానిస్టేబుళ్లగా ఎంపికయ్యారు. రవికృష్ణ బదిలీపై వెళ్లినా ఈ ఊరును మరువలేదు. ఉద్యోగాల కోసం సాధన చేసే నిరుద్యోగ యువతకు చేయూతగా నిలిచారు. కూటమి ప్రభుత్వం రాగానే 'మెగా డీఎస్సీ' ప్రకటన ఇచ్చింది. దీంతో కప్పట్రాళ్ల గ్రామంలో డిప్లమో ఇన్ ఎడ్యుకేషన్(డీఈడీ) చేసిన 15 మందిని గుర్తించారు. తాను అడ్మిన్‌గా ఉంటూ ఆ 15 మందితో 'డీఎస్సీ-2025' వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేశారు. తాను సివిల్స్‌కు ఎలా సాధన చేశారో.. అదే తరహాలో వారితో సాధన చేయించారు. నిత్యం వారికి ఫోన్లో అందుబాటులో ఉంటూ గైడ్ చేశారు. అంతేకాదు ప్రతి 10-15 రోజులకు ఒకసారి గంటకు పైగా జూమ్ వీడియో సమావేశం నిర్వహించి.. ఆ పక్షం రోజులు వారి సాధన ఎలా ఉంది? ఎలాంటి పొరపాట్లు చేశారు? రాబోయే 15 రోజులు ఎలా సాధన చేయాలి? రోజువారి పరీక్షలు ఎలా రాయాలి? వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఒకటి రెండు నెలలు కాదు.. ఏకంగా ఏడాదికిపైగా ప్రణాళికా బద్ధంగా సాధన చేయించారు. ఆయన ప్రణాళిక ఫలించింది. డీఎస్సీ-2025లో ఏకంగా ఎనిమిది మంది ఎస్జీటీ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారంతా కార్పొరేట్ పాఠశాల, కళాశాలల్లో చదవలేదు. 1-10వ తరగతి వరకు ఊళ్లోని ప్రభుత్వ బడిలో, ఇంటర్మీడియట్ కోడుమూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు మీడియంలో చదివిన వారే. కప్పట్రాళ్ల దత్తపుత్రుడు ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ ఎంత ఒత్తిడి ఉన్నా.. దత్తత తీసుకున్న ఊరి యువత భవిష్యత్తు కోసం కృషి చేయడమే తమను విజేతలుగా నిలిపిందని ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు చెబుతున్నారు.

దత్తతతో మార్పు!

కర్నూలు జిల్లా దేవనకొండ మండలంలో ఫ్యాక్షన్ గ్రామం కప్పట్రాళ్ల. ఆధిపత్యం కోసం మొదలైన గొడవలు ఫ్యాక్షన్ భూతంగా మారాయి. దాడులు, ప్రతి దాడుల్లో ఎందరో అసువులు బాశారు. 2014లో కర్నూలు ఎస్పీగా ఆకే రవికృష్ణ బాధ్యతలు తీసుకున్నారు. కప్పట్రాళ్లలో మార్పు తీసుకురావాలని సంకల్పించారు. ఈ క్రమంలోనే 2015లో కప్పట్రాళ్లను దత్తత తీసుకున్నారు. 'సేవ్ ట్రీస్' అనే సంస్థ సహకారంతో రైతులకు ఉచితంగా 60 వేల పండ్ల మొక్కలు పంపిణీ చేయించారు. కొందరు రైతులు ఇప్పుడు ఆదాయం కూడా ఆర్జిస్తున్నారు. రైతుల ఉత్పత్తుల నిల్వకు రూ.20 లక్షలతో సోలార్ శీతల గిడ్డంగి నిర్మించారు. మహిళలనూ పొదుపు సంఘాల్లో చేర్పించి సుమారు రూ.30 లక్షలకు పైగా రుణాలు ఇప్పించారు. 'తానా' సహకారంతో సుమారు రూ.40 లక్షల వ్యయంతో 'స్త్రీ శక్తి' భవనాన్ని నిర్మించారు. ఆకే రవికృష్ణ సతీమణి పార్వతీదేవి కూడా ఓ పొదుపు సంఘం సభ్యురాలే. నేను సైతం.. అంటూ ఆమె కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చల్లో పాల్గొంటూ దిశానిర్దేశం చేస్తుంటారు. అన్నదాతలు, మహిళలకు దారి చూపిన రవికృష్ణ. పదెకరాల విస్తీర్ణంలో పాఠశాల, ప్రహరీ నిర్మించారు. దాతల సహకారంతో కల్యాణ మండపం, రైతు భవనాలు, వాటర్ ప్లాంట్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించారు.



2024లో గ్రామస్థులతో కలిసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఆకే రవికృష్ణ

అమ్మ, అన్న ప్రోత్సాహం మరవలేను



ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికై బడిలో అడుగుపెట్టబోతున్నానంటే మోటివేషన్ చేసిన ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ సార్, అమ్మ చంద్రమ్మ, అన్న ఉపేంద్ర ప్రోత్సాహం ఎంతో ఉంది. వారిని జీవితంలో మరవలేను. నాన్న శ్రీనివాసులు చనిపోతే, అమ్మ టైలరింగ్ చేస్తూ, అన్న వ్యవసాయ పనులు చేస్తూ నన్ను చదివించారు. డీఎస్సీ-2025లో మెరిట్ సాధించి ఉద్యోగం సాధించడానికి నాతో సహా మా మిత్రులకు రవికృష్ణ సార్ మోటివేషన్ ఎంతగానో దోహదపడింది. - ఈ. ఉత్తేజ్ గౌడ్

సార్ ప్రోత్సాహం మరవలేనిది



అమ్మ నాన్నలు లక్ష్మీదేవి, రాముడు. పొలంలో పనులు చూస్తూ చదివించారు. ఊళ్లోనే పదవ తరగతి వరకు, కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివాక.. డీఎడ్ చేశాం. మా ఊరును దత్తత తీసుకున్న ఈగల్ చీఫ్ రవికృష్ణ ప్రోత్సాహంతో కోచింగ్ సెంటర్లో రెండు నెలలు శిక్షణ తీసుకున్నాం. తొలి ప్రయత్నంలోనే అన్నాచెల్లెళ్లు ఇద్దరం ఎస్జీటీ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాం.

- చింతమాను శ్రీరాములు, రాజేశ్వరి

నాడు వలస కూలీలు.. నేడు టీచర్లు



మాది నిరుపేద కుటుంబం. రెండెకరాలు పొలం ఉన్నా.. అమ్మ నాన్నలు రంగమ్మ, కృష్ణలు కూలీ పనులు చేస్తూ, రాళ్లు కొడుతూ మమ్మల్ని బడికి పంపారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని తెలియడంతో రవికృష్ణ సార్ మాతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి మోటివేషన్ చేశారు. ఆయన ఇచ్చిన ప్రణాళిక ప్రకారం సాధన చేయడం వల్లే ఎస్జీటీ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాం.

- ఎన్.రామాంజనేయులు, రామానాయుడు

జూమ్ శిక్షణ గెలిపించింది



మాది వ్యవసాయ కుటుంబం. అమ్మనాన్నలు జయలక్ష్మి, రంగన్నలు పొలంలో పనులు చేస్తూ చదివించారు. కోడుమూరు సమీపంలోని ఠాగూర్ డీఈడీ కళాశాలలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేశాను. మా ఊరు దత్తపుత్రుడు ఆకే రవికృష్ణ సార్ ప్రేరణ మాకు ఎంతో ఉపయోగ పడింది. జూమ్ సమావేశంలో అవగాహన కల్పించారు. ప్రణాళిక బద్ధంగా సాధన చేయించారు. గురువుగా ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

- మర్యాద రామకృష్ణ



మణిదీప్ గాయబ్!

- అజ్ఞాతంలోకి రాజమండ్రి డిప్యూటీ తహశీల్దార్
- డ్రగ్స్ గురించి తనకేమీ తెలియదని తొలుత కబుర్లు..లీవ్ లెటర్ పంపి.. ఫోన్ స్విచాఫ్

రాజమహేంద్రవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ ముఠా, రేవ్ పార్టీల నిర్వహణలో కీలక వ్యక్తి రాజమహేంద్రి డిప్యూటీ తహశీల్దార్ (డీటీ) మణిదీప్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. తనకేమీ సంబంధం లేదని, తాను ఆఫీసు వదలి ఎక్కడకూ పోలేదని సోమవారం స్పష్టంచేసిన డీటీ.. మంగళవారం ఆఫీసుకు సెలవుపెట్టాడు. తన తల్లికి ఆరోగ్యం బాగోని కారణంగా నాలుగు రోజులు సెలవు కావాలని లెటర్ రాసి పంపాడు. తర్వాత ఫోన్ స్విచాఫ్ చేశాడు. దీంతో అతడు అమాయకుడని, ఈ కేసుతో సంబంధం లేదని చెప్పిన అధికారులు, ఉద్యోగులు ముక్కున వేలేసుకున్నారు. అతడి వ్యవహారాలపై తేల్చాలని కోరుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి అభిషేక్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో రాజేశ్వరి నిలయం సర్వీసు అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీపై సోమవారం ఈగల్ టీమ్, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో డ్రగ్స్ ముఠా గుట్టు రట్టవడం.. ఇందులో మణిదీప్ పేరు బయటకు రావడం తెలిసిందే. అతడు ప్రస్తుతం ధవళేశ్వరంలోని పోలవరం భూసేకరణ పరిపాలనా కార్యాలయంలో చింతూర్ డివిజన్‌లోని వీఆర్ పురం యూనిట్ స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ భూసేకరణ పనులు చూడాల్సి ఉండగా.. అక్కడకు వెళ్లకుండా కోర్టు కేసులపై రాజమండ్రిలోనే ఎక్కువగా తిరుగుతున్నాడని ఓ అధికారి వెల్లడించారు.

లిక్కర్ కేసు నిందితులకు 9 వరకు రిమాండ్ పొడిగింపు

- ఏసీబీ కోర్టు ఉత్తర్వులు
- కోర్టులో వాదనలు వినిపించిన నిందితులు

విజయవాడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో నిందితులకు రిమాండ్‌ను సెప్టెంబరు 9 వరకు ఏసీబీ కోర్టు పొడిగించింది. ఈ కేసులో వివిధ జైళ్లలో ఉన్న 12 మంది నిందితులను పోలీసులు కోర్టులో సోమవారం హాజరుపరిచారు. వారికి రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులిచ్చారు. అంతకుముందు కోర్టుకు రాజ్ కసిరెడ్డి తన వాదనను వినిపించారు. సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ. 11 కోట్లు తనవే అయితే వాటిపై తన వేలిముద్రలు ఉంటాయన్నారు. రాజమండ్రి జైలు నుంచి విజయవాడ కోర్టుకు వచ్చే దారిలో సిబ్బంది ఫోన్‌తో తన కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు అనుమతించాలని మిథున్‌రెడ్డి అభ్యర్థించారు. దీనిని న్యాయాధికారి తోసిపుచ్చారు. కాగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తీర్పును 30వ తేదీ వెలువరిస్తామని న్యాయాధికారి తెలిపారు.

దాడి చేసి.. ఇస్త్రీ పెట్టెతో వాతలు పెట్టి!

- తూర్పుగోదావరి జిల్లాలో ఓ విద్యార్థికి తోటి విద్యార్థుల చిత్రహింసలు



రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్

రాజోలు/రాజమహేంద్రవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మధ్య మనస్పర్థలు ఒకరిపై విచక్షణారహితంగా దాడి చేసి.. ఏకంగా ఇస్త్రీ పెట్టెతో శరీరంపై వాతలు పెట్టే వరకూ వెళ్లింది. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లాలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థి, తల్లి తెలిపిన వివరాల మేరకు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం శంకరగుప్తం గ్రామానికి చెందిన గుర్రం విన్సెంట్ ప్రసాద్ రాజమహేంద్రవరం మోరంపూడిలోని ఓ ప్రైవేటు కార్పొరేట్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ బాలుడితో పాటు విశాఖపట్నం, గోకవరం, రాజోలుకు చెందిన పలువురు విద్యార్థులు కూడా ఆ స్కూల్‌కు చెందిన హాస్టల్‌లోని ఒకే రూమ్‌లో ఉంటారు. వీరిలో ఇద్దరు హాస్టల్‌లోని ఒక సీసీకెమెరాను తీసి తన బ్యాగులో పెట్టిన విషయాన్ని ప్రసాద్ ప్రిన్సిపాల్‌కు చెప్పాడు. దీంతో కక్ష పెంచుకున్న వారు ఈనెల 18న హాస్టల్ రూమ్‌లో ప్రసాద్‌ను విచక్షణారహితంగా కొట్టి.. ఇస్త్రీ పెట్టెతో కాళ్లు, పొట్ట, చేతులపై వాతలు పెట్టారు. ఎవరికైనా చెబితే మళ్లీ కొడతామని బెదిరించారు. దీంతో బాధితుడు ఎవరికీ చెప్పకుండా బాధను భరిస్తూ వారం రోజులు గడిపాడు. ఈనెల 25న (సోమవారం) హాస్టల్‌కు వెళ్లిన తల్లి లక్ష్మీకుమారి.. కుమారుడి చేతిపై గాయాలు చూసి అడగ్గా.. వేడినీళ్లు పడ్డాయని ప్రసాద్ అబద్ధం చెప్పాడు. ఆ తర్వాత ఇద్దరూ ఇంటికి వచ్చారు. అనంతరం కుమారుడు పొట్టపై పెద్దగా కాలిన గాయం కనబడడంతో తల్లి నిలదీసింది. దీంతో ప్రసాద్ హాస్టల్‌లో జరిగిన ఘటన గురించి చెప్పాడు. బాధిత బాలుడిని మంగళవారం రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. తల్లి ఫిర్యాదుతో డీఎస్ ఈవో వాసుదేవరావు స్వయంగా స్కూల్‌కు వెళ్లి ఆరా తీశారు. కాగా, దాడి ఘటనను గోప్యంగా ఉంచడం దారుణమని దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ అన్నారు.

సెంట్రల్ జైలే.. డెన్

- నాడు ఖాకీ, ఖద్దరు అండతో చెలరేగిన శ్రీకాంత్
- వైసీపీ హయాంలో వీఐపీ హోదా
- నెల్లూరు జైలులో ఖైదీలపై ఆధిపత్యం
- అక్కడే పంచాయితీలు, నేరాలకు స్కెచ్
- కట్టడి చేయలేక విశాఖ జైలుకు తరలింపు

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ హయాంలో వ్యవస్థలు ఎంతగా నాశనమయ్యాయో చెప్పేందుకు జీవితఖైదీ శ్రీకాంత్ వ్యవహారమే నిదర్శనం. కట్టుదిట్టమైన భద్రత, నిఘా ఉండే నెల్లూరు సెంట్రల్ జైలు అతనికి డెన్‌గా మారింది. గత ప్రభుత్వంలో శ్రీకాంత్ కోసం వైసీపీ ఎమ్మెల్యేల నుంచి రాష్ట్ర ఉన్నతాధికారుల వరకు నెల్లూరు సెంట్రల్ జైలు అధికారులకు సిఫారసులు చేశారు. ఆ ఐదేళ్లు శ్రీకాంత్ జైలులో వీఐపీ హోదాను అనుభవించాడు. పోలీస్ ఉన్నతాధికారులు కూడా శ్రీకాంత్ మనోడే అన్నట్లుగా చూసుకోమన్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు అతడి పెరోల్‌కు పలుసార్లు లేఖలు ఇవ్వడమే కాకుండా తరచూ జైలు ఉన్నతాధికారులకు ఫోన్ చేసి యోగక్షేమాలు విచారించారు. దీంతో జైలులో అతని పెత్తనం మొదలైంది. శ్రీకాంత్ చెప్పినట్టు ఖైదీలు నడుచుకునేవారు. ఖైదీలు ఆసుపత్రికి వెళ్లాలన్నా అతని అనుమతి తప్పనిసరి. జైలు లోపలికి అడుగుపెట్టిన ప్రతి రిమాండ్ ఖైదీ అతన్ని కలవాల్సిందే. ఏ నేరం కింద జైలుకు వచ్చాడో చెప్పాలి. వివిధ నేరారోపణలపై జైలుకు వచ్చిన రిమాండ్ ఖైదీలను అతను ఆకర్షించాడు. జైలు భోజనం ఉప్పు, కారం లేకుండా ఉంటాయి. కానీ శ్రీకాంత్‌ను కలిస్తే వారి భోజనంలో ఆ రెండు ఉంటాయి. ఉప్పు బాటిల్ నుంచి అప్పడాలు, చెకోడీలు, సిగరెట్ల వరకు అన్నీ శ్రీకాంత్ వద్ద అందుబాటులో ఉండేవి. వీటన్నింటికి మించి మొబైల్ ఫోన్ ఉండేది. రిమాండ్ ఖైదీలకు ఈ సౌకర్యాలు కల్పించి శ్రీకాంత్ వారిని తన గుప్పిట్లో పెట్టుకున్నాడు. వారు బయటికి వెళ్లగానే తన మనుషులను కలవమని చెప్పేవాడు. అలా వీరు ఆ గ్యాంగ్‌లో సభ్యులయ్యారు. తెలిసో తెలియకో ఏదో ఒక నేరం చేసి రిమాండ్ జీవితం అనుభవించిన పలువురు యువకులు శ్రీకాంత్ నేర సామ్రాజ్యంలోకి ప్రవేశించి వెనక్కి రాలేని స్థితికి చేరుకున్నారు. వందలాది మంది రౌడీషీటర్లతో ముఠా ఏర్పాటు చేసుకున్నాడు. తనకు అన్ని విధాలా సహకరిస్తున్న జైలు సిబ్బందికి నెలనెలా మామూళ్లు అందజేసేవాడు. ములాఖత్ పేరుతో రౌడీషీటర్లు శ్రీకాంత్‌ను కలిసేవారు. జైలులోనే పంచాయితీలు, నేరాలకు స్కెచ్‌లు వేసేవారు.

అక్కడే ఉంటే ప్రమాదమని..

నెల్లూరు సెంట్రల్ జైలుపై పూర్తి పట్టు సాధించుకున్న శ్రీకాంత్‌ను అక్కడే ఉంచితే కట్టడి చేయడం కష్టమనే ఉద్దేశంతో జైళ్ల శాఖ అతన్ని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించింది. శ్రీకాంత్‌కు గతంలో జైలు నుంచి తప్పించుకున్న చరిత్ర ఉంది. విశాఖ కేంద్ర కారాగారంలో ఉన్న అతనికి కొన్ని సౌకర్యాలను నిలుపుదల చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. కాగా రౌడీషీటర్ శ్రీకాంత్, అరుణ విషయంలో పోలీసులు విభిన్న కోణంలో లోతుగా విచారించాలని, వారితో ఎవరికి లింకులు ఉన్నా విడిచి పెట్టవద్దని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

పోలీసు కస్టడీకి అరుణ

కోవూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): 'కిలేడి' అరుణను పోలీసు కస్టడీకి ఇస్తూ కోవూరు అదనపు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ శారదారెడ్డి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. బెయిల్ కోరుతూ అరుణ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేశారు. నెల్లూరు జిల్లా కోవూరు మండలం పడుగుపాడులోని తన అపార్టుమెంటులో ప్లాటును ఆక్రమించిన అరుణ, ఆమె అనుచరులు తనపై దౌర్జన్యానికి పాల్పడ్డారని వ్యాపారి మురళీకృష్ణ 19న కోవూరు పోలీసులకు ఫిర్యాదు చేయడం.. ఆమెను అరెస్టుచేసి జైలుకు తరలించడం తెలిసిందే.

కడప జైలులో మెడికల్ క్యాంపుపై విచారణ

- చైతన్యరెడ్డి తనను బెదిరించాడన్న దస్తగిరి ఆరోపణలపై రంగంలోకి కమిటీ

కడప క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-5 దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి కడప జైలులో తనను బెదిరించారన్న అప్రూవర్ దస్తగిరి ఆరోపణను నిగ్గుదేల్చేందుకు ఏర్పాటైన విచారణ కమిటీ రంగంలోకి దిగింది. కర్నూలుఎస్పీ విక్రాంత్‌పాటిల్ నాయకత్వంలోని టీమ్ మంగళవారం కడప జైలుకు వెళ్లింది. అప్పటి జైలు పర్యవేక్షణాధికారి ప్రకాశ్, జైలర్ రఫీ, డిప్యూటీ జైలర్ గాజుల మహ్మద్ రఫీలతో పాటు సిబ్బందిని, ఖైదీలను విచారించారు. వారి వాంగ్మూలాలు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ డాక్టర్లు లేకుండా ప్రైవేటు డాక్టర్లతో జైల్లో క్యాంపు ఏర్పాటు నిర్ణయం.. నాడు జైల్లో పనిచేస్తున్న డాక్టర్ పుష్పలతదా లేక పైనుంచి రాజకీయ ఒత్తిళ్లు వచ్చాయా అన్నది అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.